




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








శనివారం | 21-3-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 336 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి ఉ. 7.57 వరకు తదుపరి త్రయోదశి; నక్షత్రం: ధనిష్ఠ రా. 7.40 తదుపరి శతభిషం; వర్జ్యం: తె. 3.42-5.29; దుర్ముహూర్తం: ఉ. 6.22-7.58; అమృతఘడియలు: ఉ. 8.09-9.55; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore




## పార్లమెంటుకూ కరోనా సెగ!

### గాయని కనికా కపూర్‌కు పాజిటివ్

**ఆమె ఇచ్చిన పార్టీకి ఎంపీ దుష్యంత్ సింగ్**

**పలువురు ఎంపీలను, రాష్ట్రపతిని కలిసిన ఎంపీ**

**తన తల్లి వసుంధర రాజెతో కలిసి క్వారంటైన్‌లో**

**వారిద్దరి బాటలో పలువురు ఎంపీలు**

**కనికా కపూర్‌పై ఎఫ్ఐఆర్‌కు ఆదేశం**



కనికా కపూర్



దర్శనాలు నిలిపివేయడంతో ఖాళీగా శ్రీవారి మహాద్వారం

న్యూఢిల్లీ, మార్చి 20: కరోనా సెగ పార్లమెంటునూ తాకింది. విదేశాలకు వెళ్లి వైరస్ బారిన పడిన ఓ బాలీవుడ్ గాయని.. పలువురు ఎంపీల స్వీయ క్వారంటైన్‌కు కారణమవుతోంది!! ఆ గాయని.. కనికాకపూర్. బ్రిటన్‌లో పర్యటించిన ఆమె మార్చి 9న ముంబైకి చేరుకున్నారు. అక్కణ్నుంచి 11న లఖ్‌నవుకు చేరుకున్నారు. 13, 14, 15 తేదీల్లో ఆమె మూడు పార్టీలకు హాజరయ్యారు. అందులో ఒకటి.. మాజీ ఎంపీ అక్బర్ అహ్మద్ డంపీ మేనల్లుడు ఇచ్చిన విందు. ఆ పార్టీకి రాజస్థాన్ మాజీ సీఎం

మిగతా 10వ పేజీలో...

## చాప కింద నీరులా..

**రాష్ట్రంలో నాలుగో పాజిటివ్ కేసు?**

**తూర్పు గోదావరి వ్యక్తికి కరోనా!**

**విశాఖ రోగి సన్నిహితంగా మెలిగిన 17 మందిపై దృష్టి** 9

**భార్య, కుమార్తె ప్రత్యేక వార్డుకు**

**వారిలో ఒకరికి వ్యాధి లక్షణాలు?**

**పెరుగుతున్న అనుమానిత కేసులు**

**నెల్లూరులో 9.. కృష్ణాలో 5**

## కాలిఫోర్నియా బంద్

**4 కోట్ల మంది ప్రజలు ఇళ్లకే పరిమితం**

**2.5 కోట్లమందికి వైరస్ ముప్పు: గవర్నర్**

**అమెరికాలో 200 దాటిన మరణాలు**

**15 వేలకు చేరిన పాజిటివ్ కేసులు**

**ఇరాన్‌లో పది నిమిషాలకో మృతి** 10

**ప్రపంచవ్యాప్తంగా 10,080 మరణాలు**

**160 మంది తెలుగువారిని పంపేసిన కువైత్**

**తెలంగాణలో మరో 3 పాజిటివ్ కేసులు**

**ముంబయి క్వారంటైన్ నుంచి భీమవరం యువకుడి పరారీ.. హైదరాబాద్‌లో పట్టివేత**

### సూటి మాట

'ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ ఉండాలన్న నిర్ణయం ప్రభుత్వ పరిధిలోని అంశమే. కానీ... రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ ఆఫీసులను వెలగపూడి నుంచి తరలించాలన్న నిర్ణయం సదుద్దేశంతో తీసుకున్నది కాదు. ఈ నిర్ణయం వెనుక దురుద్దేశాలు ఉన్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చు.

సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్ 39 కింద ఉన్న జోన్‌లోకి ప్రభుత్వ కార్యాలయాలు వస్తాయి. ఈ చట్టాన్ని ఉపసంహరిస్తూ ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన బిల్లులో కూడా మాస్టర్ ప్లాన్ అమలు ఉంది. దానికి భిన్నంగా కార్యాలయాలను తరలించడం చట్టవిరుద్ధం.

పరిపాలన వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ ఉపసంహరణ బిల్లులు శాసన మండలిలో ఆమోదం పొందకపోవడంతో కార్యాలయాల తరలింపునకు ప్రభుత్వం పరోక్షంగా 'షార్ట్ కట్' విధానాన్ని అనుసరించింది.

- హైకోర్టు ధర్మాసనం

## సర్కారు దురుద్దేశం!



### కార్యాలయాల తరలింపు కుదరదు

**వెలగపూడిలో స్థలాభావం సాకే.. సీఎం నుంచే నేరుగా 'నోట్ ఫైల్ షీట్'**

**ఎవరూ అడక్కుండానే భవనాలను కలెక్టర్ ఎలా వెతికి పెట్టారు?**

**కార్యాలయాలు మాస్టర్ ప్లాన్‌లో భాగం.. వాటి తరలింపు చట్ట విరుద్ధమే**

**విజిలెన్స్, ఎంక్వైరీస్ కమిషనర్ కార్యాలయాల తరలింపు జీవో చెల్లదు**

**హైకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు**

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కార్యాలయాల తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ ఆఫీసులను వెలగపూడి నుంచి కర్నూలుకు తరలించేందుకు వీలుగా ప్రభుత్వం జనవరి 31న జారీ చేసిన జీవో 13 అమలును న్యాయస్థానం నిలిపివేసింది. ఈ జీవో ఏకపక్షమని, దీని జారీలో దురుద్దేశాలున్నాయని తెలిపింది. ఇందుకు తగిన ప్రాథమిక ఆధారాలున్నాయని పేర్కొంది. ఈ జీవో సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్ 39కి విరుద్ధమని స్పష్టం చేసింది. "విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్

మిగతా 7వ పేజీలో...

## ఉరి

### నిర్భయ రేపిస్టుల కథ సమాప్తం



**ఆఖరి క్షణాల్లో స్థిమితం కోల్పోయిన దోషులు**

**ఏడ్చి, విదుల్చుకుని ప్రతిఘటన.. బతికించండంటూ వేడుకోలు**

**రాత్రంతా మెలకువగానే.. భోజనం, స్నానం చేయని వైనం**

**తల్లిదండ్రులను కలుసుకోడానికీ నిరాకరణ**

**ఉరికి గంటన్నర ముందు సుప్రీం విచారణ.. పిటిషన్ కొట్టివేత**

**తలారికి మరో ముగ్గురి సాయం.. ముఖేశ్ అవయవదానం**



"ఈరోజు మార్చి 20... మహిళా లోకానికి ఇది నవోదయం. దేశంలోని అమ్మాయిల, మహిళల గౌరవ చిహ్నం. ఘోరమైన నేరాలకు పాల్పడేవారికి శిక్ష తప్పదని దేశ న్యాయస్థానాలు రుజువు చేశాయి. న్యాయ వ్యవస్థకు, రాష్ట్రపతికి నా కృతజ్ఞతలు. తాత్సారం చేయడానికి దోషుల తరపు న్యాయవాదులు ఎంతో ప్రయత్నించారు. దీని వల్ల చట్టంలోని లొసుగులు బయటపడ్డాయి"

- నిర్భయ తల్లి ఆశాదేవి

న్యూఢిల్లీ, మార్చి 20: నిర్భయ దోషుల కథ ముగిసిపోయింది. 23 ఏళ్ల ఫిజియోథెరపీ విద్యార్థిని (నిర్భయ)ని అతి దారుణంగా సామూహికంగా అత్యాచారం చేసి, ఆమెను చిత్ర హింసల పాల్జేసి చంపేసిన నలుగురు దోషులకు ఎట్టకేలకు మరణదండన అమలు జరిగింది. ఢిల్లీలోని తిహార్ జైలులో శుక్రవారం ఉదయం 5:30 గంటలకు ఉరితీశారు. ముఖేశ్ సింగ్ (32), అక్షయ్ ఠాకూర్ (31), వినయ్ శర్మ (26), పవన్ గుప్తా (25) అనే ఆ నలుగురినీ

మిగతా 11వ పేజీలో...

## నాపై కత్తి కట్టారు!

**పేషీ లేదు.. పీఏ లేడు.. అటెండర్లు లేరు**

**నేను చేయాల్సిన పనులూ సెక్రటరీతోనే**

**ఫైళ్లపై గుడ్డిగా సభ్యుల సంతకాలు**

**నేనుండగానే ఇన్‌చార్జ్ చైర్మన్ నియామకం**

**గవర్నర్‌కు ఏపీపీఎస్సీ చైర్మన్ భాస్కర్ గోడు**



12

## ఒక్కరు కాదు ముగ్గురు

ఎస్ఈసీ రమేశ్‌పై ఆర్డినెన్స్ అస్త్రం!

త్రిసభ్య కమిషన్‌గా మార్చే వ్యూహం

కేంద్ర ఎన్నికల కమిషన్ తరహాలోనే

ఇప్పటికే గవర్నర్‌తో చర్చలు?

అదను చూసి ముందుకెళ్లే యోచన



2



11

## కమల్‌నాథ్ రాజీనామా

**బలపరీక్షకు ముందే తప్పుకొన్న ఎంపీ సీఎం**

**15 నెలలకే కూలిపోయిన సర్కారు**

**బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే బీజేపీ కుట్ర**

**అత్యాశపరులతో కలిసి పడగొట్టింది: కమల్**

**కమలానికి లైన్ క్లియర్ శివరాజ్‌కే చాన్స్!**

**ఉద్యోగులకు ఉగాది కానుకగా**

## డీఏ!

7

**సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి వెల్లడి**








కోవిడ్-19 (కరోనా వైరస్) వ్యాప్తికి చికెన్ కు ఎలాంటి సంబంధం లేదని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజి (NIV)* -పూణె, జె.జె.హాస్పిటల్** -ముంబయి మరియు ససూన్ హాస్పిటల్*** -పూణె సంస్థలకు చెందిన నిపుణులు స్పష్టం చేసారు.

మూలం: ప్రెస్ కాన్ఫరెన్స్ మరియు మీడియా రిపోర్ట్స్

- ప్రపంచంలో ఎక్కడా చికెన్ తినడానికి కరోనా వైరస్ వ్యాప్తికి సంబంధం ఉన్నదని అనలేదు.
- ఇది ఇలా ఉంటే, అమెరికా, చైనా మరియు ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో కరోనా వైరస్ వ్యాప్తి తర్వాత చికెన్ మరియు చికెన్ ఉత్పత్తుల వినియోగం విపరీతంగా పెరిగింది.
- పౌల్ట్రీ మరియు పౌల్ట్రీ ఉత్పత్తుల వినియోగం మానవులకు సురక్షితం మరియు ప్రతి ఒక్కరు సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తున్న తప్పుడు వదంతులను నమ్మవద్దు.
- కరోనా వైరస్‌కు, చికెన్ మరియు గుడ్ల వినియోగానికి సంబంధించి నకిలీ వార్తలు మరియు తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మహారాష్ట్ర పోలీస్ (సైబర్ క్రైం సెల్) వారు అరెస్టు చేసారు.

*నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజి (NIV) భారతదేశంలో వివిధ వైరస్ వ్యాధుల పర్యవేక్షణలో నిమగ్నమైన భారత ప్రభుత్వ ప్రధాన జాతీయ సంస్థ

**జె.జె.హాస్పిటల్ - మహారాష్ట్ర ప్రభుత్వ వైద్యశాల, ముంబయి

***ససూన్ హాస్పిటల్ - మహారాష్ట్ర ప్రభుత్వ వైద్యశాల, పూణె

ప్రజా ప్రయోజనార్థం జారీ చేసినవారు :

Vencobb FRESH CHICKEN
ఆలిండియా పౌల్ట్రీ డెవలప్‌మెంట్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్

NECC
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ

For more information: www.eatchickenstayfit.com



పరంజ్యోతి

## ఓం నరుడు.. నారాయణుడు



సమున్నతమైన భారతీయ ఆధ్యాత్మిక భావజాలానికి.. అనాదిగా ఈ పుణ్య భూమిపై దైవతత్వం గురించిన చింతనా స్రవంతికి ఆధారభూతమైనవి వేదోపనిషత్తులు, భగవద్గీత. ప్రధానంగా.. 'నారాయణాత్ ప్రాణోజాయతే, వాయుర్జోతిరాపః' అంటూ సాగే నారాయణోపనిషత్తులో ఈ తత్వం అందరికీ అర్థమయ్యేలా వివరించబడి ఉంది. నారాయణుడు విశ్వచైతన్య శక్తి. సకల జీవరాశులకు కావలసిన ప్రాణశక్తి, మనసు, ఇంద్రియాలు, పంచభూతాలు ఆయన నుండే ఉద్భవించాయి. ఆయన నుండే ప్రకృతి రూపుదాల్చింది. ఆ పరమాత్మ నుండే విశ్వం ఆవిర్భవించింది. మనం చూస్తున్న సకల చరాచర జగత్తు నారాయణ శక్తి స్వరూపమే తప్ప అన్యం కాదు.

ఆయన ఉనికి లేని స్థల, కాలాదులు ఉండజాలవు. ఆయన ఎరుక లేకుండా ఏమీ చేయలేం. ఒక గురువుగారు శిష్యులందరికీ ఈ (నారాయణ) తత్వాన్ని బోధించి.. ఎవరు, ఏ మేరకు అర్థం చేసుకున్నారో తెలుసుకొనేందుకు చిన్న పరీక్ష పెట్టాడు. అందరికీ తలొక పండు ఇచ్చి ఎవరి కంటా పడకుండా తిని రమ్మన్నాడు. శిష్యులంతా తలోదిక్కు పరుగెత్తారు. కొంతసేపటి తర్వాత ఒక్కొక్కరే వచ్చి తాము ఎంత నిగూఢంగా పండు తిన్నదీ ఆయనకు చెప్పారు. ఒక శిష్యుడు మాత్రం పండును తినకుండా దిగులుగా ముఖం పెట్టుకొని గురువుగారి వద్దకు వచ్చాడు. అదేమని గురువుగారు ప్రశ్నిస్తే.. 'గురువర్యా! ఎంత చాటుకు వెళ్లి తిందామనుకున్నా మీరు మాకు బోధించిన నారాయణ తత్వమే జ్ఞాపకమొచ్చింది. నారాయణుడు లేని చోటు ఏదో తెలియలేదు. అందుకే పండు తినకుండా మీ వద్దకు తిరిగి వచ్చాను' అన్నాడు. తాను బోధించిన నారాయణ తత్వాన్ని కనీసం ఒక్క శిష్యుడైనా సరిగ్గా అర్థం చేసుకున్నాడని గురువు సంతోషించాడు.

బృహత్ నారాయణ స్వరూపమైన ఈ సృష్టిలో భాగమైన నరుడు పరమాణు సదృశమైనవాడే. ఆ దివ్యశక్తి కారణంగా జన్మించి, కొంత కాలం జీవించి, తిరిగి అందులో లయమైపోవలసినవాడే. అందుకే నర, నారాయణుల అవినాభావ సంబంధాన్ని వివరిస్తూ

*నీటియందు పుట్టి, నీటియందు నిలచి*
*నీటియందు నణుగు నీటి బుడగ*
*నరుడు బుద్బుదంబు, నారాయణుడు నీరు*
*వినుము భారతీయ వీరసుతుడ*

..అని సత్య సాయిబాబా చెప్పారు. నీటి మీద పుట్టిన బుడగ అక్కడే కొన్ని క్షణాలపాటు ఉండి, తిరిగి ఆ నీటిలోనే కలిసిపోతుంది. పాంచభౌతికమైన ఈ దేహం కూడా బుడగలాంటిదే. బుడగ జీవితకాలం కొద్ది క్షణాలైతే.. నరుని జీవితకాలం కొన్ని సంవత్సరాలు. క్షణకాలం ఉండే బుద్బుదానికి, సంవత్సరాల తరబడి ఉండే నరదేహానికి పోలిక ఎట్లా కుదురుతుంది అని ఎవరైనా అనుకోవచ్చు. కానీ.. అనంతమైన కాలంతో పోలిస్తే మనిషి వందేళ్ల ఆయుష్షు బుడగప్రాయమే. ఈ విషయం తెలుసుకుని ఉన్న కొద్దిపాటి జీవితకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మంచి పనులే చేస్తూ, చేసిన కర్మల ఫలితాన్ని పరమాత్మకే అర్పిస్తూ, చివరకు ఆ నారాయణుడిలో లయమైపోవాలి.

**- మాదిరాజు రామచంద్రరావు, 93933 24940**



ఎస్ఈసీ రమేశ్ కుమార్ కార్యాలయం వద్ద కేంద్ర బలగాల పహారా

## కమిషనర్‌కు వేధింపులు తప్పు!

- లేఖ అందింది.. సీఎస్‌తో హోం కార్యదర్శి మాట్లాడారు
- లిఖితపూర్వక ఆదేశాలూ ఇస్తాం.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను వేధించడం తప్పని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. అఖిల భారత సర్వీసు అధికారులను వేధించడం ఎంతవరకు సమర్థనీయమని అడగగా.. 'ఆ రకంగా జరగకూడదు. నాకు తెలిసి ఏ అధికారినైనా రాష్ట్రప్రభుత్వం ఇబ్బంది పెడితే కేంద్రం కూడా సహకరించదు. అధికారి భయపడే పరిస్థితి ఉన్నప్పుడు అధిక భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపైనే ఉంటుంది. అవసరమైతే రాష్ట్రప్రభుత్వంతో మాట్లాడతాం. డీజీపీతో నేను కూడా మాట్లాడతాను' అని ఆయన బదులిచ్చారు. లేఖ రాసింది రమేశ్‌కుమారా కాదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ప్రస్తావించగా.. 'మాకు తెలిసినంతవరకు ఆయనే రాశారు. దానిపై ఆయన సంతకమే ఉంది. తనకు భద్రత కల్పించాలని కోరారు. నేను హోం కార్యదర్శితో మాట్లాడాను. ఆయన సీఎస్‌తో మాట్లాడారు. కమిషనర్‌కు పూర్తి స్థాయి భద్రత కల్పించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఆ వివరాలన్నీ నేను కూడా తెలుసుకుంటున్నాను. రమేశ్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నారు. ఆయనకు భద్రత కల్పించారు. ఆయన ఎప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లినా పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని సీఎస్‌ను హోం కార్యదర్శి ఆదేశించారు. ఇది అంతర్గత వ్యవహారమే అయినా దీనిపై లిఖితపూర్వక ఆదేశాలు కూడా ఇస్తాం' అని స్పష్టం చేశారు. ఆ మేరకు హోం కార్యదర్శి అజయకుమార్ భల్లా సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్‌లకు లేఖ రాశారు..

## లారీతో గుద్ది చంపినా ఆశ్చర్యం లేదు

- సీపీఐ జాతీయ నేతలు డీ రాజా, నారాయణ
- ఎస్ఈసీ లేఖపై చర్చకు రండి.. వైసీపీ నేతలకు రామకృష్ణ సవాల్

న్యూఢిల్లీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్ రాసిన లేఖపై దుమారం చెలరేగుతోంది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై సీపీఐ జాతీయ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ తిరుపతిలో మీడియా సమక్షంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "సీఎం జగన్ అత్యంత మూర్ఖపు చక్రవర్తి. ఆయనది ఫ్యాక్షనిస్టుల ప్రభుత్వం. అంతా క్రిమినల్ గ్యాంగ్. నిమ్మగడ్డను లారీతో గుద్ది చంపేసినా ఆశ్చర్యం లేదు" అని అన్నారు. ఆంధ్ర ఎస్ఈసీకి కేంద్రం భద్రత కల్పించాలంటూ ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా నేరుగా అమిత్ షాకు లేఖ రాశారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించడానికి వీలు లేకుండా, భయానక పరిస్థితులు ఏర్పడడానికి సీఎం, మంత్రులను బాధ్యులను చేయాలని లేఖలో స్పష్టం చేశారు. ఇదే అంశంపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఎస్ఈసీ రమేశ్‌కుమార్ కేంద్రానికి రాసిన లేఖపై బహిరంగ చర్చకు రావాలని ఆయన వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. ఈ చర్చకు సమన్వయకర్తలుగా జర్నలిస్టు సంఘాల నేతలు, ప్రభుత్వ సలహాదారులు కే రామచంద్రమూర్తి, దేవులపల్లి అమర్‌లలో ఎవరైనా సరేనని ప్రతిపాదించారు.

## అతివేగానికి ఆరుగురు బలి

- ప్రకాశం జిల్లాలో ఘోర ప్రమాదం

కొత్తపట్నం, మార్చి 20: అతివేగం ఆరుగురిని బలితీసుకుంది. ఇంజనీరింగ్ విద్యార్థులు బీచ్ నుంచి కారులో వస్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఘోరమే జరిగింది. ప్రకాశం జిల్లాలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించి వివరాలు.... కొత్తపట్నం మండలం ఈతముక్కల సముద్ర తీరం నుంచి కారులో నలుగురు యువకులు సూరారెడ్డిపాలెం వైపు వస్తున్నారు. కారు బకింగ్‌హాం కెనాల్ బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా కారుబోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న బిళ్లా శ్రీలత, మేడికొండ బ్రహ్మయ్య, ఆత్మకూరి శ్రీనివాసులు, రాసాని గోవిందమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు గాయపడగా 108 వాహనం ద్వారా ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా సాధు ప్రియాంక, చికిత్సపొందుతూ దార్ల సుబ్బులు మృతిచెందారు. మిగిలిన వారికి రిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. వీరిలో శ్రీలత పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.


ప్రాంతీయ కార్యాలయం : ఆంధ్రప్రదేశ్
కార్మిక రాజ్య బీమా సంస్థ
పంచదీప్ భవన్, ESIC రోడ్, గుణదల, విజయవాడ-520004
పత్రికా ప్రకటన
డైరెక్టర్ జనరల్, కార్మిక రాజ్య బీమా సంస్థ, న్యూఢిల్లీ వారు ఏప్రిల్ 2019 నుండి సెప్టెంబర్ 2019 చందా కాలానికి సంబంధించిన చందా మొత్తాన్ని చెల్లించడానికి లేదా దాఖలు చేయడానికి యజమానులకు మే, 15 2020 వరకు అవకాశాన్ని కల్పించియున్నారు. కావున యజమాన్యాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరుచున్నాము. ఈ అవకాశం కేవలం ఏప్రిల్ 2019 నుండి సెప్టెంబర్ 2019 చందా కాలానికి మాత్రమే వర్తిస్తుంది. పాత మరియు ప్రస్తుత చందా కాలానికి ఈ మినహాయింపు వర్తించదు. మరిన్ని వివరాలకు www.esic.nic.in నందు సంప్రదించగలరు.
జారీచేయువారు : ప్రాంతీయ సంచాలకులు, ప్రాంతీయ కార్యాలయం, కార్మిక రాజ్య బీమా సంస్థ

ప్రాంతీయ కార్యాలయం : ఆంధ్రప్రదేశ్
కార్మిక రాజ్య బీమా సంస్థ
పంచదీప్ భవన్, ESIC రోడ్, గుణదల, విజయవాడ-520004
పత్రికా ప్రకటన
కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే చర్యల్లో భాగంగా కార్మిక రాజ్య బీమా సంస్థ, న్యూఢిల్లీ వారు యజమానులు చెల్లించవలసిన నెలవారి ESI చందా గడువు తేదీని ఫిబ్రవరి,2020 మరియు మార్చి,2020 నెలలకు గాను ఒక్కొక్క నెల పొడిగించడం జరిగింది. అనగా 15 మార్చి, 2020 మరియు 15 ఏప్రిల్ 2020 లోగా చెల్లించవలసిన ఫిబ్రవరి,2020 మరియు మార్చి,2020 నెలల చందాలను 15 ఏప్రిల్,2020 మరియు 15మే,2020 లోగా చెల్లించవచ్చు. మరిన్ని వివరాలకు www.esic.nic.in నందు సంప్రదించగలరు.
జారీచేయువారు : ప్రాంతీయ సంచాలకులు, ప్రాంతీయ కార్యాలయం, కార్మిక రాజ్య బీమా సంస్థ


# ఒక్కరు కాదు.. ముగ్గురు!

- రమేశ్ కుమార్‌పై ఆర్డినెన్స్ అస్త్రం?
- ఎస్ఈసీని త్రిసభ్య కమిషన్‌గా మార్చే వ్యూహం
- ఇప్పటికే గవర్నర్‌తో చర్చలు?
- ఇది జరిగేది కాదంటున్న నిపుణులు

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మరో వివాదస్పద నిర్ణయం దిశగా అడుగులు వేస్తోందా..? తనకు నచ్చని, గిట్టని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ అధికారాలను నియంత్రించేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందా..? కేంద్ర ఎన్నికల కమిషన్ తరహాలో రాష్ట్ర ఎన్నికల సంఘంలోనూ ముగ్గురు కమిషనర్లను నియమించాలని భావిస్తోందా..? ప్రభుత్వ పెద్దల వ్యవహార శైలిని దగ్గర నుంచి చూస్తున్నవారికి ఇది అవుననే అనిపిస్తోంది. కరోనా వైరస్ తీవ్రత దృష్ట్యా స్థానిక సంస్థల ఎన్నికలను కమిషనర్ రమేశ్‌కుమార్ వాయిదా వేయడాన్ని జీర్ణించుకోలేని సీఎం జగన్ ఆయనపై వ్యక్తిగతంగా విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి మెప్పు కోసం అసెంబ్లీ స్పీకర్ నుంచి మంత్రివర్గ సహచరులు, వైసీపీ నేతలంతా ఆయన్ను నానా దుర్భాషలాడారు. పైగా ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సర్వోన్నత న్యాయస్థానం కమిషనర్ నిర్ణయాన్నే సమర్థించడంతో ప్రభుత్వ పెద్దలు అసహనంతో ఉన్నారు. ఎలాగైనా రమేశ్‌కుమార్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని సీఎం గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలిసింది. దీనిపై రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమాకాంత్‌రెడ్డిని తాడేపల్లికి పిలిపించి ఆయనతో మాట్లాడినట్లు సమాచారం. హైకోర్టు న్యాయమూర్తి హోదా ఉన్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను అభిశంసన ద్వారా తప్ప తొలగించే అవకాశం లేదని రూఢి కావడంతో.. ఇప్పుడు ఆయన అధికారాలకు కోత పెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల కమిషన్ తరహాలో ముగ్గురు కమిషనర్లను నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు లేనందున.. ఆ ఎన్నికల ప్రక్రియ తిరిగి మొదలయ్యే ముందు.. అదనుచూసి ఆర్డినెన్స్ తెచ్చి మరో ఇద్దరు కమిషనర్లను నియమించుకుని.. ఎన్నికలను తమకు అనుకూలంగా మలచుకోవాలని అధికార పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.

### కోర్టులో చుక్కెదురే!

రాజ్యాంగ వ్యవస్థల అధికారాలను కైవసం చేసుకునే ఈ ప్రయత్నంలో రాష్ట్రప్రభుత్వం మరోసారి కోర్టులో విఫలం కాకతప్పదని పలువురు న్యాయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌లో ముగ్గురు కమిషనర్లను నియమించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘంలో నియమించడం సాధ్యం కాదని చెబుతున్నారు. 1989లో కేంద్ర చీఫ్ ఎన్నికల కమిషనర్‌గా ఆర్‌వీఎస్ పేరిశాస్త్రి వ్యవహరిస్తున్న సమయంలో.. ఆయన అధికారాలకు కత్తెర వేసేందుకు పెద్ద వ్యవహారమే నడిచింది. ఆయనకు ఎస్‌ఎస్ ధనోయ్, వీఎస్ సెహగల్ అనే ఇద్దరిని కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా కేంద్రం నియమించింది. తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ ఇద్దరు కమిషనర్లను 1990లో తొలగించారు. దానిపై ధనోయ్ సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. ఆ తర్వాత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా టీఎన్ శేషన్‌ను 1991లో నియమించారు. పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను మళ్లీ త్రిసభ్య సంఘంగా మార్చారు. ఈ మేరకు రాజ్యాంగ సవరణ చేపట్టి 324 (2) అధికరణ ద్వారా అప్పుడు ఎంఎస్ గిల్, జీవీజీ కృష్ణమూర్తిలను నియమించారు. దీనిపై శేషన్ సుప్రీంకోర్టులో కేసు వేసినా ఫలితం లేకుండా పోయింది.

### రాష్ట్ర ఎన్నికల సంఘానికి వర్తిస్తుందా?

కేంద్ర ఎన్నికల కమిషన్‌లో ముగ్గురు సభ్యులు నియమించేందుకు అప్పట్లో రాజ్యాంగ సవరణ చేపట్టారని.. వైసీపీ ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘంలో అలాంటి మార్పులు చేయడం సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్, కేంద్ర ఎన్నికల కమిషన్ నియామకాలు, వాటికి సంబంధించిన పదజాలంలో వ్యత్యాసాలున్నాయని అంటున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యాంగంలోని 243 కే అధికరణ ప్రకారం ఏర్పాటైంది. ఇందులో స్పష్టంగా ఒక్క కమిషనర్‌నే నియమించాలని పేర్కొన్నారు. దానిని త్రిసభ్య సంఘంగా మార్చాలంటే ఆ అధికరణకు సవరణ చేయాల్సి ఉంటుంది. పార్లమెంటు ఆ పని చేయాలి. ఆ మేరకు ప్రధాని మోదీ ప్రభుత్వంపై జగన్ సర్కారు ఒత్తిడి తీసుకురాగలుగుతుందా అనేది ప్రశ్న. పైగా, రాష్ట్రంలో ఎన్నికలు వాయిదా పడినా, మొత్తం మీద ఆ ప్రక్రియ అమల్లోనేఉన్న ప్రస్తుత దశలో, కమిషన్‌లో మార్పులు చేయడం సాధ్యమవుతుందా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### అయినా ముందుకే..!

రాజ్యాంగ విరుద్ధమైనప్పటికీ.. తన పరిధిలో లేని అంశమైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా ఎలాగైనా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారాలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. మరో ఇద్దరు కమిషనర్లను నియమించేదిశగా పావులు కదుపుతోంది. ఇప్పటికే ఉన్నతాధికారులు కొందరు గవర్నర్‌ను కలిసి చర్చించినట్లు సమాచారం. ఎలాగైనా ఆర్డినెన్స్ తెచ్చి ఎన్నికల తంతు ముగించాలని.. ఈ క్రమంలో రమేశ్‌కుమార్ కోర్టుకెళ్లినా తీర్పు వచ్చేలోపు ప్రక్రియ పూర్తి చేయవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. బడ్జెట్ భేటీ తర్వాత సభను ప్రోరోగ్ చేసి ఆ తర్వాత అదను చూసి ఆర్డినెన్స్ తెచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

# ఇళ్ల పట్టాలు వాయిదా

- ఉగాదికి స్థలాల పంపిణీ లేనట్టే
- అంబేడ్కర్ జయంతికి మార్పు
- 14నాటికి స్థలాలు సిద్ధంకావాలి
- అధికారులకు సీఎం ఆదేశాలు
- కరోనా కట్టడి చర్యల్లో భాగంగా గత నిర్ణయాల్లో మార్పు చేశాం
- పేదలకిచ్చే స్థలంపై కేసులా?
- కేసులేసేవారు మనుషులేనా?
- కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్స్‌లో ఫైర్

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉగాది టార్గెట్ పై నిన్న ఎన్నికల కోడ్ దెబ్బ! నేడు కరోనా ఎఫెక్ట్! ఇంటిస్థలాల పంపిణీ కార్యక్రమాన్ని ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతికి మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ రోజు నాటికి రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ దిశగా రెవెన్యూ, పురపాలక శాఖలతో పాట కలెక్టర్లు ఏర్పాట్లు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా నియంత్రణకు చర్యలు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ సందర్భంగా జగన్ వెల్లడించారు. కాగా, ఇంటిస్థలాల పంపిణీపై హైకోర్టులో కేసులు వేయడాన్ని సీఎం జగన్ తీవ్రంగా తప్పుపట్టారు. "ఒకేసారి 25 లక్షల మంది పేదలకు ఇంటిస్థలాలను ఇచ్చే మంచిపనిని ప్రభుత్వం చేస్తుంటే, కొందరు దీన్ని కూడా రాజకీయం చేస్తున్నారు. అలాంటి వ్యక్తులు మనుషులే కాదనిపిస్తోంది. పేదలకు మంచి జరగకూడదనే ఉద్దేశంతోనే కేసులు వేసి అడ్డుకుంటున్నారు. కోర్టుల్లో వాటిపై ప్రభుత్వం తరపున బలంగా వాదనలు వినిపించాలి" అని సీఎం ఆదేశించారు.

### కేటాయింపులో 'సామాజిక దూరం'

ప్లాట్లను ముందుగానే కేటాయిస్తూ లాటరీ ప్రక్రియను పూర్తిచేయాలని సీఎం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. "లబ్దిదారుని తనకు ఇస్తున్న ప్లాటు వద్ద నిలబెట్టి ఫొటోతీసి జియోట్యాగింగ్ చేయాలి. లబ్దిదారులందరిని ఒకేసారి కాకుండా సామాజిక దూరాన్ని పాటిస్తూ జాగ్రత్తలు తీసుకొని వారికి సైట్లను చూపించాలి. ముందుగా నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ప్రతి నిరుపేదకు ఇంటిస్థలం కేటాయించాలి. ఇళ్లపట్టాల విషయంలో గత సమీక్షతో పోలిస్తే ఈసారి మంచి పురోగతి కనిపిస్తోంది" అంటూ అధికార యంత్రాంగానికి ఆయన కితాబిచ్చారు.

### కాలనీలకు వైఎస్ఆర్ జగనన్న పేరు..

గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పేదలకు ఇంటిస్థలాలు, ప్లాట్లు ఇస్తున్న ప్రాంతాలను ప్రత్యేకంగా కాలనీలుగా గుర్తించి, వాటికి వైఎస్ఆర్ జగనన్న కాలనీలుగా పేరుపెట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందే దీనిపై మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోగా, తాజాగా రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి వీ ఉషారాణి ఉత్తర్వులు ఇచ్చారు.

### కోడ్‌పై అంత కొట్లాడి.. ఓకే అయ్యాక వాయిదానా!

- 'స్థానికం'లో లబ్ధికోసమేనా?
- రాష్ట్ర రాజకీయవర్గాల్లో చర్చ

నవరత్నాల్లో భాగంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి పేదలకు నిజమైన ఉగాదిపండగ తీసుకొస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఒకే దఫాలో 25 లక్షలమందికి ఇచ్చేలా రాష్ట్రంలో స్థలాల సేకరణ ప్రక్రియనుసర్కారు పరుగులు పెట్టించింది. అయితే, ఈ పరుగుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా బ్రేక్ పడింది. కరోనా ప్రభావం కారణంగా ఈ నెల 15వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలను వాయిదా వేసింది. అయితే.. ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని తేల్చి చెప్పింది. ఈ ఆదేశాలను ముఖ్యమంత్రి వ్యతిరేకించారు. రాష్ట్రంలో కరోనా ప్రభావం లేదని స్పష్టం చేశారు. ఎస్ఈసీ నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించింది. సర్కారు అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు.. ఎన్నికల కోడ్‌ను సడలించాలని మాత్రం ఎస్ఈసీని కోరింది. ఈ నేపథ్యంలో ఇళ్ల స్థలాల పంపిణీకి అనుమతించాలని గత బుధవారం రాష్ట్ర ప్రభుత్వం చేసిన వినతికి శుక్రవారం ఎస్ఈసీ ఆమోదం తెలిపింది. అయితే, ఈ కార్యక్రమాన్ని అంబేడ్కర్ జయంతిరోజుకు ప్రభుత్వం వాయిదా వేసుకొంది. కరోనా ప్రభావమే కారణమని ప్రకటించింది. అయితే, ఈ కార్యక్రమానికి అనుమతి కోరిన రెండు రోజుల్లోనే ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇలా చేశారా అని రాజకీయవర్గాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి. ఉగాది నాటికి ఎన్నికలు జరుగుతాయనే అంచనాతో ఆ తేదీని నిర్ణయించి, అప్పుడు వాయిదా పడిన ఎన్నికలు తిరిగి ఏప్రిల్ నెలాఖరులో జరిగే అవకాశం ఉన్నందునే .. అంబేడ్కర్ జయంతికి ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నారని అభిప్రాయపడుతున్నాయి.

# ఇళ్ల పట్టాలు ఇవ్వొచ్చు!

- పేదల స్థలాల పంపిణీకి ఎస్ఈసీ ఓకే

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలను అందించే 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆమోదం తెలిపింది. ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయాలనుకొంటున్నామన్న ప్రభుత్వం ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని ఈ కార్యక్రమానికి ఆమోదముద్ర వేసినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే ఉన్న పథకాలను కొనసాగించడానికి సుప్రీంకోర్టు తన తీర్పులో అనుమతినిచ్చిందని, పేదల స్థలాలు కార్యక్రమం అలాంటి పథకమేనని ప్రభుత్వం తెలిపిందని ఆ ప్రకటనలో ఎన్నికల సంఘం పేర్కొంది. వాస్తవాలను తగినవిధంగా పరిగణనలోకి తీసుకునే కమిషన్ ఇందుకు ఆమోదం తెలిపిందని వెల్లడించింది. కాగా, హైదరాబాద్‌లోని కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ సాధారణ విధులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

### కరోనా కాలంలో కలిసొచ్చిన 'వాయిదా'

రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలను వాయిదా వేసి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ ముందుచూపుతో వ్యవహరించారని సర్వత్రా ప్రశంసలొస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వ్యాప్తి ఉధృతం కావడం, కర్ణాటక, తెలంగాణలో కరోనా కేసులు నమోదు కావడంతో వాటికి పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు దీని ప్రభావం సోకడానికి ఎంతో సమయం పట్టదని ఆయన ముందే ఊహించారని పలువురు పేర్కొంటున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు అనుకున్న ప్రకారం జరిగి ఉంటే శనివారం, ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చేది. దేశ వ్యాప్తంగా కరోనాపై కేంద్రప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించడం, సాక్షాత్తు ప్రధాన మంత్రి మోదీ ఆదివారం జనతా కర్ఫ్యూ ప్రారంభానికి పిలుపునివ్వడాన్ని పరిశీలించినవారు.. ఇలాంటి సందర్భంలో ఎన్నికలు నిర్వహించి ఉంటే పరిస్థితి ఎలా ఉండదనేది ఊహించలేకపోతున్నామని వ్యాఖ్యానిస్తున్నారు. రమేశ్‌కుమార్ నిర్ణయాన్ని మొదట్లో వ్యతిరేకించిన రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు కూడా ఇప్పుడు దానిని ఒప్పుకోక తప్పడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. స్థానిక ఎన్నికలను కరోనా కారణంగా వాయిదా వేసిన సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌పై గుర్రుమన్న ప్రభుత్వం.. మొదట్లో కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పైగా సీఎం జగన్ ప్రెస్‌మీట్ పెట్టి రమేశ్‌కుమార్‌ను విమర్శించడానికే ప్రాధాన్యం ఇస్తూ, కరోనా ఎక్కడుందని ప్రశ్నించారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాయిదా అంశం వివాదాస్పదమైంది. వాస్తవానికి ఎన్నికల నోటిఫికేషన్ ముందురోజు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అన్ని పార్టీలతో సమావేశమైనప్పుడు ఒక్క వైసీపీ తప్ప మిగిలిన పార్టీలు కరోనా వ్యాప్తిని ప్రస్తావించి, ఇప్పుడు ఎన్నికలు ఏమిటంటూ అభ్యంతరం వ్యక్తం చేశాయి. అప్పట్లో రాష్ట్రంలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాకపోవడం, వైద్యశాఖ అధికారులు కూడా ఎన్నికలకు కరోనా వల్ల ఇబ్బంది ఉండదని చెప్పడంతో రమేశ్‌కుమార్.. ఎన్నికల నిర్వహణకే మొగ్గు చూపారు. అయితే, ఈ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత దేశ వ్యాప్తంగా వైరస్ వ్యాప్తిపై ఆందోళనలు తీవ్రమయ్యాయి. దీంతో రమేశ్‌కుమార్ ఎన్నికలను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయం ఆయన తీసుకోకుండా ఉండి ఉంటే ఇప్పుడైనా ఎన్నికలు ఆపేయాల్సి వచ్చేదన్న అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లోనే బలంగా వ్యక్తం అవుతోంది.

## లోకం తీరు




ఓడింది నేను కాదు.. అతను

### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 38.0 | 26.0 |
| విజయవాడ | 37.0 | 25.6 |
| గుంటూరు | 36.4 | 26.2 |
| హైదరాబాద్ | 36.0 | 23.0 |
| విశాఖపట్నం | 31.6 | 22.2 |
| నెల్లూరు | 25.1 | 34.9 |

## నేడు, రేపు కోస్తాంధ్రలో వర్షాలు

అమరావతి: 'ఉపరితల ఆవర్తనం ఇప్పుడు పశ్చిమ విదర్భ, దాని పరిసరాలకు విస్తరించి ఉంది. ఉత్తర కర్ణాటక, నుంచి దక్షిణ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు 9కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. అలాగే ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి.. పశ్చిమ విదర్భ నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిసా వరకు కొనసాగుతోంద'ని అమరావతి వాతావరణ పరిశోధన కేంద్రం శుక్రవారం తెలిపింది. వీటి ప్రభావంతో శని, ఆదివారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో చెదురుమదురు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది. కాగా, బంగాళాఖాతంలో కొనసాగుతున్న అధికపీడనంతో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం సూచించింది.



### ఆమె తల్లికాదా?

'అర్ధరాత్రి 12:30 దాటాక కూడా కూతురు ఎక్కడుందో.. ఎవరితో ఉందో.. ఏ పరిస్థితుల్లో ఉందో? అనే విషయాలు పట్టని తల్లి(నిర్భయ తల్లి ఆశాదేవి)ని ఏమంటారు?'. పవన్ గుప్తా తల్లి దివ్యాంగురాలు. ఆమె కూడా నవమాసాలు మోసి బిడ్డను కన్నది. ఆమె తల్లికాదా?.

**- మీడియాతో నిర్భయ దోషుల తరపు న్యాయవాది ఏపీ సింగ్**



### అదే అయితే..!

నా రాజ్యసభ సీటుపై విపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు నేను పట్టించుకోను. అవి నన్ను బాధించవు. ఎందుకంటే ఒకవేళ క్విడ్ కో ప్రో అయితే అది రాజ్యసభ సీటెందుకు అవుతుంది. దానికంటే ఇంకా ఏదో పెద్దదే అయివుంటుంది కదా!

**- రంజన్ గొగోయ్, ఎంపీ (రాజ్యసభ)**

## శ్రీవారికి ముందే విశ్రాంతి!

- 8.30కే ముగిసిన ఏకాంతసేవ

తిరుమల, మార్చి 20: తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి దాదాపు 30ఏళ్ల తర్వాత చాలా ముందుగానే విశ్రాంతి లభించింది. దర్శనాల రద్దు నేపథ్యంలో రాత్రి 8.30గంటలకే ఏకాంతసేవ నిర్వహించి మహద్వారం మూసేశారు. 1843 నుంచి 1933 వరకు దాదాపు 90ఏళ్ల పాటు మహంతుల పరిపాలనలో స్వామికి సుప్రభాతం, ఏకాంతసేవ సూర్యోదయం తర్వాత, సూర్యాస్తమయానికి ముందు (పగటిపూటే) జరిగేవి. ఆ తర్వాత రద్దీకి అనుగుణంగా ఏకాంతసేవ సమయాల్లో మార్పులు చేసుకుంటూ వచ్చారు. 1974లో రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత భక్తుల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. దీంతో ఏకాంతసేవ నిర్వహణ సమయం క్రమంగా వెనక్కు జరుగుతూ 1990 ప్రాంతాల్లో అర్థరాత్రి 12గంటలకు చేరుకుంది. ప్రస్తుతం ఇదే సమయానికి ఏకాంతసేవ నిర్వహించి, తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలుపుతున్నారు. కరోనా ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు కొండపై ఉన్న భక్తులందరికీ దర్శనం చేయించి క్యూలైన్లను ఆపేశారు. రాత్రి 8.30గంటలకు ఏకాంతసేవ నిర్వహించి ఆలయం తలుపులు మూసివేశారు. సుప్రభాత సేవను యథావిధిగా 3గంటలకే నిర్వహించనున్నారు.

### మిగిలిన లడ్డూలు రాయితీపై విక్రయం

తిరుమల ఆలయంతో పాటు టీటీడీ అనుబంధ ఆలయాల్లో దర్శనాలను రద్దు చేసిన నేపథ్యంలో ఇప్పటికే తయారుచేసిన 2.5లక్షల లడ్డూలను సిబ్బందికి రాయితీపై విక్రయించేందుకు టీటీడీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. తిరుమల, తిరుచానూరుల్లో శుక్రవారం సాయంత్రం దాకా అమ్ముడుపోగా, మిగిలిన లడ్డూలను దేవస్థానం పరిపాలనా భవనానికి తరలించి టీటీడీ శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రాయితీపై విక్రయించే దిశగా అధికారులు ఆలోచిస్తున్నారు.

# నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్

(స్కూల్ విద్య మరియు సాక్షరత విభాగం, MHRD భారత ప్రభుత్వం ఆధీనంలోని ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థ)
5వ అంతస్తు, B-బ్లాక్, VUDA కాంప్లెక్స్, సిరిపురం,
విశాఖపట్నం-530003 ఆంధ్రప్రదేశ్ ఫోన్: 0891 - 2564584

ప్రపంచం కరోనాతో బాధపడుతోంది. పాఠశాల విద్యార్థులకు ఆ కష్టం వద్దు !

## NIOS ఆన్‌లైన్ ఎడ్యుకేషన్

సెకండరీ (10వ) సీనియర్ సెకండరీ (12వ) మరియు ఒకేషనల్ కోర్సుల కొరకు **SWAYAM MOOCs**లో

లాగిన్ కొరకు దర్శించండి www.swayam.gov.in/NIOS

అన్ని కోర్సులు ఉచితం

TUNE NIOS SWAYAM PRABHA DTH ఛానల్ Panini (#27) & ఛానల్ Sharda (#28)

కార్యక్రమాలు NIOS యూట్యూబ్‌లో కూడా లభిస్తాయి

LIVE సెషన్ NIOS స్వయంప్రభ ఛానల్స్‌లో ప్రతిరోజు సా. 3-5 గం. వరకు హాజరై సబ్జెక్ట్ టీచర్స్‌తో మీ సందేహాలు నివృత్తి చేసుకోండి

* NIOS విద్యార్థులు కానివారు కూడా లెక్చర్స్‌ను వినవచ్చు, ప్రశ్నలు అడుగవచ్చు

- అన్ని ప్రోగ్రాములు స్వ అధ్యయన సామగ్రి NIOS వెబ్‌సైట్ www.nios.ac.in లో On Line Course Material లింక్‌లో లభిస్తాయి
- సెకండరీ/సీనియర్ సెకండరీ/ఒకేషనల్ కోర్సులు SWAYAM MOOCs ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్‌లో కూడా లభిస్తాయి
- ఎడ్యుకేషనల్ వెబ్ రేడియో/రేడియోలో లైవ్ లెక్చర్స్ NIOS వెబ్‌సైట్ http://radio.nios.ac.in లో లభించును
- NIOS SWAYAM MOOCs కోర్సులను పొందుటకు QR కోడ్ స్కాన్ చేయండి

E-ట్యుటోరియల్స్ | E-కాంటెంట్స్ | సెల్ఫ్ అసెస్‌మెంట్ | డిస్కషన్ ఫోరం

SWAYAM ఉచిత ఆన్‌లైన్ విద్య

తెలివైన, సరళమైన అధ్యయనం కొరకు SWAYAM పై NIOS కోర్సులలో నేడే రిజిస్టర్ చేసుకోండి

### NIOS స్వయంప్రభ ఛానల్స్ పొందుట ఎలా?

SWAYAM PRABHA
Free DTH Channel for Education

» దూరదర్శన్ యొక్క "ఉచిత డిష్" సేవ
» డిష్ TV సెటప్ బాక్స్
» SWAYAM PRABHA మొబైల్ యాప్ (గూగుల్ ప్లే స్టోర్‌లో లభించును)
» జియో (Jio) టీవీ లైవ్ టీవీ యాప్

DD-DTH స్వయంప్రభ ఛానల్స్‌పై ఫోన్ ద్వారా లెక్చర్స్ వినుటకు మరియు ప్రశ్నలు అడుగుటకు సెకండరీ, సీనియర్ సెకండరీ లెర్నర్స్‌కు సువర్ణ అవకాశం. MHRD యొక్క SWAYAM ప్లాట్ ఫారం www.swayam.gov.in ద్వారా చదువుకోండి

తదుపరి వివరాలకు లాగాన్ చేయండి NIOS వెబ్‌సైట్ www.nios.ac.in
హెల్ప్‌లైన్ నంబరు 0120-4089800 లేదా టోల్ ఫ్రీ నంబరు 1800-180-9393



# సురక్షితంగా ఉండండి

## అన్ని ఎల్ఐసి పాలసీ చెల్లింపులను డిజిటల్ చేసుకోండి

మౌజ్ క్లిక్ చేస్తూ లేదా మీ స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తూ
మీ పాలసీ ప్రీమియం చెల్లించండి, పాలసీ రుణం, రుణ వడ్డీ తిరిగి చెల్లించండి




మీ NEFT వివరాలను ఏ ఎల్ఐసి శాఖలోనైనా అప్‌డేట్ చేసుకోండి.
మీ క్లెయిం చెల్లింపులు డిజిటల్ పద్ధతిలో పరిష్కరించడానికి మాతో సహకరించండి

ఉచితంగా

దిగువ డిజిటల్ చెల్లింపు ఆప్షన్స్‌లో దేనినైనా వినియోగించుకుని, తక్షణం అధికారిక రశీదును పొందండి

Net Banking | Cards | e-Wallets
BHIM UPI | Paytm | PhonePe | G Pay

కాల్ సెంటర్ సర్వీస్‌లు (022) 6827 6827
డౌన్‌లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ "MyLIC"
www.licindia.in | LIC India Forever

IRDAI Regn. No. 512

LIC
లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

ప్రతిక్షణం మీకు తోడుగా



ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం

Help us to help you

# నొవెల్ కరోనా వైరస్ (కొవిడ్-19)



## హోమ్ క్వారంటైన్‌లో ఉండాల్సింది ఎప్పుడు?

### మీకు లక్షణాలు ఏవీ లేవు కానీ దిగువ వాటిలో ఒకదానిని కలిగియున్నారు:

- గత 14 రోజులలో కొవిడ్-19 ప్రభావిత దేశాలకు ప్రయాణించారు.
- కొవిడ్-19 కేస్ లేదా బాడీ ఫ్లూయిడ్స్ లేదా సెక్రెషన్స్ లేదా సాయిల్డ్ ఐటమ్స్‌కు భౌతిక బహిర్గతం
- కొవిడ్-19 అనుమానితుడై ఉండి పాజిటివ్‌గా వచ్చిన వారితో ఒకే గృహంలో నివసించినవారు.

### 14 రోజులకు హోమ్ క్వారంటైన్‌లో ఇవి చేయండి



- బాగా వెలుతురు ఉన్న సింగిల్ రూమ్‌లో ఉండండి
- శ్వాసను తగువిధంగా పీల్చుకుంటూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- కో-ఇన్‌హాబిటంట్స్‌కు 1 మీటర్ దూరం కలిగి ఉండండి మరియు వృద్ధులకు, గర్భిణులకు మరియు పిల్లలకు దూరంగా ఉండండి.
- లక్షణాలు ఎక్కువవుతున్నట్లున్న లేదా మీరు కొవిడ్-19 కేస్‌గా అనిమానిస్తున్న రక్షణ కోసం / నిర్ధారించబడిన ఫేస్ మాస్కులు ధరించండి
- గృహోపకర వస్తువులను పంచుకోకండి
- ఇంటికి ఖచ్చితంగా ఎవరినీ రానీయకండి

davp 17102/13/0026/1920

మీకు మీరుగా మరియు మీ కుటుంబం కొరకు హోమ్ క్వారంటైన్‌లో చేయవలసినవి చేయకూడనివి www.mohfw.gov.in లో తెలుసుకోండి.

మనమంతా కలిస్తే కొవిడ్-19పై పోరాడగలం

హోమ్ క్వారంటైన్ సమయంలో మీకు సరిగా లేకుంటే( దగ్గు,జ్వరం లేదా శ్వాస తీసుకోనుటలో ఇబ్బంది) వెంటనే హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్ చేయగలరు

మరింత సమాచారం కొరకు:
భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ, 24x7 కంట్రోల్ రూమ్ నంబరును సంప్రదించండి

1075(టోల్ ఫ్రీ) | 011-23978046
ఇమెయిల్ ncov2019@gov.in, ncov2019@gmail.com

mohfw.gov.in | @MoHFWIndia | @MoHFW_INDIA | mohfwindia

# స్వయంకృతం

మహారాష్ట్రలో జరిగినదానికి అమిత్ షా మధ్యప్రదేశ్‌లో ప్రతీకారం తీర్చుకున్నారు. తనకు బోలెడంత బలం ఉన్నదని రెండువారాలుగా చెబుతూ వచ్చిన కమల్‌నాథ్ బలపరీక్షకు రెండుగంటల ముందు విలేకరుల సమావేశానికి సంకల్పించినప్పుడే ఆయన రాజీనామా ప్రకటన దేశం ఊహించింది. బలపరీక్షలో నెగ్గుకొచ్చేంత బలం ఆయనకు లేదన్నది నిజం. జ్యోతిరాదిత్య సింధియా కమలనాథులతో చేయికలిపి, ఐదోవంతు బలం ఎగరేసుకుపోయాక కమల్‌నాథ్ ప్రభుత్వం కూలిపోక తప్పదు. ఆదిలో స్పీకర్‌ను, ఆ తరువాత సుప్రీంకోర్టును నమ్ముకొని చివరి వరకూ పదవీపరిరక్షణకు ఏవో ప్రయత్నాలు చేశారు కానీ అవేమీ ఫలించలేదు. బలపరీక్షకు సిద్ధం కమ్మని సుప్రీంకోర్టు ఆదేశించడంతో చేసేదేమీ లేక ఇప్పుడు తప్పుకున్నారు. రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తూనే సింధియాతో పోయిన ఎమ్మెల్యేలందరినీ దురాశాపరులనీ, డబ్బుకు అమ్ముడుపోయారని నిందించారు. సింధియా మహారాజ్‌నీ, ఆయన రాజ్యాధికార వాంఛనీ తూర్పారబట్టారు. కొన్ని మంత్రిపదవులు ఖాళీచేయించడం ద్వారా తిరుగుబాటు ఎమ్మెల్యేలందరినీ తిరిగి తనగూటికి తెచ్చుకొనేందుకు చేసిన ప్రయత్నాలు కానీ, ముందురోజు రాత్రివరకూ సాగించిన 'రహస్య చర్చలు' కానీ ఫలించి వుంటే కమల్‌నాథ్ దృష్టిలో వీరంతా పవిత్రులైపోయేవారేమో!

అనేక రాష్ట్రాల్లో బీజేపీ నెరిపిన కుట్రలకూ, మధ్యప్రదేశ్ రాజకీయానికీ తేడా ఉన్నమాట వాస్తవం. అప్పటికే పతాకస్థాయికి చేరిన అసమ్మతిని కమలం తనకు అనుకూలంగా మార్చుకున్నది. దాదాపు రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో ఉంటూ, రాహుల్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరుపడిన జ్యోతిరాదిత్య సింధియా నిష్క్రమణతో ఈ పరిణామం జరిగినందున, కమలం కుట్రగా దీనిని అభివర్ణించడం వల్ల కాంగ్రెస్‌కు సానుభూతి దక్కే అవకాశం లేదు. సింధియాకు ఆ పరిస్థితి కల్పించింది కాంగ్రెస్ అధిష్ఠానమే. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మిగతా అనేక మంది నాయకులతో పోల్చితే సింధియా ప్రాబల్యం ఉన్న గ్వాలియర్–చంబల్ ప్రాంతంలోనే కాంగ్రెస్ అత్యధిక స్థానాలు నెగ్గుకొచ్చింది. తాను కష్టపడి సాధించిన ఆ స్థానాలనే ఇప్పుడాయన తనవెంట తీసుకుపోయాడు. పాతికకుపైగా తెచ్చుకొని, యువరాజుకు సన్నిహితుడినని కూడా అనుకున్నందుకు ఆయన ముఖ్యమంత్రి పదవిమీద ఆశపడటం సహజం. అది దక్కకున్నా ఉపముఖ్యమంత్రిగా తన మనిషిని కూర్చోబెట్టాలని కోరుకోవడమూ సహజం. చివరకు ప్రదేశ్ కాంగ్రెస్ పీఠాన్ని ఇచ్చినా సరిపెట్టుకుంటానన్నాడు ఆయన. లోక్‌సభ ఎన్నికల్లో సింధియా ఓటమికి విశేషంగా కృషిచేసిన కమల్‌నాథ్, దిగ్విజయ్ సింగ్‌లు ఇవేమీ పడనివ్వకపోవడంతో పాటు ఆయన రాజ్యసభ సీటుకు కూడా మోకాలడ్డారు. కాంగ్రెస్ రాజకీయాలు ఎటువంటివో, పార్టీలో ఎవరి పెత్తనం చెల్లుతున్నదో రాహుల్ తిరుగుబాటుతోనే ప్రజలకు అర్థమైపోయింది. ఈ వృద్ధ రాజకీయాలముందు తానూ చేతులెత్తేయడమే కాక, రాహుల్ తన బాల్యస్నేహితుడిని కూడా కాపాడుకోలేకపోయారు. రాజ్యసభ సీటుకోసం సింధియా తన ఆత్మగౌరవాన్నే తాకట్టుపెట్టుకున్నాడని కాంగ్రెస్ నాయకులంతా విమర్శిస్తున్నారు కానీ, అది దక్కకే ఆయన చివరకు నిష్క్రమించాల్సి వచ్చింది. కాంగ్రెస్‌లో కోల్పోయినదానిని ఇకపై ఆయన బీజేపీలో పొందగలరా అన్నది వేరే ప్రశ్న.

నేడో రేపో శివరాజ్‌సింగ్ చౌహాన్ నాలుగోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారు. కమల్‌నాథ్ ఎలాగూ ముఖ్యమంత్రి అయ్యాడు కనుక, తన మనిషిని ఉపముఖ్యమంత్రి చెయ్యమని అప్పట్లో కాంగ్రెస్‌ను అడిగిన జూనియర్ సింధియా కోరిక ఇప్పుడు నెరవేరవచ్చు. కొన్ని మంత్రిపదవులూ దక్కవచ్చు. ఆయనకు కేంద్రమంత్రివర్గంలో స్థానం కూడా ఉన్నదంటున్నారు. సింధియా వర్గం ఎమ్మెల్యేల రాజీనామాలన్నీ స్పీకర్ ఆమోదించారు కనుక, కర్ణాటక తరహా రాజకీయమే అక్కడా పునరావృత్తమవుతున్నది. రాజీనామాలు చేసివస్తే మంత్రిపదవులతో అలంకరిస్తానని తిరుగుబాటు ఎమ్మెల్యేలకు ఇచ్చిన హామీని యెడ్యూరప్ప నిలబెట్టుకున్నారు. కాంగ్రెస్–జెడిఎస్ కూటమిని వెన్నుపోటు పొడిచిన వీరందరినీ ప్రజలు తీవ్రంగా దండిస్తారని అనేకులు ఆశ పడ్డారు కానీ, రెబెల్స్ అందరూ బ్రహ్మాండమైన మెజారిటీతో నెగ్గుకొచ్చి పదవులు అందుకున్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోగా మధ్యప్రదేశ్‌లో 24 స్థానాలకు జరగబోయే ఉప ఎన్నికల్లోనూ ఫలితాలు అందుకు భిన్నంగా ఉండే అవకాశాలు లేవు. వాటిలో సగం గెలుచుకున్నా కమలం సుస్థిరతకు ఏ లోటూ ఉండదు. జూనియర్ సింధియా మాదిరిగానే కాంగ్రెస్‌లోని మిగతా యువనాయకులు కూడా అసంతృప్తితో రగిలిపోతున్నారు కనుక, కాంగ్రెస్ ముక్త్‌భారత్‌కు అమిత్ షా ప్రత్యేకంగా కృషిచేయాల్సిన అవసరం లేదేమో!

# మానవవాద రాజకీయం— తెలుగు నేల

కాంగ్రెసు మహాసభలు 1936లో మహారాష్ట్రలోని ఫైజ్‌పూర్ గ్రామంలో జరిగాయి. ఆ సభలకు తొలిసారిగా, అప్పుడే ఆరేళ్ళ జైలు జీవితం నుండి బయటపడిన ఎం.ఎన్.రాయ్ (మానవేంద్రనాథ్ రాయ్) వచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడుగా జైలు శిక్ష అనుభవించి వచ్చిన రాయ్ ఒక కొత్త, వింత ప్రతినిధిగా వున్నాడు. ఆయన పేరు వినడమే గాని వివరాలు తెలియని రోజులవి.

ఆంధ్ర నుండి వెళ్ళిన ప్రతినిధులలో వెన్నెలకంటి రాఘవయ్య, కాకినాడ నుండి ములుకుట్ల వెంకటశాస్త్రి వున్నారు. రాఘవయ్యను గిరిజన గాంధీ అనేవారు. ఆయన పరిశోధనా రచనలు వెలువరించారు, కాంగ్రెస్‌లో సోషలిస్టు భావాలు గల వారితో వున్నారు. ములుకుట్ల వెంకటశాస్త్రి కాకినాడలో అడ్వొకేట్‌గా వుంటూ, మద్రాసు నుండి కుందూరి ఈశ్వర దత్ నడిపే లీడర్ పత్రిక ప్రతినిధిగా సభలకు వెళ్ళారు.

ఫైజ్‌పూర్ కాంగ్రెస్ సభలలో తొలిసారి ఎం.ఎన్.రాయ్ మాట్లాడడం కాంగ్రెస్ సోషలిస్టులను విశేషంగా ఆకట్టుకున్నది. ప్రసంగం అనంతరం ఆయన్ను కలిసి ఆంధ్రకు రావలసిందిగా వెన్నెలకంటి రాఘవయ్య ఆహ్వానించారు, దక్షిణ భారత వ్యవసాయ కార్మికుల సభను ప్రారంభించమని కోరారు. రాయ్ అంగీకరించారు. తరువాత కాకినాడ రమ్మని ములుకుట్ల వెంకటశాస్త్రి అర్థించారు. వారి కోరిక ప్రకారం రాయ్ వచ్చారు. ఫైజ్ పూర్ కాంగ్రెస్ సభలలో మరో విశేషం గాంధీ–రాయ్ కలసి మాట్లాడుకోవడం. రాయ్ చెప్పినదంతా విన్న గాంధీ ఆయన్ను కాంగ్రెస్‌లో మౌనంగా సేవ చేయమని కోరాడు. అంటే రాయ్ భావాలతో ఏమాత్రం అంగీకరించలేదన్నమాట. అంతే ఆ తరువాత వారెప్పుడూ కలవలేదు! నెహ్రూ మాత్రం రాయ్‌ని తన ఇంటికి ఆహ్వానించడం, వారిరువురూ మిత్రులుగా కొనసాగడం ఒక పరిణామం.



ఎం.ఎన్. రాయ్ 1937లో నెల్లూరు ప్రాంతాలలో పర్యటించారు. వెన్నెలకంటి రాఘవయ్య ఆయన వెంట వుండి పర్యటన ఏర్పాట్లు చూసారు. ఆనాడు కొంతకాలం రాయ్ ఖాదీ ధరించి, ఖద్దరు టోపీ పెట్టాడు. నెల్లూరు, కావలి, చంద్రగిరి, తిరుపతి ప్రాంతాలలో వెన్నెలకంటి రాఘవయ్య ఏర్పాటు చేసిన సభలలో రాయ్ ప్రసంగాలు జనాన్ని ఆకట్టుకున్నాయి. రాయ్ తొలి ఆంధ్రపర్యటన వివరాలు, ఫొటోలు నాడు మద్రాసు నుండి వెలువడే ఆంధ్రపత్రికలో వివరంగా ప్రచురించారు. స్థానిక వార, పక్ష పత్రికలు కొన్ని కూడా ప్రచురించాయి. జమీన్ రైతు నెల్లూరు వెంకట్రామానాయుడు సంపాదకత్వాన వెలువడినా, వెన్నెలకంటి రాఘవయ్యకు ప్రత్యర్థి కావడం వలన వార్తా వివరాలు రాయలేదు! రాయ్ నెల్లూరు పర్యటన జరుగుతుండగా, ఆయనకు జబ్బు చేసింది. ఈ విషయం తెలిసి, తక్షణమే ములుకుట్ల వెంకటశాస్త్రి కాకినాడ నుండి వచ్చి రాయ్‌ని కాకినాడ తీసుకెళ్ళి చికిత్స చేయించారు. కుదుటపడగానే, వారు విశాఖపట్టణం వెళ్ళారు.

**రాయ్ మేధస్సు పట్ల ఆకర్షితుడైన ఆంధ్ర యూనివర్సిటీ వైస్– ఛాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డి ఆయన్ను ప్రొఫెసర్‌గా వుండమని యూనివర్సిటీకి ఆహ్వానించారు. రాయ్ నవ్వుతూ ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు. విశాఖ సముద్ర బీచ్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన సభలో రాయ్ ప్రసంగించారు. సభను నిర్వహించిన విద్యార్థుల్లో రాచకొండ విశ్వనాథ శాస్త్రి వుండడం విశేషం. పార్వతీపురం ప్రాంతంలో రాయ్ భావ ప్రభావానికి లోనైన వారిలో చీకటి పరశురాం నాయుడు వున్నారు. ఆయన తన మనమడికి రాయ్ అని పేరు పెట్టడం గమనార్హం. నేడు అతను ఆంధ్ర హైకోర్టులో న్యాయమూర్తిగా వున్నారు.**

అది ఒక గొప్ప దశ. చెప్పుకోదగిన మార్పులన్నింటికీ విశాఖ నాంది పలికింది. ఎం.ఎన్. రాయ్‌ని విశాఖపట్టణం తీసుకు రావలసిందిగా అబ్బూరి రామకృష్ణారావు ఎం.వి. శాస్త్రికి కబురు చేశారు. అబ్బూరి ఆంధ్రయూనివర్సిటీ లైబ్రేరియన్‌గా, నాటక రంగ పరిశోధకుడుగా వున్నారు. ఆయన కోరిక మేరకు ఎం.ఎన్.రాయ్‌ని వెంటబెట్టుకొని ఎం.వి.శాస్త్రి వైజాగ్ వచ్చారు. తొలుత వారికి స్వాగతం పలికినవారిలో అబ్బూరి వరద రాజేశ్వరరావు, అత్తలూరి నరసింహారావు, పి.హెచ్. గుప్త, అబ్బూరి గోపాలకృష్ణ వున్నారు. విశాఖలోని మహారాణిపేటలో పి.హెచ్. గుప్త నివశిస్తున్నారు. ఆయన ఇల్లు సముద్రపు ఒడ్డున వున్నది. ఆ వాతావరణం రాయ్‌కి సరిపడుతుందని అక్కడ పెట్టారు. నాడు ఆంధ్ర యూనివర్సిటీ వైస్– ఛాన్సలర్‌గా వున్న కట్టమంచి రామలింగారెడ్డికి రాయ్‌ని పరిచయం చేయడంలో అబ్బూరి కీలక పాత్ర వహించారు. రాయ్ మేధస్సు పట్ల ఆకర్షితుడైన కట్టమంచి ఆయన్ను ప్రొఫెసర్‌గా వుండమని యూనివర్సిటీకి ఆహ్వానించారు. రాయ్ నవ్వుతూ ఆ ఆహ్వానాన్ని తిరస్కరించి, ధన్యవాదాలు చెప్పారు. ఆ తరువాత కాలంలో వారిరువురూ మంచి స్నేహితులయ్యారు. జైలు నుండి రాయ్ రాసిన ఉత్తరాలు చదివి కట్టమంచి ఆకర్షితుడై చక్కని ఉపోద్ఘాతం రాశారు. అది గ్రంథంగా వెలువడింది. విశాఖలో విద్యార్థులు కొందరు రాయ్ పట్ల బాగా ఆకర్షితులై, తమ కళాశాలలో ప్రసంగించమని కోరారు. విశాఖ సముద్ర బీచ్‌లో సభను ఏర్పరచారు. కాలేజీ ప్రిన్సిపాల్ గాంధేయుడు కావడంతో రాయ్ ప్రసంగం ఏర్పాటును వ్యతిరేకించాడు. అయినా పట్టుదలతో విద్యార్థులు సభ నిర్వహించారు. వారిలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి వుండడం చరిత్ర. ఆయన తన డైరీలో రాయ్‌తో తన పరిచయం, ప్రభావం గురించి వివరంగా రాశారు.

విజయనగరం నుండి తాతా దేవకీనందన్ తొలుత రాయ్‌కి సన్నిహితులయ్యారు. ఉత్తరోత్తరా ఆయన విజయనగరం ఛైర్మన్ అయ్యారు. నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మికుల సంఘం పెమ్మరాజు వెంకట్రావు నాయకత్వాన రాయ్ భావాలకు తగ్గట్టుగా సమ్మెలు నడిపారు. పార్వతీపురం ప్రాంతంలో రాయ్ భావ ప్రభావానికి లోనైన వారిలో చీకటి పరశురాం నాయుడు వున్నారు. ఆయన తన మనమడికి రాయ్ అని పేరు పెట్టారు. నేడు ఈయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా వున్నారు. ఎం.ఎన్.రాయ్ ప్రారంభించిన ఇండిపెండెంట్ ఇండియా పత్రికను తెప్పించి, బాగా ప్రచారం చేసిన వారిలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి వున్నారు. ఇదంతా ఎం.ఎన్.రాయ్ తొలి పర్యటన సంవత్సరాల చరిత్ర. ఆ విధంగా ఆంధ్రలో రాయ్ మానవవాద యాత్ర సాగింది. అప్పుడే తణుకు నుండి కె.పి.ఎన్. రాజు పెద్ద ఊరేగింపు ఏర్పరచి, రాయ్‌ని వూరేగించారు. ఖద్దరు వేషంలో రాయ్ ప్రధాన ఆకర్షితుడుగా ప్రసంగాలు చేశారు. 1938 నాటి గాథయిది. తెలుగువారితో ఆరంభమైన ఎం.ఎన్.రాయ్ మానవవాద వుద్యమం ఆ తరువాత ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. ఇది తొలి గాథ. ఇప్పుడది చరిత్ర!

• నరిసెట్టి ఇన్నయ్య

(నేడు మానవేంద్ర నాథ్ రాయ్ జయంతి)

# కరోనా: సమరం, సంక్షేమం

■ పి. చిదంబరం



'పళని' పలుకు

> 2020–21 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయం రూ.30,42,230 కోట్లు; అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.40 నుంచి 45 లక్షల కోట్లను ఖర్చు పెట్టనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయం ఇంత భారీ మొత్తంలో వున్నప్పుడు కరోనా వెతల నుంచి దేశ ప్రజలకు ఉపశమనం కల్గించేందుకు రాబోయే ఆరు నెలల్లో రూ.5,00,000 కోట్లు సమకూర్చుకోవడం కష్టమవుతుందా? ఇదొక అనివార్య నైతిక, ఆర్థిక కర్తవ్యం. మనం ఈ విధ్యుక్త ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలి.

కరోనా వైరస్ (కొవిడ్ 19) విపత్తులో మనం ఎక్కడున్నాం? ఆ మహమ్మారిని నిర్మూలించడంలో ముందంజ వేస్తున్నామా? లేక వెనుకబడి పోతున్నామా?

మహారాజశ్రీ ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్‌లు, ప్రభావిత దేశాల నుంచి భారతీయులను స్వదేశానికి తీసుకు రావడంలోను, సదా చేతులు శుభ్రపరచుకోవాలి, మాస్క్‌లు ధరించాలి... ఇత్యాది సలహాలు ఇవ్వడంలోను చాలా బిజీగా వున్నది మరి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మార్చి 19న దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఆదివారం(మార్చి 22) నాడు ఆసేతు హిమాచలం యావత్ప్రజలు స్వచ్ఛందంగా జనతా కర్ఫ్యూ పాటించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఇవన్నీ తప్పనిసరే, సందేహం లేదు. అయితే ఇవే సరిపోతాయా? సంక్షోభం సమసిపోయేలా చేస్తాయా?

హృదయవిదారక విషాదాన్ని ప్రతిబింబిస్తున్న ఒక అంకె అభివృద్ధిని నేను చాలా జాగ్రత్తగా గమనిస్తున్నాను. అది, కొవిడ్ 19 బాధితుల సంఖ్య అని మరి చెప్పనవసరం లేదు. కరోనా వైరస్ సోకినట్టు వైద్య పరీక్షల్లో నిర్ధారితమైన కేసుల సంఖ్యను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజలకు నివేదిస్తోంది. మార్చి 1న ఈ కేసుల సంఖ్య 2; మార్చి 8న ఆ కేసులు 32 కు పెరిగాయి; మార్చి 15న ఈ సంఖ్య 111 గా వున్నది. మార్చి 20న నేను ఈ వ్యాసం రాస్తున్న సమయానికి కరోనా పాజిటివ్ కేసులు 223కి పెరిగాయి. ఈ కేసుల సంఖ్య ఎంతో ఆందోళనకరంగా పెరుగుతోంది. ఇది అనివార్య పరిణామం.

ఇదలా వుంచితే ప్రధానమంత్రి కోరిందేమిటి? నైతిక ఆయుధాలతో ఆరోగ్య శత్రువు కొవిడ్ 19 పై పోరాడమని మోదీ విజ్ఞప్తి చేశారు. అయితే, కరోనా వైరస్ అనేది సమున్నత నైతిక విలువలను మనసా,వాచా,కర్మణా ఆచరించే క్లైమెంట్ అట్లీ లాంటి జీవి కాదు కదా. మరి కొద్దిరోజుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కఠినాతి కఠినమైన ఆర్థిక, సామాజిక చర్యలతో ప్రజల ముందుకు రావడం అనివార్యమని, తప్పక వస్తారని నేను నిశ్చితంగా భావిస్తున్నాను. దేశ వ్యాప్తంగా పట్టణాలు, నగరాలు అన్నిటినీ రెండు నుంచి నాలుగువారాల పాటు పూర్తిగా మూసివేయాలని ప్రభుత్వాన్ని కోరాను.

కరోనా వైరస్ ప్రజల ఆరోగ్యాన్నే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థనూ అల్లకల్లోలం చేస్తోంది. జాతి ఆర్థిక కార్యకలాపాలపై ఆ మహమ్మారి ప్రభావం చాలా తీవ్రంగా వున్నది. ప్రస్తుతం మన ఆర్థికాభివృద్ధి మందగించడానికి కొవిడ్ 19 కారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచ్యంగా చెప్పారు. ఇది నిజం కాదు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు పతనం కరోనా వైరస్ ప్రబలడానికి పూర్వమే ప్రారంభమయింది. వరుసగా ఏడు త్రైమాసికాలలో వృద్ధిరేటు అంతకంతకూ పడిపోయింది ప్రస్తుత త్రైమాసికం(2020 జనవరి–మార్చి)లో వృద్ధిరేటు పరిస్థితి మెరుగ్గా వుండగలదనే భరోసాను సంబంధిత సమాచారమేదీ ఇవ్వడం లేదు. జీడీపీ వృద్ధి రేటు ఈ త్రైమాసికంలోనూ గత త్రైమాసికం(2019 అక్టోబర్–డిసెంబర్)లో మాదిరిగానే వుంటుందని సహజ వివేకం స్పష్టం చేస్తున్నది. అంతకంటే అధ్వాన్నం కాకపోవడమే మనకు పదివేలు. ఈ పరిస్థితులు పరిశ్రమలు, వ్యాపార సంస్థలను ప్రతి కూలంగా ప్రభావితం చేయడం ఖాయం. పెద్ద ఫ్యాక్టరీలు తమ కార్మికులను తాత్కాలికంగా తొలగిస్తున్నాయి. తాత్కాలిక ఉద్యోగాలను పూర్తిగా రద్దు చేస్తున్నారు(ఇంతవరకు చేయకపోయినా అతి త్వరలోనే అలా జరిగే అవకాశం ఎంతైనా వున్నది). ముడి పదార్థాలకు సంబంధించి బడా పారిశ్రామిక వేత్తల ఆర్డర్లు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. సరఫరాదారులు దివాలా తీస్తున్నారు. చిన్న ఉత్పత్తిదారులు నగదు సమస్యను ఎదుర్కొంటున్నారు. ఉత్పత్తిదారులకు పరపతి సదుపాయం కొరవడింది. ఇవన్నీ శీఘ్రగతిన దిగజారిపోతున్న ఆర్థిక వ్యవస్థ సహజ పర్యవసానాలే. ఈ ఆర్థిక పతనాన్ని నిరోధించేందుకు తోడ్పడే సరైన విధానాలను రూపొందించి, అమలుపరచడంలో ప్రభుత్వం విఫలమయిందని నేను విమర్శించాను. చాలా విషయాలలో ప్రభుత్వం



సరైన చర్యలు తీసుకోలేదన్నది ఒక కఠోర వాస్తవం. నా యీ విమర్శలు చాలా కాలం కిందటివే అయినా ఇప్పటికీ పూర్తిగా వర్తిస్తాయి.

కరోనా వైరస్ కల్లోలానికి ప్రభుత్వాన్ని తప్పుపట్ట కూడదు. అయితే ఆ మహమ్మారి కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని చెప్పక తప్పదు. ఎందుకని? ప్రజల ఉపాధి, ఉద్యోగాలు, వేతనాలను కాపాడడమనేది ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. ఉద్యోగాలు ప్రమాదంలో పడిన రంగాలను శీఘ్రగతిన గుర్తించి, ఆయా రంగాలలో ప్రస్తుత ఉద్యోగిత, వేతనాల స్థాయిని రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే పూనుకోవాలి. ఆ తరువాత అసంఘటిత రంగంపై ప్రభుత్వం తన దృష్టిని నిలపాలి. రవాణా, పర్యాటకం, నిర్వహణ, మరమ్మత్తులు, హోం డెలివరీ మొదలైన 'నిర్మాణ', 'సేవల' రంగాలలో అసంఖ్యాక ప్రజలు ఉపాధి పొందుతున్నారు. తక్కువ వడ్డీరేట్లు, పన్ను రాయితీలు, కొనుగోళ్ళను పెంచడం మొదలైన చర్యలతో ప్రభుత్వం విధిగా అసంఘటిత రంగాన్ని ఆదుకోవాలి.

ఇక వ్యవసాయ రంగం. అదృష్ట వశాత్తు రైతులు తమ సేద్య కార్యకలాపాలను యథావిధిగా కొనసాగిస్తున్నారు. భూములు దున్నుతున్నారు, విత్తనాలు చల్లుతున్నారు, కలుపు మొక్కలను ఏరివేస్తున్నారు. పొలాలకు నీరు పారిస్తున్నారు, ఎరువులు వేస్తున్నారు. కోతలు, నూర్పిళ్ల చేస్తున్నారు. పరోక్ష భూస్వాములతో సహా భూములపై యాజమాన్య హక్కులు గల వారికే ప్రధానమంత్రి కిసాన్ పథకం లబ్ధి సమకూరుతున్నది.. ఈ పథకం కింద రైతులకు ఇస్తున్న డబ్బును రూ. 12,000కి పెంచాలి. 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఇంకా చెల్లించని మొత్తాన్ని తక్షణమే చెల్లించాలి. కౌలుదారులను కూడా ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చి వారికి కూడా కుటుంబానికి రూ.12,000 చొప్పున ఇవ్వాలి. భూస్వాములు, కౌలుదారులను ఆదుకోవడమంటే వ్యవసాయ కూలీలను సైతం పాక్షికంగా ఆదుకోవడమే అవుతుంది. వ్యవసాయేతర దినసరి కూలీలను కూడా ప్రభుత్వం తప్పక ఆదుకోవాలి. శ్రామిక జనావళిలో వీరి సంఖ్యే అత్యధికమన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. ప్రతి మండలంలోనూ దినసరి కూలీలకు సంబంధించి ఒక రిజిస్టర్‌ను నిర్వహించాలి. ఈ రిజిస్టర్‌లో తమ పేర్లను నమోదు చేయించుకున్న దినసరి కూలీలందరికీ నెలసరి సహాయ భత్యం ఇవ్వాలి. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోని న్యాయ్ భావనలో ఈ ప్రతిపాదన వున్నది. ఈ సహాయ భత్యాన్ని మూడు నుంచి ఆరు నెలల పాటు చెల్లించాలి. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై మరింత భారాన్ని తప్పక మోపుతుంది. అయితే, దీన్ని మనం భరించి తీరాలి.

పారిశ్రామిక వేత్తలకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇతోధిక ఆర్థిక సహాయమందించేందుకు, ఆలా పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయి. మరి, ఈ నిధులను ప్రభుత్వాలు ఎలా సమకూర్చుకోవాలి? సమకూర్చుకోగలగడం సాధ్యమేనా? సాధ్యమే. అయితే, ఇందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వ్యర్థ వ్యయాలను ఎటువంటి మినహాయింపులు లేకుండా నిలిపివేయాలి. భారీ ప్రాజెక్టుల నిర్మాణాన్ని , పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించని ప్రాజెక్టులను తాత్కాలికంగా నిలిపివేయాలి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం ఎంత ముఖ్యమో ఆర్థిక సుస్థిరతను కాపాడడం కూడా రిజర్వ్ బ్యాంకుకు అంతే ప్రధాన లక్ష్యం కావాలి. సమాజంలోని వివిధ వర్గాల వారిని ఆదుకోవడానికి మొత్తంగా ఎంత డబ్బు అవసరమవుతుందనే విషయమై ఇంకా ఒక ఖచ్చితమైన అంచనాలేదు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ప్రకారం కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయం రూ. 30, 42, 230 కోట్లు. ఇదే ఆర్థిక సంవత్సరంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.40 నుంచి 45 లక్షల కోట్లను ఖర్చు పెట్ట నున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం వ్యయం ఇంత భారీ మొత్తంలో వున్నప్పుడు కొవిడ్ 19 వెతల నుంచి దేశ ప్రజలకు ఉపశమనం కల్గించేందుకు రాబోయే ఆరు నెలల్లో రూ.5,00,000 కోట్లు సమకూర్చుకోవడం సుసాధ్యమే. ఇదొక అనివార్య నైతిక, ఆర్థిక కర్తవ్యం. మనం ఈ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించేందుకు అవసరమైన ధనాన్ని సమకూర్చుకుని , చిత్త శుద్ధితో సంపూర్ణంగా ఖర్చు చేయాలి.

*(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)*

ఏది నాగరికత..

# ఉరి తీయడమా, తీయాలని తొందర పడడమా?

**మరణ శిక్షలో అసలైన శిక్ష ఏమంటే నేరస్థుడికి తన మరణం ఎప్పుడో తెలియడమే. ఫలానా తేదీన చనిపోతానని తెలిసిన మనిషి పడే వేదన, బాధ, సంఘర్షణలే అసలైన మరణ యాతన. అదే మరణ శిక్ష.**

ఉరి తీసేసారు. ఆ నలుగురూ కిరాతక నేరస్థులు. ఏమాత్రం దయకు అర్హులుకాని అమానుష నేరస్థులు. అతి దారుణంగా ఒక యువతిపై అత్యాచారం జరిపి అత్యంత హేయంగా చంపేసిన రాక్షసులకు భారతీయ న్యాయశాస్త్రంలోని అన్ని రకాల రక్షణ అవకాశాలను వాడుకునేందుకు వీలు కల్పించి, వారికి బతికే ఆస్కారం లేదని తేల్చిన తరువాత, వీరిని చంపడమే సరైన శిక్ష అని పౌరసమాజానికి సందేశం ఇస్తూ 20వ తేదీ తెల్లవారు ఝామున నలుగురిని ఉరి తీసేసారు. ఆ నలుగురి పేర్లు అనవసరం. వారి బాధితురాలెవరో కూడా చర్చించాల్సిన పని లేదు.

నేరం అనేది బాధితురాలికే కాదు, సమాజానికి కూడా బాధ కలిగించేది. ఈ నిర్భయ దారుణ నేరం ఒక వ్యక్తికి మాత్రమే జరిగిన నష్టం కాదు. సమాజానికి, మనం గొప్పగా చెప్పుకుంటున్న మన సంస్కృతికి, మనం ఎదిగామనుకుంటున్న నాగరికతకు, మనం ఎంతో ఆలోచించి రూపొందించుకున్నామనుకున్న సంవిధాన శాసనాలకు సవాల్. అన్నింటికీ పెద్ద దెబ్బ. నేరం ఒక బస్సులో జరిగింది. అనవసరంగా ఆ బస్సు నగరంలో తిరుగుతూ ఉంటే ఆపే అధికారి లేడు, పోలీసు లేడు, మనిషి లేడు, ఫిర్యాదు చేసే ధైర్యవంతుడు లేడు. ఇట్లా చెబుతూ పోతే, ఇంతటి నేరంలో ఆ నలుగురితో పాటు ఎంతమంది నేరస్థులో లెక్కతేలని గందరగోళంలో పడతాం. మనం ఏం సాధించినట్టు? నిర్భయాన్ని పోగొట్టుకున్నాం. అనేక మంది నిర్భయ వంటి పిల్లలు, తల్లులు, అక్కలు, చెల్లెళ్లు, భార్యలు, మిత్రులు రోజూ దారుణమైన అత్యాచార, హత్యాచారాలకు బలైపోతున్నారు. 'రేప్ చేస్తే చంపుతారు' అనే సందేశం ఇచ్చామా?, 'రేప్ చేసి దొరికితే చచ్చారు. రాజకీయపార్టీలో ఉంటే దొరికే వారే కాదు. మనం దొరక్కుండా ఉందాం' అనే సందేశం ఇచ్చామా? స్వతంత్ర, నాగరిక, రాజ్యాంగపాలిత, సమున్నత న్యాయశాస్త్రాధారిత జీవన విధానాలతో ఎదిగామనుకున్న మనం ఏం సాధించినట్టు?

ఆ తలారి ఎవరో ఈరోజు తలలు వేలాడేదాకా ఉరికొయ్యకు ఆ నలుగురిని ఊపారు. మరో చోట ఆ తలారుల తాత ఒకరు ఉన్నారు. నేరం జరిగిందని తెలిస్తే చాలు వెంటనే ఉసురు తీసేసే తలారి. ఆ తలారి చేతిలో రాజకీయ, పోలీసు అధికారం ఉంది, ఆ తలారి ఆత్మరక్షణ హక్కును వాడుకుంటారు.. ఇంత ఆలస్యం ఉండదు. ఇన్ని సంవత్సరాల విచారణ ఉండదు. తక్షణ న్యాయం జరుగుతుంది. మరి ఆ సుదీర్ఘ న్యాయంలో?...కింది కోర్టులో సాక్షుల విచారణ, లాయర్లు, క్రాస్ ఎగ్జామినేషన్, వాదోపవాదాలు, బెయిల్ పిటిషన్లు, కింది కోర్టు కొట్టేస్తే పైకి, పైపైకి, ఇంకా పైకి, సుప్రీంకోర్టు దాకా వెళ్లి బెయిల్ సాధిస్తారు. మళ్లీ కేసు కిందికి, ఇంకా కిందికి. ఇంకా కింద కిందకు వస్తుంది. మళ్లీ పైకి పైపైకి. అంతులేదు. న్యాయ విచారణకు కాలవ్యవధి లేదు. అవధి లేదు. చివరకు హైకోర్టు ఉరితీయాలని నిర్ణయించిన తరువాత, క్షమాభిక్ష పిటిషన్లు, రాష్ట్రపతి తిరస్కరిస్తే దానిపైన పిటిషన్, దాన్ని కొట్టివేస్తే రివ్యూ, దాన్ని తగలేస్తే క్యురేటివ్ పిటిషన్, దాన్ని వదిలించుకుంటే అసలు ఉరి చెల్లదనే సవాలు, అదీ కాదంటే మళ్లీ మొదటి నుంచి విచారించాలనే పిటిషన్, మళ్లీ రాష్ట్రపతికి క్షమాభిక్ష కోరాం అందాకా ఆగాలనే పిటిషన్, ఆ తరువాత అది తిరస్కరించడం తప్పంటాం. ఏమైనా అంటాం, ఏదో ఓ పిటిషన్ వేస్తాం, చచ్చినా చావనివ్వం. అందుకే, ఈ సోది అంతా ఎందుకు? వెంటనే తెల్లారుఝామున ఆత్మరక్షణకోసం పోలీసులు కస్టడీలో ఉన్న నిందితులను (నిందితులో కాదో తెలియదు, అనుమానితులు అనవచ్చో లేదో తెలియదు) కాల్చి చంపేస్తే సరి. హబ్బ ఎంత రిలీఫ్. సినిమాలో విలన్లు రెండుగంటల పాటు సాగించిన ఘోరాలకు ప్రతీకారంగా చివరి పదినిమిషాల్లో మరణించారు. హీరోకు వందనాలు. వందలాది అభిమానులు క్యూలో నిలబడి పుష్పగుచ్ఛాలు ఇచ్చి హీరో పోలీసు అధికారికి అభినందనలు తెలిపారు. టీవీలు ప్రత్యక్ష ప్రసారం చేశాయి. దేవతలు పూలు కురిపించారు. న్యాయం అంత తొందరగా వస్తే ఎంత బాగుంటుంది. ఈ పోలీసు దర్యాప్తులు, కోర్టులు, లాయర్లు, అప్పీళ్లు, బెయిళ్లు, రివ్యూలు, ఎందుకంట. కింది కోర్టు మధ్యకోర్టు, హైకోర్టు దాని పై కోర్టు, సుప్రీంకోర్టు, ఎందుకెందుకు. మనకు తలారి ఒకడుంటే చాలు. తక్షణ న్యాయం దొరికిపోతుంది. మెకాలేకు తలకాయ లేదు. జేమ్స్ స్టీఫెన్సన్‌కు మెదడులేదు. అంబేద్కర్ అనవసరంగా రూల్ ఆఫ్ లా సమన్యాయం అన్నాడు. వీళ్ల వల్లే ఈ ఆలస్యమంతా. వెంటనే న్యాయం కావాలి. కావాలి. ఇంకా ఎందుకు ఆలస్యం, వెనువెంటనే కావాలి. తొందరగా...ఉరి తీయండి. తీసేయండి. చంపేసేయండి. బాహుబలి రెండు భాగాలంటే కొన్నేళ్ల ఆలస్యం. విలన్ని మొదటి పార్టులోనే చంపండి. ప్లీజ్ క్విక్ జస్టిస్, ఇన్‌స్టంట్ కాఫీ లాంటి జస్టిస్. మనకు తలారి కావాలి, ఛీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ఎందుకు దండగ. దిశపై అత్యాచార, హత్యాచారాలకు పాల్పడ్డ వారు (అవునని మీడియా వారు ఇదివరకే విచారించి చెప్పారు కనుక) ఒక్క క్షణం కూడా బతకడానికి వీల్లేదు. ఆ తలారి ప్రజల మనోభిప్రాయాన్ని పూర్తి చేశాడు. జనరంజకుడా తలారి. ఒక్కతలారి ఉంటే న్యాయం జరుగుతున్నపుడు ఎందుకండీ ఈ లా కాలేజీలు, లాయర్లు, జడ్జిలు, కోర్టులు. ఛ.. ఛ.. ఎంత చెప్పినా బుద్ధి రాదు. తలారిని ఛీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాగా నియమిస్తే సరి. ఏ బాధా ఉండదు. మనదేశానికి ఒక పీ ఎం, ఒక హెచ్ ఎం, ఒక రాష్ట్రపతి, ఒక తలారి ఉంటే చాలు. మిగతావన్నీ టైం వేస్ట్.

సత్వర న్యాయం అంటే ఏమిటి? నేరం జరిగిన తరువాత నిష్పాక్షికమైన, స్వతంత్రమైన సమర్థవంతమైన దర్యాప్తు జరిపి,



> శిక్ష లక్ష్యాలలో సమాజపు ఆగ్రహాన్ని చల్లార్చడం ఒకటి. కాని అదే ముఖ్యం కాదు. నిర్భయ అత్యాచారం, హత్య పట్ల దేశం మొత్తం ఆగ్రహంతో ఊగిపోయింది. అందుకే, చాలామంది దోషులు చస్తుంటే చూడాలనే ప్రతీకారేఛ్ఛతో రగిలిపోతూ ఉంటారు. వీరు గమనించాల్సింది ఏమంటే దోషులు ఎప్పుడైతే జైల్లో పడ్డారో అప్పుడే వారి శిక్ష అమలు మొదలైందని. ఉరి తీయడం కేవలం ముగింపు మాత్రమే. అందుకోసం తొందర అనవసరం.

అన్ని పరీక్షలకు నిలబడే సాక్ష్యాలు సేకరించి, రోజువారి విచారణ జరిపి, వాయిదాలడిగితే లాయర్లకు జరిమానాలు విధించి, సాక్ష్యాలు విన్న జడ్జిగారిని బదిలీ చేయకుండా అక్కడే చివరి తీర్పు ఇచ్చేదాకా ఉంచి, నిందితుడు మన పార్టీ నాయకుడనే ప్రేమతో జడ్జిని చంపేయకుండా బతకనిచ్చి, నిందితుడు నేరస్థుడని ఆ జడ్జి తీర్పు చెప్పి జైల్లో పడేయడం సత్వర న్యాయం అంటే.

జైలు శిక్ష అంటే నేరగాడు జైల్లో పడడంతో శిక్ష పడ్డట్టే. శిక్ష పూర్తిగా అమలు కావడం ఎప్పుడూ తొందరగా కాదు. ఎందుకంటే యావజ్జీవ కారాగార శిక్ష అంటే ఇవ్వాళ జైల్లో పడ్డ వ్యక్తి బతికి ఉన్నంత వరకూ అని అర్థం. అక్కడ శిక్ష పూర్తయ్యే దాకా అమలు కాలేదని ఎవరైనా అనగలరా? లేదు. నిర్భయ హంతక అత్యాచారులకు శిక్ష పడింది. వారు జైల్లో ఉన్నారు. ఉరి ఎప్పుడు తీయాలనే తేదీలు మారుతూ వచ్చాయి. వారి శిక్ష ఖరారు అయి జైల్లో పడ్డనాడే ఆలస్యం లేకుండా శిక్ష అమలైందని అర్థం. ఉరితీసినప్పుడే అని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. అది పొరబాటు. ఎందుకంటే... నిర్భయ హంతకులు నేరస్తులని ప్రతి వ్యక్తికీ అర్థం అయింది. దానికి కారణం మీడియాలో ఆ నేర వివరాలు అనేక సార్లు చర్చకు రావడం. నిర్భయ హంతకులను శిక్షించడానికి చాలా సాక్ష్యాలు ఉన్నాయి. అన్ని కేసుల్లో రేప్ హత్యలకు ఇంతగా సాక్ష్యాలు ఉండవు. వాటిగురించి మీడియాలో చర్చ జరగదు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ నాయకులు నిందితులుగా ఉన్నచోట మీడియా చర్చ జరగదు. విచారణ వేగంగా జరగదు. నిర్భయ దుర్మార్గ కాండలో నిందితులు పలుకుబడి ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు, సినిమా నటులు, మఠాధిపతులు, ముఠానాయకులు కాదు కనుక, వారి తరఫున ఖరీదైన లాయర్లు రాలేదు. కనుక విచారణ తొందరగా జరిగింది. దిశ అత్యాచార, హత్యా కాండలో రాజకీయ నాయకులెవరూ లేరు కనుక నిందితులను పిట్టలను కాల్చినట్టు కాల్చేసే హీరోలు తయారయ్యారు. యుపిలో ఒక కిరాతకుడు రేప్ చేయడమే కాక, బాధితురాలి తండ్రిని చంపేసాడు. యాక్సిడెంట్ చేసి ఈమెను కూడా చంపాలని ప్రయత్నం చేసాడు. కోర్టు తీర్పులు కూడా వచ్చాయి. కాని అక్కడికి మన తలారి వెళ్లడు. ఆ హీరోకు అంత దమ్ములేదు. వెంటనే న్యాయం చేయడానికి ఉరి తీయడు. మన ప్రతాపం అంతా చేతగాని వాళ్లమీద, కట్టేసిన వాళ్లమీద. ఎదురు నిలబడి పలుకుబడితో పోరాడే నేరగాళ్ల మీద కాదు. ఇదంతా మనవాళ్లు అడగరు. ఎందుకంటే వాడు అధికారపార్టీ నాయకుడు. న్యాయవిచారణ గడియారం అక్కడ ఆగిపోతుంది. తలారి అధికారులు ఉండరు, లాయర్లు ఉంటారు. అధికార పార్టీకి భయపడి మీడియా కూడా ఏమీ మాట్లాడదు. సత్వర న్యాయం ఎక్కడికి పోయింది బ్రదర్?

ఇంకో కోణం ఉంది. సాక్ష్యాలు సరిగా లేని నేరాల్లో, అసమర్థులు, అవినీతి పరులైన పోలీసులు, ఫిక్సర్లుగా పనిచేసే న్యాయవాదులు, ఆశలకు పడిపోయే న్యాయమూర్తులు ఉన్న వ్యవస్థలో నేరం రుజువైందని కోర్టులు తీర్పులు చెప్పినా నిజం గెలిచిందని నమ్మడానికి వీలుందా? కొందరు జడ్జిలు లొంగకపోవచ్చు. కానీ, వారు ఒకరో ఇద్దరో ఉన్నా అమాయకులకు మరణశిక్ష విధించే వీలు ఈ అవినీతి జాతిలో ఉంది. అయితే, కోర్టు తీర్పు ఉందని వెంటనే ఉరి తీయడం న్యాయమా.. తరువాత బేరం దొరకక ఒకరెవరో అన్యాయంగా నేను శిక్ష వేసానని నిజం చెబితే ఉరిలో తీసిన ప్రాణం వస్తుందా? అందుకే న్యాయశాస్త్రం, అందుకే సాక్ష్యాల నిశిత పరీక్ష, అందుకే చంపడానికి ముందు అనేకానేక అవకాశాలు.

నిర్భయ కేసులో మనకు ఆలస్యం వలె కనిపిస్తుంది. జడ్జి లోయా వంటి కేసుల్లో ఏం చేద్దాం. కవిత్వం రాసినందుకు, విమర్శించినందుకు, నిజం చెప్పినందుకు దొంగకేసులు బనాయించే ఈ అక్రమ రాజ్యంలో అబద్ధపు రేప్ కేసులో ఒక అమాయకుడిని ఇరికిస్తే వాడిని ఉరి తీయాలని ఒకరెవరో ఆదేశిస్తే, మరోసారి విచారించడానికి మరొక్క అవకాశం ఇస్తే ఆలస్యమా, అన్యాయమా?

ఉరి తీస్తుంటే పాప్‌కార్న్ తింటూ, కోకాకోలా తాగుతూ చూసి ఆనందించడానికి జీవితం సినిమా కాదు, ప్రతిసారీ సెకండ్ హాఫ్‌లో విలన్ చావడు. ఈ దేశంలో విలన్లు నిజం, హీరో ఒక భ్రమ, ఒక ఆశ. నిజం కాలేని కల. ఉరి తీయడానికి తొందర పడడం అనాగరికత. ఉరే అనాగరికత అనేది మరో చర్చ. చంపడం తప్పని చంపి చూపించే న్యాయశాస్త్రం మనది.

శిక్షాస్మృతి, నేరకారణ శాస్త్రం ప్రకారం శిక్ష లక్ష్యాలలో సమాజపు ఆగ్రహాన్ని చల్లార్చడం ఒకటి. కాని అదే ముఖ్యం కాదు. నిర్భయ హత్య, అత్యాచారం పట్ల దేశం మొత్తం ఆగ్రహంతో ఊగిపోయింది. అందుకే, చాలామంది వారు చస్తుంటే చూడాలనే ప్రతీకారేఛ్ఛతో రగిలిపోతూ ఉంటారు. వారు కూడా గమనించాల్సింది ఏమంటే ఎప్పుడైతే వారు జైల్లో పడ్డారో అప్పుడే వారి శిక్ష అమలు మొదలైందని. ఉరి తీయడం కేవలం ముగింపు మాత్రమే. అందుకోసం తొందర అనవసరం. ఇంకో మాట. మరణ శిక్షలో అసలైన శిక్ష ఏమంటే నేరస్థుడికి తన మరణం ఎప్పుడో తెలియడమే. ఫలానా తేదీన చనిపోతానని తెలిసిన మనిషి పడే వేదన, బాధ, సంఘర్షణలే అసలైన మరణ యాతన. నిజంగా ఒక క్షణంలో మనిషి చనిపోతాడు. అది వాడికి తెలిసేలోగా చస్తాడు. కాని ఫలానా తేదీన చస్తానని తెలిసిన మనిషి క్షణ క్షణం చస్తాడు. అదే మరణ శిక్ష. ఆ నలుగురికి నిన్న తెల్లవారు ఝామున శిక్ష పడిందా లేక, వారిని ఉరి తీయాలని తీర్పు వచ్చిన నాటి నుంచా? కాస్త మెదడుతో ఆలోచించి అర్థం చేసుకోండి. మనుషల్లా మాట్లాడండి.

□ మాడభూషి శ్రీధర్



## ఇక 'నిర్భయ'మేనా!?

'నిర్భయ' కేసులో ఏడేళ్లకు పైగా సాగిన సుదీర్ఘ న్యాయ పోరాటం... చివరకు నేరస్థులకు ఉరితో ముగిసింది. ఎట్టకేలకు న్యాయం లభించిందని దోషులను ఉరితీసిన అనంతరం శుక్రవారం ఉదయం ఢిల్లీలోని తీహార్ జైలు వద్ద ఆమె తల్లి ఆశాదేవి, బంధువులు సంతోషం వ్యక్తం చేశారు. కానీ... ఈ మరణదండన ఇకపై ఇలాంటి హత్యాచారాలకు అడ్డుకట్ట వేస్తుందా? నేరం చేయాలనే ఆలోచన వచ్చినవారికి వెన్నులో వణుకు పుట్టిస్తుందా? దేశంలో ఆడపిల్ల నిర్భయంగా తిరగగలుగుతుందా? ఇది జవాబు లేని ప్రశ్నే!

వినూత్నం

# రోబోల సాయంతో...



కరోనా పంజా విసిరిన నేపథ్యంలో రోబోల కార్యక్షేత్రం మారింది. ఇన్నాళ్లు ఆతిథ్య, నిర్మాణ, తయారీ లాంటి రంగాలకే ఎక్కువగా పరిమితమైన రోబోల వినియోగం ఇప్పుడు కేరళలో ఒక కొత్త పుంత తొక్కింది. అక్కడ కరోనా వ్యాప్తిని అడ్డుకోవడంలో రోబోలు తమవంతు పాత్ర పోషిస్తున్నాయి. కొచ్చి సమీపంలోని 'కేరళ టెక్నాలజీ ఇన్నొవేషన్ జోన్'లోని మేకర్స్ విలేజ్ దగ్గర ఈ రోబోలను ఏర్పాటు చేశారు. స్టార్టప్ కాంప్లెక్స్‌లోని కంపెనీల్లో 600 మంది వరకూ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆ రెండు రోబోలు ప్రవేశం దగ్గర నిలబడి ఉద్యోగుల చేతుల మీద శానిటైజర్లను స్ప్రే చేస్తున్నాయి. అవసరమైన వారికి మాస్కులు అందిస్తున్నాయి. అంతేకాదు కోవిడ్ - 19 వైరస్‌కు సంబంధించిన సందేహాలను కూడా ఆ రోబోలు తీరుస్తున్నాయి. కరోనాకు సంబంధించిన ఏ విషయం గురించి అడిగినా ఆ రోబోలు ఇట్టే చెప్పేస్తున్నాయి. ఈ వినూత్న కరోనా అవగాహన ప్రయత్నం ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

వంటిల్లు

**పెరుగులో ప్రొ బయోటిక్స్ ఉంటాయి కాబట్టి రోగనిరోధక శక్తిని ఇస్తుంది. దీనివల్ల శరీరానికి వైరస్‌లతో పోరాడే శక్తి లభిస్తుంది. పైగా వేసవికాలం చల్లదనానికి పెరుగు ఎంతో మేలు చేస్తుంది. పెరుగుతో తడ్కా, కర్రీ, కబాబ్, యోగర్ట్ సలాడ్... ఇలాంటివి ఎన్నో చేసుకోవచ్చు. ఆరోగ్యానికి ఆరోగ్యం... రుచికి రుచి. ఆలస్యమెందుకు... మీరూ ట్రై చేయండి.**

# శక్తి పెరుగుతుంది!

## దహీ తడ్కా



**కావలసినవి:** పెరుగు - మూడు కప్పులు, ఉల్లిపాయలు - రెండు, టొమాటో - ఒకటి, అల్లంవెల్లుల్లి పేస్టు - రెండు టీస్పూన్లు, ఆవాలు - ఒక టీస్పూన్, కారం - ఒక టీస్పూన్, పసుపు - అర టీస్పూన్, కరివేపాకు - కొద్దిగా, కొత్తిమీర - కొద్దిగా, పచ్చిమిర్చి - రెండు, ధనియాలు - ఒక టీస్పూన్, మిరియాలు - ఒక టీస్పూన్, ఎండుమిర్చి - రెండు, ఉప్పు - తగినంత, పుదీనా పొడి - కొద్దిగా.

**తయారీ:** పెరుగులో సన్నని క్లాత్‌తో వడబోసి పక్కన పెట్టుకోవాలి.

- పాన్ వేడి చేసి కాస్త నూనె వేసి వేడి అయ్యాక ఆవాలు వేసి వేగించాలి.
- పసుపు, ఉప్పు, కారం, గరంమసాల, పుదీనాపౌడర్ వేసి నిమిషం పాటు వేగనివ్వాలి.
- తరువాత ఉల్లిపాయలు, టొమాటో, పచ్చిమిర్చి వేయాలి.
- మసాల చిక్కగా అయ్యే వరకు వేగించాలి.
- చివరగా పెరుగు వేసి కలుపుకోవాలి.
- ఎండుమిర్చిని దంచి చల్లాలి. కరివేపాకు, కొత్తిమీరతో గార్నిష్ చేసి, అన్నం లేదా చపాతీతో తింటే రుచిగా ఉంటుంది.

## కాకరకాయ పెరుగు కర్రీ



**కావలసినవి:** కాకరకాయలు - ఎనిమిది, పెరుగు - అరకప్పు, పసుపు - అర టీస్పూన్, అల్లం పొడి - అర టీస్పూన్, ధనియాల పొడి - ఒక టేబుల్ స్పూన్, ఉప్పు - తగినంత, జీలకర్ర - ఒక టీస్పూన్, ఇంగువ - చిటికెడు, మెంతులు - అర టీస్పూన్, ఆవాల నూనె - పావు కప్పు.

**తయారీ:** ముందుగా జీలకర్ర, మెంతులను వేగించాలి.

- కాకరకాయలపై గరుకుగా ఉన్న పొట్టు తీసేసి, ముక్కలను ఉప్పు వేసి బాగా కలిపి అరగంట పాటు పక్కన పెట్టుకోవాలి. కాకరకాయలను పిండి నీటిని తీసేస్తే చేదు పోతుంది.
- పాత్రలో పెరుగు తీసుకొని అందులో పసుపు, కారం, వేగించిన జీలకర్ర, మెంతులు, ఉప్పు, ఇంగువ వేసి కలుపుకోవాలి.
- స్టవ్‌పై పాన్ పెట్టి నూనె వేసి కాస్త వేడయ్యాక కాకరకాయలు వేసి కాసేపు వేగించుకుని పక్కన పెట్టాలి.
- అదే పాన్‌లో కాస్త నూనె వేసి పెరుగు మిశ్రమం వేయాలి. తరువాత కాకరకాయ ముక్కలు వేసి కలుపుకొని వేగించాలి.
- ఉడుకుతున్న సమయంలో మధ్యమధ్యలో కలియబెడితే రుచికరమైన పెరుగు కర్రీ రెడీ అవుతుంది.
- అన్నంలోకి ఈ కర్రీ రుచిగా ఉంటుంది.

## పెరుగు కబాబ్



**కావలసినవి:** పెరుగు - 400గ్రాములు, పనీర్ - 100గ్రాములు, ఉల్లిపాయ - ఒకటి, అల్లం - చిన్నముక్క, కొత్తిమీర - ఒక కట్ట, బాదం పలుకులు - పది, ఎండుద్రాక్ష - ఐదారు, మిరియాల పొడి - అర టీస్పూన్, యాలకుల పొడి - అర టీస్పూన్, ఉప్పు - రుచికి తగినంత, నూనె - సరిపడా, మొక్కజొన్న పిండి - కొద్దిగా, ఓట్స్ - ఒక కప్పు.

**తయారీ:** పెరుగును సన్నటి గుడ్డలో వేసి నీళ్లు వార్చాలి.

- పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక ఉల్లిపాయలు వేసి వేగించి పక్కన పెట్టుకోవాలి.
- ఒక పాత్రలో పెరుగు తీసుకుని, పనీర్ ముక్కలు వేయాలి. ఎండు ద్రాక్ష, బాదం పలుకులు, వేగించిన ఉల్లిపాయలు వేసి కలుపుకోవాలి. మిరియాల పొడి, యాలకుల పొడి, ఉప్పు వేయాలి.
- ఇప్పుడు మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా చేతుల్లోకి తీసుకుని వత్తుకుంటూ మొక్కజొన్న పిండి అద్దుకోవాలి. తరువాత ఓట్స్‌ను అద్దాలి.
- పాన్‌లో నూనె వేసి వేడి అయ్యాక కబాబ్‌లను వేసి గోధుమరంగులోకి మారే వరకు వేగించాలి.
- చట్నీతో సర్వ్ చేసుకుంటే కబాబ్‌లు కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

## బంగాళదుంప యోగర్ట్



**కావలసినవి:** బంగాళదుంపలు - అరకేజీ, పెరుగు - 200ఎంఎల్, నూనె - ఒక టేబుల్‌స్పూన్, జీలకర్ర - టీస్పూన్, ఆవాలు - టీస్పూన్, ఉప్పు - తగినంత, ఉల్లిపాయలు - రెండు, పైనాపిల్ ముక్కలు - కొన్ని, పుదీనా - కొద్దిగా, పచ్చిమిర్చి - రెండు, బ్రెడ్‌ముక్కలు - నాలుగు.

**తయారీ:** బంగాళదుంపలను ఉడికించాలి. తరువాత పొట్టు తీసి సన్నటి ముక్కలుగా కట్ చేసుకోవాలి.

- పాత్రలో బంగాళదుంపల్ని వేసి, పెరుగు పోయాలి.
- స్టవ్‌పై పాన్‌లో నూనె పోసి కాస్త వేడయ్యాక ఆవాలు, జీలకర్ర వేసి వేగించాలి. ఈ పోపుని బంగాళదుంపల ముక్కలపై పోయాలి.
- ఉల్లిపాయలు, పైనాపిల్ ముక్కలు వేయాలి.
- బ్రెడ్ ముక్కలు పొడిపొడిగా చేసి చల్లాలి.
- పచ్చిమిర్చి సన్నగా తరిగి వేయాలి. పుదీనాతో గార్నిష్ చేయాలి.
- తర్వాత ఫ్రిజ్‌లో పెట్టి చల్లచల్లగా సర్వ్ చేయాలి.

# ఎంచక్కా... ఇంట్లోనే!

ఇలా చేద్దాం!



**కరోనా వైరస్ విజృంభిస్తుండడంతో అనేక రాష్ట్రాలలో పాఠశాలలకు అనుకోకుండా సెలవులు వచ్చిపడ్డాయి. దీనివల్ల చాలామంది పిల్లలు ఏడాది చివర పెట్టే పరీక్షలకు సన్నద్ధం కాలేకపోతున్నారు. టీచర్ల దగ్గర సందేహాలు నివృత్తి చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. అయితే ఇంటిపట్టునే ఉన్నా, వెబ్‌సైట్లు, లెర్నింగ్ యాప్స్‌ను ఎంచుకోవడం ద్వారా పిల్లలు పరీక్షలకు పూర్తి స్థాయిలో ప్రిపేర్ కావచ్చు.**

స్కూల్‌కు వెళ్లకపోయినా, టీచర్లు అందుబాటులో లేకపోయినా ఇంట్లో కంప్యూటర్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు. సందేహాలను నివృత్తి చేసుకుంటూ పరీక్షలకు సన్నద్ధం కావచ్చు. కంప్యూటర్ లేకపోతే నాన్న వాడుతున్న స్మార్ట్‌ఫోన్‌లో లెర్నింగ్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకున్నా సరిపోతుంది. కొన్ని పాఠశాలలు ఇప్పటికే యాప్‌లు తయారు చేసి పిల్లలకు అందించాయి. వాటిలోనే పిల్లలకు అవసరమైన గైడెన్స్ ఇస్తున్నాయి. ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహిస్తున్నాయి. ఒకవేళ మీ స్కూల్‌కు అలాంటి యాప్ లేకపోతే మీ స్మార్ట్‌ఫోన్‌లో కొన్ని యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకుని ప్రిపేర్ కావచ్చు.

**● టాపర్‌గా నిలవాలంటే...**




సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌తో పాటు స్టేట్‌బోర్డు సిలబస్ విద్యార్థులకు "TOPPR' యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ యాప్‌ను ఎంచుకోవచ్చు. ఇందులో వీడియో పాఠాలు సైతం వినచ్చు. హిందీ, ఇంగ్లీషులో పాఠాలు అందుబాటులో ఉంటాయి. మాక్‌టెస్టులకు హాజరు కావచ్చు. మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్.... ఇలా సబ్జెక్ట్ ఏదైనా 24 గంటలూ సబ్జెక్ట్ నిపుణులు అందుబాటులో ఉంటారు. గత ప్రశ్న పత్రాలు, ముఖ్యమైన ప్రశ్నలు అందుబాటులో ఉంటాయి. https://www.toppr.com/

**● టాపిక్ వైజ్ టెస్టుల కోసం...**

మోడల్ ప్రశ్నపత్రాల సహాయంతో పరీక్షకు సిద్ధం కావడానికి 'మెరిట్‌నేషన్' ఉపయోగపడుతుంది. పిల్లలు చదువుకుంటున్న సమయంలో ఎదురయ్యే సందేహాలకు సమాధానాలు తెలుసుకోవచ్చు. వీడియో పాఠాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రాక్టీస్ ప్రశ్నలు అన్‌లిమిటెడ్‌గా లభిస్తాయి. ఆరోతరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. టాపిక్ వైజ్‌గా టెస్టులు రాసే వీలుంది. రివిజన్ చేసుకోవడానికి సులభమైన నోట్స్ లభిస్తాయి. https://www.meritnation.com/

**● ఆన్‌లైన్‌లో వర్క్‌షీట్లు**

ప్రతి సబ్జెక్టులో పర్‌ఫెక్ట్ కావడానికి 'బైజూస్' యాప్ ఉపయోగపడుతుంది. విద్యార్థులు ఇందులో వీడియో పాఠాలు వినొచ్చు. ఛాప్టర్ వైజ్‌గా టెస్టులు రాయొచ్చు. మొబైల్ యాప్ మాత్రమే కాకుండా, కంప్యూటర్‌లోనూ 'బైజూస్'ను ఉపయోగించుకోవచ్చు. మూడో తరగతి విద్యార్థుల కోసం కూడికలు, తీసివేతలు, వర్డ్ ప్రాబ్లమ్స్... ఇలా అన్ని రకాల పాఠాలు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు తాము చదువుతున్న తరగతికి సంబంధించిన పాఠాలను ఎంచుకోవచ్చు. ఇంగ్లీష్, మ్యాథ్స్, ఈవీఎస్ వర్క్‌షీట్లు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు, నీతికథలు, పద్యాలు కూడా చదువుకోవచ్చు. పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి బైజూస్ బాగా ఉపయోగపడుతుంది. https://byjus.com/

**● లైవ్ టెస్టులు రాస్తారా?**

కిండర్‌గార్టెన్ నుంచి పదో తరగతి వరకు ఏ క్లాస్ చదువుతున్నా 'అన్‌ఫోల్డ్‌యు' యాప్‌ని ఎంచుకుంటే చాలు. మీ సందేహాలన్నీ సమయంతో సంబంధం లేకుండా తీరుతాయి. విద్యార్థుల్లో వేగంగా నేర్చుకునే సామర్థ్యాన్ని ఈ యాప్ పెంపొందిస్తుంది. వీడియో పాఠాలు వినొచ్చు. వారంలో రెండు రోజులు లైవ్ టెస్టులు రాయొచ్చు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబతో పాటు రాష్ట్రాల సిలబస్‌ను పూర్తి స్థాయిలో కవర్ చేస్తుంది. సందేహాలు తీర్చుకోవడానికి సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌తో మాట్లాడే వీలుంది. https://www.unfoldu.com/

**● ఎక్స్‌ట్రా మార్కులు గ్యారంటీ**

షేప్స్, డిజైన్స్, ప్లేస్ వాల్యూ, మెట్రిక్ మెజర్స్, కరెన్సీ... ఇలా మ్యాథ్స్‌కు సంబంధించి రివిజన్, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన సందేహాల నివృత్తికి 'ఎక్స్‌ట్రా మార్క్స్' వెబ్‌సైట్ ఉపకరిస్తుంది. ఈ వెబ్‌సైట్‌లో లాగిన్ అయితే నర్సరీ నుంచి పదోతరగతి వరకు ఏ క్లాస్ అయితే ఆ క్లాస్‌ను ఎంచుకోవాలి. ఇందులో అన్ని రకాల సబ్జెక్టులు ఛాప్టర్ వైజ్‌గా లభిస్తాయి. https://www.extramarks.com/



**● వీడియో పాఠాలు**

నెర్వస్ సిస్టమ్ ఎలా పనిచేస్తుందో పుస్తకాల్లో చదువుకున్నారు. కానీ అదే పాఠాన్ని వీడియో రూపంలో చూస్తే ఇక ఎప్పటికీ మర్చిపోరు. అలాంటి యానిమేటెడ్ వీడియో పాఠాలు 'లెర్న్‌నెక్స్ట్' వెబ్‌సైట్‌లో లభిస్తాయి. తరగతిని బట్టి ఎంచుకోవచ్చు. అన్ని సబ్జెక్టుల పాఠాలు ఇందులో ఉన్నాయి. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. https://www.learnnext.com/

వైరల్

# వారి త్యాగాన్ని గుర్తించండి!



కరోనా... ఈ పేరు వింటేనే జనం హడలెత్తిపోతున్నారు. ఇప్పటికే వేలాది మందిని బలిగొన్న ఈ వైరస్ ఇంకా ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనా రోగులను నిత్యం పర్యవేక్షిస్తున్న డాక్టర్లు, నర్సుల మీద పనిభారం రెండింతలయ్యింది. ఈ మధ్యనే కరోనా సోకిన వాళ్లకు క్వారెంటైన్ సెంటర్‌లో సేవలు చేస్తూ అలసిపోయి కంప్యూటర్ కీ బోర్డ్ మీదే నిద్రించిన ఇటలీకి చెందిన నర్స్ ఫోటో వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా వైద్య చికిత్స అందిస్తున్న ఒక డాక్టర్ భార్య ట్విట్టర్ వేదికగా కరోనా వైరస్ ఉనికి తెలిసిన రోజు నుంచి తమ జీవితం ఎలా మారిపోయిందో పంచుకున్నారిలా...

అమెరికాలోని అట్లాంటాలో ఉండే రేచల్ పాట్జర్ భర్త వృత్తిరీత్యా డాక్టర్. కోవిడ్-19 వైరస్ వెలుగులోకి రావడం మొదలు వారి కుటుంబ జీవితం ఎలా మారిందో ఆమె ట్విట్టర్‌లో చెప్పుకొచ్చారు. "మావారు ఎమర్జెన్సీ విభాగంలో ఫిజిషియన్. కరోనా సోకిన వారికి చికిత్స అందిస్తున్నారు. దాంతో కష్టమైనప్పటికీ కుటుంబమంతా ఆయనకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాం. అందరం మా గ్యారేజీలోని అపార్ట్‌మెంట్‌కు మారాం. ఆయన మాత్రం కరోనా రోగులకు వైద్యం చేస్తూ అక్కడే ఉంటున్నారు" అని ఆవేదనతో తన ట్విట్టర్‌లో రాసుకొచ్చారు హెల్త్ సర్వీస్ రీసెర్చర్‌గా ఉన్న రేచల్.



**ఆవేదన, బాధ్యత కలగలసిన ట్వీట్...**

రేచల్ దంపతులకు ముగ్గురు పిల్లలు. వీరిలో మూడు వారాల వయసున్న బాబు ఉన్నాడు. తన పిల్లలకు కరోనా వైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు రేచల్. "మావారు మా చిన్న బాబును మురిపెంగా ఎత్తుకొని, పెద్ద పిల్లలతో సరదాగా ఆడుకునేందుకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో అని ఆలోచిస్తే బాధేస్తోంది. వైద్యరంగంలో ఉన్నవారు ప్రజల కోసం చేసే త్యాగానికి ఇదొక ఉదాహరణ. అందరూ కరోనా వైరస్‌ను సీరియస్‌గా తీసుకోవాలి. తమ కుటుంబానికి దూరంగా ఉంటూ రేయింబవళ్లు కరోనా రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు, నర్సుల త్యాగాన్ని గుర్తించండి. వారికి తప్పకుండా థ్యాంక్స్ చెప్పండి" అని ట్విట్టర్లో రేచల్ చేసిన పోస్ట్ ఎంతోమందిని కదిలించింది. ఆవేదన, సామాజిక బాధ్యతతో కూడిన ఆమె ట్వీట్‌ను 5 లక్షల మందికి పైగా లైక్ చేయడంతో ఒక్కసారిగా వైరల్ అయింది. వేలాది మంది ఆమె భర్తకు 'థ్యాంక్స్' చెబుతూ కామెంట్లు పెట్టారు.

ఆహారం - ఆరోగ్యం

# ఇమ్యూనిటీ సలాడ్

*ఇప్పుడున్న వైరస్ భయాల వల్ల రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) పెంచుకోవడం, శుభ్రత పాటించడం, పబ్లిగ్గా తిరగకుండా ఉండటం చేయమని మీడియాలో వస్తోంది. ఇమ్యూనిటీ అనేది చిన్నప్పటి నుంచి ఉంటుంది కదా! ఇప్పుడే వెంటనే ఇమ్యూనిటీ పెరగాలంటే ఎలా కుదురుతుంది. నిజంగా ఇమ్యూనిటీని పెంచుకోవచ్చా? అయితే ఎలా?*

**-వర్మ,** హైదరాబాద్

మనం పుట్టినప్పటి నుంచి, కొంత వయసు వచ్చేదాకా మన డిఫెన్స్ సిస్టమ్ అంటే ఇమ్యూనిటీ వృద్ధి అనేది జరుగుతుంది. ఇది వ్యక్తి ఆహారపు అలవాట్లు, ఇతర అలవాట్లు, శుభ్రత, ఉండే ప్రదేశం బట్టి ఉంటుంది. మనిషి చనిపోయేవరకు రోగనిరోధక శక్తి పోరాడుతూనే ఉంటుంది. ఇప్పుడు వైరస్ వచ్చింది. దానికి విరుగుడు ఇంకా లేదు కాబట్టి రోగనిరోధక శక్తి పెంచుకోవాలనుకుంటాం. ఎప్పుడైనా సరే రోగనిరోధక శక్తి పెంచుకోవచ్చు. దీనికి చేయాల్సిందల్లా...

- ప్రతిరోజూ సాఫీగా విరోచనం అయ్యేలా చూసుకోవాలి. దీని కోసం తగినన్ని నీళ్లు, తగినంత పీచుపదార్థం ఆహారం తీసుకోవాలి.



ఇలా చేయడం వల్ల పేగుల్లో మలినాలు తొలగి, విషపదార్థాలు లేకుండా ఉంటాయి. మనలో రోగనిరోధక శక్తి బలంగా ఉంటుంది. జీర్ణకోశం నుంచే రోగనిరోధక కణాలు పుడతాయి కాబట్టి జీర్ణకోశ ఆరోగ్యం అన్నిటికన్నా ముఖ్యం. జీర్ణకోశ ఆరోగ్యానికి ఈ సలాడ్ తీసుకోండి. ప్రతిరోజూ ఈ సలాడ్ తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

**కావాల్సినవి:** బొప్పాయి పండు ముక్కలు ఒక కప్పు, టొమాటో ముక్కలు ఒక కప్పు, సన్నగా తిరిగిన చిన్న పచ్చి మిరపకాయ ఒకటి, సన్నగా తరిగిన చిన్న అల్లం ముక్క, సన్నగా తరిగిన పసుపు ముక్క, సన్నగా తరిగిన ఒక వెల్లుల్లి, సైంధవ లవణం కొద్దిగా, నిమ్మరసం ఒక స్పూను, సన్నగా తరిగిన కొత్తిమీర, నువ్వుల నూనె ఒక చుక్క, పటిక బెల్లం లేదా పంచదార ఒక స్పూను.

**తయారీ:** వీటన్నింటిని ఒక బౌల్‌లో బాగా కలిపి ప్రతిరోజూ ఈవెనింగ్ స్నాక్‌లా తినాలి.

మధుమేహం, బీపీ ఉన్నవారు కూడా ఈ సలాడ్‌ను ఎలాంటి భయం లేకుండా తినొచ్చు.



● **డాక్టర్ బి.జానకి,** న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

టెక్ గురు



కరోనా వైరస్ కారణంగా యావత్ ప్రపంచం స్తంభించిపోయింది. నిన్నటిదాకా బిజీబిజీగా ఆఫీసులు, స్కూళ్లకు పరుగులు పెట్టిన వాళ్లు ఇప్పుడు ఇంటికే పరిమితమయ్యారు. సినిమాలు, పార్కులు, షాపింగు మాల్స్ చుట్టూ తిరిగిన వాళ్లు కదలకుండా ఇంటిపట్టునే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో టెక్నాలజీ సాయంతో 'కరోనా' స్వీయ నిర్బంధాన్ని భారంగా కాకుండా సంతోషంగా భావించడం ఎలా?



# స్వీయ నిర్బంధంలో సంతోషంగా...!

గత ఐదారు నెలలుగా పని ఒత్తిడి వల్ల చాలా సినిమాలు మిస్ చేసి ఉంటారు. ఇప్పుడు ఆ సినిమాలన్నీ చూడడానికి ఇది మంచి అవకాశం. ఆ సినిమాలు అమెజాన్ ప్రైమ్, జియో సినిమా, నెట్‌ఫ్లిక్స్, జీ5 వంటి వీడియో ఆన్ డిమాండ్ సర్వీసుల్లో వచ్చి ఉంటాయి. వాటిని ఒంటరిగా చూడడం కాకుండా స్మార్ట్‌టీవీలో కుటుంబం మొత్తం కలిసి ఒకచోట కూర్చొని నచ్చిన సినిమాలు స్ట్రీమ్ చేసుకుంటూ ఎంజాయ్ చేయండి. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నప్పుడు పెద్దగా తెలియదు గానీ, ఇలా కుటుంబం మొత్తం ఒకే చోట ఇంట్లో కూర్చోవాల్సి వచ్చినప్పుడు, ఎవరి లోకంలో వారు ఉంటే అది మరింత ఒంటరితనానికి గురిచేస్తుంది. కాబట్టి పాత రోజుల్ని, ఉమ్మడి కుటుంబాలను గుర్తు చేసుకుని హాయిగా కబుర్లు చెప్పుకుంటూ గడపడం, లేదా కలిసి సినిమాలు చూడడం మంచి అనుభూతిని కలిగిస్తుంది.

## ఆన్‌లైన్ కోర్సులు

ఇంతకు ముందు రోజు మొత్తం మీద కనీసం రెండు మూడు గంటలు బయట తిరగడానికే సరిపోయేది. ఇప్పుడు ఆ సమయం మొత్తం ఆదా అవుతోంది. ఈ నేపథ్యంలో అలా మిగిలిన సమయాన్ని ఏదైనా ఆసక్తికరమైన విషయాన్ని యుడెమీ, లింక్డిన్ లెర్నింగ్, యూట్యూబ్ వంటి వాటిలో నేర్చుకోవడానికి వెచ్చించండి. సంగీతం మొదలుకొని వాయిస్ మాడ్యులేషన్, బాడీ లాంగ్వేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఐ.టి. సబ్జెక్టులు వంటి అనేక రకాల కోర్సులు ఆన్‌లైన్‌లో లభిస్తుంటాయి. వీడియోలు చూస్తూ కేవలం పాసివ్‌గా నేర్చుకోవడం కాకుండా, ముఖ్యమైన విషయాలను అప్పటికప్పుడు నోట్‌బుక్‌లో నోట్ చేసుకుంటూ నిజంగా క్లాస్‌కి వెళ్లి నేర్చుకుంటున్నంత ప్రాక్టికల్‌గా అధ్యయనం చేయవచ్చు. కొత్త విషయాలు నేర్చుకునేటప్పుడు మెదడులో డోపమిన్ రసాయనం విడుదల కావటం వల్ల కొత్త ఉత్సాహం కూడా లభిస్తుంది. కరోనా కారణంగా ఇంట్లో బందీగా ఉన్నామనే భావనను కొత్త విషయాలు నేర్చుకునే వ్యాపకంలో పడి కొద్దిగంటల్లోనే మర్చిపోవచ్చు.

### ❖ డిజిటలైజ్ చేయండి

సహజంగా ఇంటి దగ్గర ఉంటే ఎక్కువ సమయం లభిస్తుంది. అది బోర్ కొట్టకుండా ఉండాలంటే ఉపయోగపడే పనులు చేయొచ్చు. మీ ఇంట్లో ఫ్రిజ్, వాషింగ్ మెషిన్, టీవీలాంటి అన్ని వస్తువులు కొనుగోలు చేసిన బిల్స్ ఉంటాయి కదా! మీ ఫోన్‌లో కామ్ స్కానర్ వంటి అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసి, ఆ బిల్స్, వాటితో పాటు వారెంటీ సమాచారాన్ని స్కాన్ చేసి జాగ్రత్తగా క్లౌడ్ స్టోరేజ్‌లో సేవ్ చేసుకోండి. అలాగే గూగుల్ క్యాలెండర్ ద్వారా వాటర్ ప్యూరిఫైయర్ క్లీనింగ్ వంటి ప్రతీ ఆరు నెలలు, సంవత్సరానికి ఒకసారి చేయాల్సిన పనులను ఈవెంట్ల రూపంలో విభజించుకోండి. ఒకవేళ మీరు మర్చిపోయినా కూడా, గూగుల్ క్యాలెండర్ వాటిని మీకు గుర్తు చేస్తుంది.

### ❖ అవసరం లేనివి తీసేయండి

ఎవరి స్మార్ట్‌ఫోన్‌లో చూసినా కూడా భారీ మొత్తంలో ఫోటోలు, వీడియోలు నిండిపోయి ఉంటాయి. ఇప్పుడు ఎలాగూ ఇంట్లోనే ఉంటున్నారు, ఖాళీ సమయం దొరికింది కాబట్టి మీ ఫోన్ స్టోరేజ్ మొత్తాన్ని పరిశీలించి ముఖ్యమైన ఫోటోలను గూగుల్ ఫొటోస్ వంటి క్లౌడ్ స్టోరేజీలోకి బ్యాకప్ తీసుకోండి. అనవసరమైన వాటిని తొలగించండి. సులభంగా ఫొటోలను గుర్తించే విధంగా ఫోల్డర్లుగా ఆర్గనైజ్ చేయండి. అలాగే మీ ఫోన్‌లో గత రెండు మూడు నెలలుగా ఉపయోగించని అప్లికేషన్లని గుర్తించి వాటిని తొలగించండి. ఇలా చేయడం వల్ల మీ ఫోన్ పని తీరు మునుపటి కన్నా మెరుగుపడుతుంది. అవసరమైతే ఫోన్ ఫ్యాక్టరీ రీసెట్ చేయడం ద్వారా మరింత ప్రయోజనం ఉంటుంది. అందుబాటులో ఉన్న సమయాన్ని ఇలా సద్వినియోగం చేసుకోండి.

### గేమ్స్ అదే పనిగా వద్దు..

చాలామంది ఇప్పటికే గంటల తరబడి వీడియో గేమ్స్‌లో నిమగ్నమవుతున్నారు. ఇంట్లో మీరు ఒక్కరే ఉంటే ఇబ్బంది లేదు గానీ, ఇంట్లో అందరు ఉన్నా ఎవరి ఫోన్‌లో వారు గేమ్స్ ఆడుకుంటూ ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా గడపడం వల్ల మానసిక ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఎవరికి వారు ముభావంగ ఉంటూ, ఇంట్లో వాళ్ళతో మాట్లాడకపోతే దాని ప్రభావం ప్రతీ కుటుంబ సభ్యుడి మీద పడుతుంది. కాబట్టి ఇంటిల్లిపాది కబుర్లు చెప్పుకుంటూ గడపండి.



### విదేశాల్లో ఉంటే..

పిల్లలు చదువు నిమిత్తం విదేశాల్లో ఉండి ఉంటారు. కొందరు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తుండి ఉంటారు. వాళ్లను తలచుకుని బాధపడడం కన్నా వాట్సప్, స్కైపీ వంటి వీడియో కాలింగ్ సదుపాయాలను ఉపయోగించి కుటుంబం మొత్తం ఒక గ్రూప్‌గా ఏర్పడి వారితో కొంత సమయం గడపడం ద్వారా చాలావరకు ఒత్తిడి తగ్గించుకోవచ్చు. అలాగే వారి క్షేమసమాచారాలు ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకోవచ్చు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో కుటుంబం నుంచి లభించే మాటలు వారికి ఎంతో ఊరటనిస్తాయి.

### ❖ ఫేక్ న్యూస్‌కి దూరంగా...

కరోనా వైరస్ గురించి చాలాచోట్ల ఎక్కువ ఆందోళనకు గురవుతున్నారు. కరోనా వైరస్ చాలా ప్రమాదకరమైనదే. అయితే ఒక స్థాయికి మించి ఆందోళన చెందటం వల్ల మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. అది దీర్ఘకాలంలో మానసిక ఒత్తిడి, కుంగుబాటు వంటి ఇతర సమస్యలకు కారణమవుతుంది. అదే పనిగా ఫేస్‌బుక్ న్యూస్ ఫీడ్ స్క్రోల్ చెయ్యడం, వివిధ సైట్ల నుంచి కరోనా వైరస్ గురించి క్షణానికోసారి వచ్చే లింకులను క్లిక్ చేసి.. కరోనా వైరస్ 'మన దాకా వచ్చింది' అన్న భయాలు పెట్టుకోవడం మానేయాలి. ఫోన్‌లో చీటికి మాటికి నోటిఫికేషన్స్ పంపించే అప్లికేషన్లు ఉంటే వాటి నోటిఫికేషన్లని డిజేబుల్ చేయండి. అలాగే అనవసరమైన వాట్సాప్ గ్రూప్‌ల నుంచి బయటకు రండి. కరోనా వైరస్ గురించి యూట్యూబ్‌లో, వాట్సప్‌లో అదే పనిగా వీడియోలు చూడడం, దాని గురించి చర్చించుకోవడం పరోక్షంగా దాని పట్ల మరింత ఆందోళన పెరగడానికి కారణమవుతుంది. మీ మొబైల్ ఫోన్, కంప్యూటర్‌లో నవ్వు తెప్పించే వీడియోలు, ఆహ్లాదాన్ని ఇచ్చే సన్నివేశాలు చూస్తూ ఎంజాయ్ చేయాలి. అంతే తప్పించి ఆందోళన పెంచే వీడియోలు చూడవద్దు. చాలామంది 'ఇలాంటివి తెలుసుకోవడం ద్వారా మరింత జాగ్రత్తగా ఉంటాం' అనే అపోహలో ఉంటారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఎవరికి వాళ్లం కొన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవి సరిపోతాయి. అంతే తప్పించి అతిగా భయపడటం వల్ల మీకూ, మీ కుటుంబానికి ప్రశాంతత కరువవుతుంది.

### ❖ ఆరోగ్యం కాపాడుకోండి...

రాత్రి పడుకోబోయే ముందు స్పాటిఫై, యూట్యూబ్ వంటి వాటిలో ఆహ్లాదకరమైన సంగీతం, మానసిక ఒత్తిడి తగ్గించే వైట్ నాయిస్ లాంటివి వినండి. ఇవి అద్భుతమైన ఫలితాలను అందిస్తాయి. అయితే కొంతమంది రాత్రిపూట అదేపనిగా మొబైల్, కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ స్క్రీన్ వంక చూస్తూ గడుపుతూ ఉంటారు. దీంతో వాటి నుంచి వచ్చే నీలికాంతి ప్రభావం వల్ల త్వరగా నిద్ర పట్టదు. రోగనిరోధక శక్తి తగ్గే అవకాశం లేకపోలేదు. అందుకే ఈ సమయంలో సరైన ఆహారం తీసుకోండి. ఫోన్ పక్కన పడేసి కంటినిండా నిద్ర పోండి. ఒకవేళ రోగనిరోధక శక్తి తగ్గి చిన్న జలుబు లాంటివి వచ్చినా, ప్రస్తుతం కరోనా ఉన్న తరుణంలో అది మీతోపాటు మిగిలిన వాళ్లలో భయాన్ని సృష్టిస్తుంది. కాబట్టి చేజేతులా ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండండి. అప్పుడే కరోనా లాంటి మహమ్మారిని ధైర్యంగా ఎదుర్కొనగలుగుతాం.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

టెక్ సందేహాలు

## ఆటోమేటిక్‌గా ఓపెన్ అవుతున్నాయి.. ఎందుకని?

**నేను ల్యాప్‌టాప్ ఆన్ చేసిన వెంటనే టొరెంట్ ఐఎంఒ అప్లికేషన్లు ఆటోమేటిక్‌గా ఓపెన్ అవుతున్నాయి. అలా కాకూడదంటే ఏం చేయాలి?**

**- సాయికృష్ణ సిహెచ్**



కొన్ని అప్లికేషన్లు మన కంప్యూటర్లో ఇన్‌స్టాల్ చేసుకున్న వెంటనే కంప్యూటర్ ఆన్ చేసిన ప్రతీసారీ వాటంతట అవే ప్రారంభించబడే విధంగా విండోస్ స్టార్టప్‌లో ఎంట్రీలను సృష్టించుకుంటాయి. మన ఇష్టంతో ప్రమేయం లేకుండా, అవి తమకు తాము అతి ముఖ్యమైనవి అని భావించడం వల్ల ఏర్పడే ఇబ్బంది ఇది. వీటిని డిజేబుల్ చేసుకోవడానికి రెండు మార్గాలున్నాయి. మీరు చెప్పిన రెండు యాప్స్‌లో సెట్టింగ్స్‌లోకి వెళితే ఆటోమేటిక్‌గా స్టార్ట్ అవడాన్ని డిజేబుల్ చేసే ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంపిక చేసుకోండి. కొన్ని ఇతర అప్లికేషన్ల విషయంలో ఇలాంటి సెట్టింగ్ ఏదీ లేనట్లయితే, మీ కంప్యూటర్లో టాస్క్ మేనేజర్ ఓపెన్ చేసి, అందులో స్టార్టప్ అనే విభాగంలోకి వెళ్లి ఆటోమేటిక్‌గా ఓపెన్ అవుతున్న ప్రోగ్రామ్‌ని గుర్తించి దాన్ని డిజేబుల్ చేసుకుంటే సరిపోతుంది.

## స్టోరేజ్ పెరగాలంటే ఎలా?

**నేను సామ్‌సంగ్ ఆన్ 7 ప్రో ఫోన్ వాడుతున్నాను. వాట్సప్‌లో అన్నీ డిలీట్ చేసినా స్టోరేజ్ స్పేస్ ముందు ఉన్నంతే ఉంటోంది. స్టోరేజ్ పెరగాలంటే ఏం చేయాలి?**

**- శ్రీనివాసరావు, అవనిగడ్డ**



పెద్ద పరిమాణంలో ఉన్న వీడియోలు తప్పించి సహజంగా వాట్సప్ ఫొటోలు, టెక్ట్స్, వాయిస్ క్లిప్‌లు పెద్దగా స్టోరేజ్ ఆక్రమించవు. మీ ఫోన్‌లో స్టోరేజ్ స్పేస్ నిండిపోవటానికి ఇతర అప్లికేషన్లు గానీ, వాటి ద్వారా క్రియేట్ అయ్యే కంటెంట్ గానీ కారణం కావచ్చు. అసలు మీ ఫోన్‌లో ఏ ఫైళ్లు, ఫోల్డర్లు ఎక్కువ స్థలం ఆక్రమిస్తున్నాయో విశ్లేషించడం ద్వారా.. అనవసరమైన వాటిని గుర్తించి తొలగించడం ద్వారా స్పేస్ లభిస్తుంది. దీనికోసం దాదాపు అన్ని ఫోన్లలో ఫైల్ మేనేజర్ యాప్స్‌లో స్టోరేజ్ స్పేస్‌ని విశ్లేషించే సదుపాయం ఉంటుంది. అది ప్రయత్నించండి. ఒకవేళ మీ ఫోన్‌లో అలాంటి సదుపాయం లేకపోతే గూగుల్ ప్లే స్టోర్ నుంచి స్టోరేజ్ అనలైజర్ అండ్ డిస్క్ యూసేజ్ అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రయత్నించండి.

## మెయిల్ ఐడీ తెలుసుకోవచ్చా?

**మనం యూట్యూబ్‌లో ఒక ఛానెల్‌ను సబ్‌స్క్రయిబ్ చేస్తూ ఉంటాం కదా! దానికి సంబంధించిన ఈ - మెయిల్ అడ్రస్ తెలుసుకునే అవకాశం ఉంటుందా?**

**- భరత్ బత్తుల, నిజామాబాద్**



యూట్యూబ్‌లో ఉన్న ప్రతీ ఛానెల్ ఒక నిర్దిష్టమైన ఈ-మెయిల్ అడ్రస్‌తో లింక్ చేయబడి ఉంటుంది. అయితే ఆ ఈ- మెయిల్ అడ్రస్ వివరాలు ప్రత్యక్షంగా తెలుసుకోవటానికి యూట్యూబ్ అవకాశం కల్పించదు. ఏదైనా పోలీస్ కేస్ అయినప్పుడు మాత్రమే, నేర పరిశోధనా సంస్థలకు గూగుల్ సంస్థ ఆ యూట్యూబ్ అకౌంట్ లింక్ అయి ఉన్న మెయిల్ ఐడీ, దాన్ని ఆపరేట్ చేస్తున్న వ్యక్తి తాజా ఐపీ అడ్రస్ వంటి వివరాలు తెలియజేస్తుంది. అంతేతప్ప సాధారణ యూజర్లు చేయగలిగిందేమీ లేదు.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం: navya@andhrajyothy.com

టెక్ గైడ్

## ఆన్‌లైన్‌లో తెలియకుండా..!

స్నేహితులతో, సహోద్యోగులతో వాట్సప్‌లో ఛాటింగ్ అందరూ చేస్తుంటారు. అయితే ఆన్‌లైన్‌లో ఉన్నట్టు తెలియకుండా స్నేహితుల ఛాట్‌కు సమాధానం ఎలా ఇవ్వాలో తెలుసా? ఇదిగో ఇలా...

- ముందుగా మీ ఫోన్‌లో ఇంటర్నెట్ కనెక్షన్ ఆఫ్ చేయండి. వైఫ్ నెట్‌వర్క్, మొబైల్ డేటా రెండూ ఆఫ్‌లైన్‌లో ఉండాలి.
- ఇప్పుడు వాట్సప్ ఓపెన్ చేసి ఎవరి ఛాట్‌కు రిప్లై ఇవ్వాలనుకుంటారో ఎంచుకోండి.
- మీ ఛాట్‌ను టైప్ చేసి సెండ్ చేయండి.
- వాట్సప్ క్లోజ్ చేయండి.
- ఇప్పుడు ఇంటర్నెట్ రీ కనెక్ట్ చేయండి.
- ఇలా చేయడం వల్ల మీరు ఆన్‌లైన్‌లో ఉన్నట్టు తెలియకుండానే మెసేజ్ వెళ్లిపోతుంది.



ప్రతిభ

## దూసుకెళ్లడంలో దిట్ట!



పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా సరే విజేతలుగా నిలుస్తారు. ఇందుకు మంచి ఉదాహరణ పుణేకు చెందిన పదకొండేళ్ల **శ్రియా లోహియా**. గత ఏడాది 'జేకే టైర్ నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్'లో విజేతగా నిలిచి అందరి మన్ననలు అందుకుంది. కేవలం 11 నిమిషాల 13.233 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసింది. గో కార్టింగ్ రేస్‌లో రికార్డులు సృష్టిస్తున్న శ్రియ ప్రస్తుతం బెంగళూరులో 'మెకో మోటార్‌స్పోర్ట్స్'లో శిక్షణ తీసుకుంటోంది. నాలుగేళ్ల వయసులో బొమ్మ కార్లతో ఆడుకున్న ఆమె ఇప్పుడు ట్రాక్‌పై దూసుకెళుతోంది. ఫార్ములా వన్ డ్రైవర్ కావాలన్నది తన లక్ష్యం. అందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళితో ముందుకెళుతోంది. "నా కుటుంబమే నా బలం. ఎప్పుడూ నా వెంట మా డాడీ ఉంటాడు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రోత్సహిస్తుంటాడు. ఇంకా ఎలా మెరుగైన ప్రదర్శన చేయాలో సలహాలు ఇస్తుంటాడు" అంటుంది శ్రియ. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం.

లిటిల్స్

దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?





5 తేడాలు గుర్తించండి

## డైలీ సుడోకు -314

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | | 5 | | 6 | | | | 3 |
| | 1 | | | 7 | | | 9 | 2 |
| | | | 1 | | 8 | | | 4 |
| 7 | | | | | 3 | | | |
| 3 | | 8 | | | | 4 | | 7 |
| | | | 7 | | | | | 8 |
| 5 | | | 8 | | 1 | | | |
| 4 | 6 | | | 5 | | | 8 | |
| 1 | | | | 4 | | 7 | | 9 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 313 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 2 | 4 | 7 | 8 | 3 | 1 | 6 | 9 |
| 3 | 1 | 8 | 5 | 9 | 6 | 4 | 2 | 7 |
| 6 | 7 | 9 | 4 | 2 | 1 | 8 | 5 | 3 |
| 1 | 3 | 6 | 8 | 7 | 4 | 2 | 9 | 5 |
| 2 | 4 | 5 | 6 | 3 | 9 | 7 | 1 | 8 |
| 8 | 9 | 7 | 2 | 1 | 5 | 3 | 4 | 6 |
| 4 | 5 | 2 | 3 | 6 | 7 | 9 | 8 | 1 |
| 9 | 8 | 3 | 1 | 5 | 2 | 6 | 7 | 4 |
| 7 | 6 | 1 | 9 | 4 | 8 | 5 | 3 | 2 |

# కరోనా పోవాలి.. అమరావతి కావాలి!

- రాజధాని రైతుల నినాదాలు.. 94వ రోజు కొనసాగిన ఆందోళనలు
- శిబిరాలు తీసేయాలని పోలీసుల నోటీసులు
- కరోనా కారణంగా పోరు రూపు మార్చనున్న రైతులు?

గుంటూరు, తుళ్లూరు, తాడికొండ, మంగళగిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): "కరోనా పోవాలి.. అమరావతి కావాలి!" అంటూ రాజధాని రైతులు నినదించారు. రాజధాని కోసం జరుగుతున్న ఆందోళనలు 94వ రోజు శుక్రవారం కొనసాగాయి. తుళ్లూరు, మందడంలో మహాధర్నా నిర్వహించాగా, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి, తాడేపల్లి, నీరుకొండ తదితర ప్రాంతాల్లో రిలే దీక్షలు, ఆందోళనలు కొనసాగించారు. కాగా, కరోనా నేపథ్యంలో కొంతకాలం పాటు దీక్షలు, ధర్నాలు విరమించుకోవాలని తుళ్లూరు మహాధర్నా శిబిరం సహా అన్ని శిబిరాలకు పోలీసుల నోటీసులు ఇచ్చారు. అయితే, తొలినుంచీ కరోనాపై రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గంట గంటకు శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలు లెక్క చేయాల్సిన పనిలేదు కానీ, వైరస్ నియంత్రణలో సహకరించలేదన్న అపవాదు వద్దు మనకు వద్దని టీడీపీ నేతలు ప్రత్తిపాటి పుల్లారావు, అశోక్‌బాబు, శ్రావణ్‌కుమార్ వారికి సూచించారు. ఈ నేపథ్యంలో పోరాటం రూపం మారుద్దామని పిలుపునిచ్చారు. వంతులువారీగా శిబిరాల్లో కూర్చొందామని 60 ఏళ్లు పైబడినవారు, పిల్లలను ఉద్యమానికి దూరంగా ఉంచుదామన్నారు. వెలగపూడి శిబిరంలో భేటీ అయిన జేఏసీ నేతలూ ఇదే అభిప్రాయం వ్యక్తం చేయడంతో తమ ఉద్యమతీరును మార్చాలని రైతులు నిర్ణయించారు. అందులోభాగంగా దీక్షా శిబిరాల్లో అందరూ కాకుండా వంతులవారీగా గంటకు 20 మంది చొప్పున కూర్చోవాలని నిర్ణయించారు.

- 29 గ్రామాల్లో రోజూ రాత్రి 7.30కు 5 నిమిషాలపాటు 'అమరావతి వెలుగు' పేరిట విద్యుత్‌ను ఆపేసి కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపాలన్నారు. అలానే ప్రతి ఇంటిపైనా నల్ల జెండా, జేఏసీ జెండా ఎగరవేయనున్నారు.
- పార్లమెంట్ ఉభయ సభల ఎంపీలకు ఇక్కడ జరుగుతున్న అన్యాయాలపై మెయిల్స్ పంపించాలని నిశ్చయించారు.
- పోలీసు, వైద్య అధికారులు శిబిరాల వద్దకు వచ్చి నోటీసులు ఇవ్వగా, కరోనా వైరస్‌కి బ్లీచింగ్ పౌడరు, పారాసిట్మాల్ సరిపోతాయని సీఎం స్వయంగా చెప్పినప్పుడు మాకు బెంగ లేదని మహిళలు వ్యంగ్యంగా వారితో అన్నారు.


మందడంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో అమరావతి నినాదాలు

### వేడుకలో 'జై అమరావతి'

మందడంలో జరిగిన నూతన వస్త్ర బహూకరణ వేడుకలో 'జై అమరావతి', 'సేవ్ అమరావతి' ప్లకార్డులు పట్టుకొని రాజధాని రైతులు, మహిళలు నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకురాలు గద్దె అనురాధ, కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీలు రైతులు, మహిళలకు సంఘీభావం తెలిపారు.

## ఉద్యోగులకు ఉగాది కానుకగా డీఏ!

- సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి వెల్లడి

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఉగాది కానుకగా ఒక డీఏ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశామని, దీనికి సీఎం జగన్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త డీఏ అమలులోకి రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులకు నాలుగు డీఏలు బకాయి ఉన్నాయి. 2018 జూలై నాటి డీఏను ఉగాది కానుకగా ఉద్యోగులకు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని వెంకట్రామిరెడ్డి తెలిపారు.

## కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలి

- మాజీ మంత్రి మాణిక్యాలరావు డిమాండ్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 20: "రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను రద్దు చేయాలి. ప్రభుత్వాన్ని షుప్తచేతనావస్థలో ఉంచాలి. కేంద్ర అధికారులు, బలగాలతో హైకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో కొత్త నోటిఫికేషన్ ద్వారా అన్ని స్థానాల్లో ఎన్నికలు నిర్వహించాలి" అని బీజేపీ నేత, మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు తాడేపల్లిగూడెంలో శుక్రవారం డిమాండ్ చేశారు. కరోనా ప్రభావంతో ఎన్నికల ప్రక్రియను ఆరు వారాలు వేసిన ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌కు చంపుతానంటూ బెదిరింపు ఫోన్స్ రావడం వెనుక ప్రభుత్వ అరాచకపాలన కనిపిస్తోందన్నారు.

## ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

- లోక్‌సభలో మార్గాని భరత్

న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పదవిని అవమానపరుస్తూ రమేశ్‌కుమార్ ప్రతిపక్షాలతో గొంతుకలుపుతున్నారు. ఆయన రాజీనామా చేయాలి" అని వైసీపీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడారు.

## ఆంధ్రాబ్యాంకు పేరు మార్చొద్దు: బాలశౌరి

న్యూఢిల్లీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి) ఎంతో ఘన చరిత్ర గల ఆంధ్రాబ్యాంకును యూబీఐ, కార్పొరేషన్ బ్యాంకుల్లో విలీనం చేయడం కన్నా, ఆంధ్రా బ్యాంకులోనే ఆ బ్యాంకులను విలీనం చేయాలని, దాని కేంద్ర కార్యాలయాన్ని విజయవాడలో నెలకొల్పాలని మచిలీపట్నం ఎంపీ వి.బాలశౌరి కేంద్రాన్ని కోరారు. శుక్రవారం లోక్‌సభలో దీనిని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

## నేడు, 28న హైకోర్టుకు సెలవు

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా శనివారంతో పాటు ఈ నెల 28వ తేదీన హైకోర్టుకు సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ప్రకటన విడుదల చేశారు.

## 8 వరకు బార్ కౌన్సిల్ కార్యాలయం మూసివేత

- బార్ అసోసియేషన్ల ఎన్నికలు వాయిదా

కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా ఏప్రిల్ 8వ తేదీ వరకూ ఏపీ బార్ కౌన్సిల్ కార్యాలయం మూసివేయనున్నట్లు బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీకి ముందుగా రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లకు జరగాల్సిన ఎన్నికలను ఏప్రిల్ 9కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. తదుపరి ప్రకటనవరకూ ఎన్‌రోల్‌మెంట్ దరఖాస్తుల్ని కూడా తీసుకోబోమని స్పష్టం చేశారు.

## కొత్త జడ్జిలతో పోస్కో కేసుల పరిష్కారం

రాష్ట్రంలో కొత్తగా నియమించిన ప్రత్యేక కోర్టు జడ్జిలతో పోస్కో యాక్టు కేసుల పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ప్రకాశం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లో జిల్లా జడ్జి స్థాయి కలిగిన ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసింది.

## రేషన్ పంపిణీ సమయం పెంచండి: కేంద్రం

కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో రేషన్ షాపుల్లో రద్దీని నియంత్రించేందుకు పంపిణీ సమయాన్ని పెంచాలని కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ రాష్ట్రాలకు సూచించింది. ఈ మేరకు కొన్ని సూచనలు పంపింది.

## వైఎస్సార్ పురస్కారాల ప్రదానం వాయిదా

కరోనా వైరస్ బెడద కారణంగా ఉగాది నాటి వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలను వాయిదా వేసినట్లు ప్రభుత్వం తెలిపింది. వైఎస్సార్ జయంతి రోజైన జూలై 8న ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది.

## టిడ్కో కొత్త షేర్‌హోల్డర్లకు షేర్ల కేటాయింపు

ఏపీ టిడ్కోలోని కొత్త షేర్ హోల్డర్లకు షేర్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బదిలీలు, ఇతర కారణాల దృష్ట్యా గతంలో ఉన్న షేర్ హోల్డర్లలోని కొందరి స్థానంలో కొత్తవారిని ప్రభుత్వం నామినేట్ చేసింది.

# 'తిరుగులేని' తిప్పలు

అధికార పక్షానికి వరుస దెబ్బలు.. అనేక నిర్ణయాలకు కోర్టుల్లో బ్రేకులు.. కీలక బిల్లులకు మండలి తిరస్కారం

- 'స్థానికం' వాయిదాతో దెబ్బతిన్న అహం
- సుప్రీంను ఆశ్రయించినా లభించని ఫలితం
- కేంద్రానికి ఎస్ఈసీ లేఖ మరో సంచలనం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

శాసనసభ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన వైసీపీలో ఇటీవల వరుసగా ఎదురవుతున్న పరిణామాలు అంతర్గతంగా ఆందోళనకు దారి తీస్తున్నాయి. పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ నిర్ణయాలను, సంక్షేమ పథకాల కోసం నిధులు వెచ్చించిన తీరును ప్రత్యర్థి పార్టీలూ విమర్శించేందుకు పాఠశాలల్లో తెలుగు మాధ్యమం ఎత్తివేసి పూర్తిగా ఇంగ్లీష్ మీడియం మాత్రమే ప్రవేశపెట్టడం, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ల ఏర్పాటు, సీఆర్‌డీఏ రద్దు, మూడు రాజధానుల బిల్లులకు శాసన మండలిలో తిరస్కారం ఎదురైంది. దీంతో ఆగ్రహించిన సీఎం... మండలినే రద్దు చేస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కానీ, కేంద్రంలో కదలిక కనిపించడంలేదు. ఈలోపు 'కరోనా' ఉత్పాతం వచ్చి పడింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో శాసన మండలి రద్దు అంశం చర్చకు వచ్చే అవకాశమే కనిపించడంలేదు.

### వరుస దెబ్బలు...

సాహసించలేకపోయాయి. కానీ కొద్దికాలంలోనే పరిస్థితుల్లో మార్పు వచ్చింది. రివర్స్ టెండర్లు, పునఃసమీక్షలు ఇలా పేరు ఏదైనప్పటికీ... అసలు లక్ష్యం మాత్రం తెలుగుదేశమేనని, 'కక్ష సాధింపు' చుట్టూ పాలన సాగుతోందనే విమర్శలు వెల్లువెత్తాయి. అదే సమయంలో దూకుడుగా తీసుకున్న వివాదాస్పద నిర్ణయాల వేగానికి... కోర్టుల్లో బ్రేకులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో... సీఎంపై విమర్శల జడి పెరిగింది. సోషల్ మీడియాలో ఇదివరకెన్నడూ లేనంతగా జగన్‌పై 'ట్రోలింగ్' జరుగుతుండటాన్ని రాజకీయ విశ్లేషకులు ప్రత్యేకంగా గుర్తు చేస్తున్నారు.

### 'స్థానికం' పెద్ద దెబ్బ...

స్థానిక ఎన్నికల్లో 90 శాతం సొంతం చేసుకోవాలని ముఖ్యమంత్రి విధించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు... వైసీపీ యంత్రాంగం దూకుడుగా వ్యవహరించింది. దౌర్జన్యాలు, బలవంతపు ఉపసంహరణలు, ఏకగ్రీవాలపై ఆరోపణల సంగతి పక్కనపెడితే.. కరోనా విజృంభణ నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం హఠాత్తుగా ప్రకటించింది. దీనిపై జగన్ తీవ్రంగా స్పందించారు. ఆగమేఘాల మీద మీడియా సమావేశం పెట్టి ఎస్ఈసీ రమేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన సామాజిక వర్గాన్నీ ప్రస్తావించారు. అదే సమయంలో... కరోనాను తేలిగ్గా తీసుకుంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో అభాసుపాలయ్యాయి. సీఎం బాటలోనే స్పీకర్, అనేకమంది మంత్రులు, వైసీపీ నేతలు ఎస్ఈసీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలపై ప్రజల్లోనూ తీవ్ర చర్చ జరిగింది. తటస్థులు, వైసీపీ అంటే కాస్త అభిమానం ఉన్న వారు కూడా 'ఇంత దారుణంగా మాట్లాడుతున్నారేంటి' అని విస్తుపోయారు. ఎన్నికల వాయిదాను సుప్రీంకోర్టు సమర్థించడం ప్రభుత్వానికి మరో ఎదురు దెబ్బ! ఆ వెంటనే ఇక్కడి పరిస్థితులను, 'స్థానిక' దౌర్జన్యాలను, తనపై శ్రుతిమించి చేసిన దూషణలను పూసగుచ్చినట్లు వివరిస్తూ కేంద్ర హోంశాఖకు ఎస్ఈసీ రాసిన లేఖ సంచలనం సృష్టించింది. తన భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలన్న ఆయన వినతిపై కేంద్రం అప్పటికప్పుడు స్పందించింది. ఎస్ఈసీ రాసిన ఈ లేఖను తొలుత ఆకాశరామన్న ఉత్తరమని వైసీపీ నేతలు అన్నారు. తర్వాత లేఖ ఎలా బయటికి వచ్చిందో ఆరా తీయాలంటూ డీజీపీకి లేఖ రాశారు. "పరిపాలనలో కొన్ని లోటుపాట్లు, ఆటుపోట్లు సహజం. కొన్నిటిని సామరస్యంగా, మరికొన్నిటిని చాతుర్యంతో పరిష్కరించుకోవాలి. అలాకాకుండా... నాకు తిరుగులేదు, నేను చెప్పిందే జరగాలనే మొండి వైఖరితో కొత్త సమస్యలు ఎదురవుతాయి" అని ఒక రాజకీయ విశ్లేషకుడు అభిప్రాయపడ్డారు.



# సర్కారు దురుద్దేశం!

(మొదటి పేజీ తరువాయి)

ఎంక్వయిరీస్ కార్యాలయాలకు తాత్కాలిక సచివాలయంలో తగినంత స్థలం లేదన్న వంకతో వీటిని రాజధానికి 350 కిలోమీటర్ల అవతల ఉన్న కర్నూలుకు తరలించడం ఏమాత్రం సహేతుకం కాదు" అని చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జీవో నంబరు 13ను సవాల్ చేస్తూ 'రాజధాని రైతు పరిరక్షణ సమితి' కార్యదర్శి డి.రామారావు, కొండెపాటి గిరిధర్, 'అమరావతి పరిరక్షణ సమితి' కార్యదర్శి జి.తిరుపతిరావు, మండవ రమేశ్ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. వారి అనుబంధ పిటిషన్లపై విచారణ జరిపిన త్రిసభ్య ధర్మాసనం ఇరువైపుల వాదనలు విన్న అనంతరం గత నెల 18వ తేదీన తీర్పు రిజర్వు చేసింది. ఆ తీర్పును శుక్రవారం వెల్లడించింది.

### మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధం...

సీఆర్‌డీఏ చట్టంలోని మాస్టర్ ప్లాన్‌లో పలు జోన్లు ఉన్నాయని... ఆ చట్టంలోని సెక్షన్ 39 కింద ఉన్న జోన్ పరిధిలోకి ప్రభుత్వ ఆఫీసులు వస్తాయని ధర్మాసనం గుర్తుచేసింది. "విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ కార్యాలయాలూ ఈ జోన్ పరిధిలోకే వస్తాయి. సీఆర్‌డీఏ చట్టాన్ని ఉపసంహరిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులో మాస్టర్ ప్లాన్ అమలు ఉంది. దానికి విరుద్ధంగా కార్యాలయాలను తరలించరాదు. అలా తరలించడం సెక్షన్ 39కు విరుద్ధం. అందువల్ల, కార్యాలయాల తరలింపుపై అధికార యంత్రాంగం తీసుకున్న నిర్ణయం చట్ట విరుద్ధమవుతుంది" అని తేల్చిచెప్పింది. ఇలాంటి నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

### స్థలం లేదన్నది ఓ వంక మాత్రమే..

శాసన మండలిలో వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ ఉపసంహరణ బిల్లులు ఆమోదం పొందకపోవడంతో, ప్రభుత్వం ఈ రెండు కార్యాలయాల తరలింపునకు స్థలాభావాన్ని సాకుగా చూపిందని ధర్మాసనం తెలిపింది. తాత్కాలిక సచివాలయం ఉన్న వెలగపూడికి 50 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలో ప్రత్యామ్నాయాన్ని కూడా అన్వేషించలేదని ఆక్షేపించింది. "ఈ రెండు కార్యాలయాలకు తగిన స్థలం చూడాలని ప్రభుత్వం కర్నూలు జిల్లా కలెక్టర్‌కు ఎటువంటి లేఖ రాయలేదు. అయినప్పటికీ కర్నూలు కలెక్టర్ ఫలానా భవనాలు విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ కార్యాలయాలకు అనువుగా ఉన్నాయంటూ ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. కలెక్టర్ తనంతట తానుగా ఈ లేఖ రాశారా? ఎవరి జోక్యంతోనైనా రాశారా? అన్న విషయంపై స్పష్టత లేదు. నోట్ షీట్ ప్రకారం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే కార్యాలయాల తరలింపు జీవో జారీ అయిందన్న విషయం స్పష్టమవుతోంది" అని ధర్మాసనం తెలిపింది. మండలి ఆమోదం పొందలేకపోయిన వికేంద్రీకరణ బిల్లులోని సెక్షన్ 8 ప్రకారం సదరు కార్యాలయాలను తరలించాలన్న ప్రభుత్వ ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. "సచివాలయంలో ఈ కార్యాలయాలకు తగిన స్థలం లేకపోతే.. విజయవాడ, గుంటూరు, ఏలూరుల్లో 50 నుంచి 100 కి.మీ. పరిధిలో కార్యాలయాలను ఏర్పాటు చేయవచ్చు. ఆ పని చేయకుండా, ఎవ్వరూ అడగకుండానే కర్నూలులో ఈ రెండు కార్యాలయాలకు తగిన స్థలం ఉందన్న కలెక్టర్ లేఖ ఆధారంగా ప్రభుత్వం ఈ జీవో జారీ చేసింది" అని ధర్మాసనం పేర్కొంది.

### న్యాయ సమీక్ష చేయవచ్చు...

"కార్యాలయాల తరలింపుపై ప్రభుత్వ నిర్ణయం సదుద్దేశంతో తీసుకున్నది కానేకాదు. ఇందుకు తగిన ప్రాథమిక ఆధారాలు కూడా ఉన్నాయి. కార్యాలయాల తరలింపు విషయంలో ప్రభుత్వానికి ఉన్న అధికారాల గురించి అడ్వకేట్ జనరల్ ప్రస్తావించిన తీర్పులు రెండూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైనవి కావు. ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ ఉండాలన్న నిర్ణయం ప్రభుత్వ పరిధిలోనిదే. కానీ ఈ నిర్ణయం వెనుక దురుద్దేశాలు ఉన్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చు" అని కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో చెప్పిందని, అయితే అదే సుప్రీంకోర్టు ప్రభుత్వ నిర్ణయాలు నిబంధనలకు అనుగుణంగా, సహేతుకంగా లేనప్పుడు న్యాయసమీక్ష చేయవచ్చని చెప్పిందని గుర్తు చేసింది. వెలగపూడిలో ఉన్న కార్యాలయాలను 350 కిలోమీటర్ల అవతల ఉన్న కర్నూలుకు తరలించడం వల్ల విచారణ ఎదుర్కొనే ఉద్యోగులు, సాక్షులుగా వున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపింది. అంతేగాక ఖర్చు, పనిదినాలు కూడా వృథా అవుతాయని పేర్కొంది. తరలింపు జీవో జారీ చేసే ముందు ప్రభుత్వం ఈ ప్రతికూల ప్రభావాల గురించి ఏమాత్రం ఆలోచన చేయలేదంది. రాష్ట్ర యంత్రాంగం మొత్తం ప్రస్తుతం వెలగపూడి, దాని చుట్టుపక్కలే పని చేస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. "కేవలం విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ కార్యాలయాలను మాత్రమే కర్నూలుకు తరలించడం వల్ల విజిలెన్స్ వ్యవహారాలను సమర్థంగా పర్యవేక్షించడం విజిలెన్స్ కమిషన్‌కు కష్టతరమవుతుంది. కమిషన్ ఏర్పాటు ఉద్దేశమే నెరవేరకుండా పోతుంది. ప్రతీ శాఖకు చెందిన చీఫ్ విజిలెన్స్ అధికారులు చీఫ్ విజిలెన్స్ కమిషనర్‌కు నివేదిక సమర్పించాలన్నా, నేరుగా కలవాలన్నా 350 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఇందుకు రెండు పని దినాలు పోతాయి. ప్రజల ఇబ్బందుల గురించి ప్రభుత్వం పట్టించుకోనట్లు కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించింది.

## హామీ ఇస్తే సరిపోదు!

- మెమో దాఖలు నాటికి సిట్ సీఎం నియంత్రణలోనే!
- ఒక్కరినీ అరెస్టు చేయలేదన్నది కఠోర సత్యం
- వివేకా హత్య కేసులో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐకి ఇస్తూ తీర్పు వెలువరించిన సందర్భంగా హైకోర్టు కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. మృతుడు వివేకానందరెడ్డి ముఖ్యమంత్రికి బాబాయి అని, ఈ హత్య కేసులో నేరగాళ్లను పట్టుకుని సాధ్యమైనంత త్వరగా శిక్ష పడేలా చూడాల్సిన నైతిక బాధ్యత సీఎంపై ఉందని పేర్కొంది. హత్య జరిగిన కొన్నాళ్లకే దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ జగన్ ప్రతిపక్ష నేతగా పిటిషన్ దాఖలు చేశారని, అయితే ఆ పిటిషన్‌పై ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని సీఎంగా మెమో దాఖలు చేశారని తెలిపింది. తద్వారా.. రాష్ట్రంలో తాను పగ్గాలు చేపట్టినా రాజకీయపరంగా దర్యాప్తునకు ప్రమాదం ఉండదనే విషయాన్ని కోర్టుకు తెలిపేందుకు యత్నించారని, అయితే సీఎం ఇప్పుడు ఆ హామీ ఇచ్చినంత మాత్రాన సరిపోదని తేల్చి చెప్పింది. దర్యాప్తు తుది దశకు చేరేంత వరకు నైతిక బాధ్యత వదులుకోరాదని సూచించింది. ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదంటూ సీఎం మెమో దాఖలు చేసేనాటికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆయన నియంత్రణలోనే ఉందని, అయినా హత్య కేసుతో ప్రత్యక్ష సంబంధమున్న ఒక్క నిందితుడిని కూడా అరెస్టు చేయలేదనేది కఠోర సత్యమని గుర్తుచేసింది. మెమో దాఖలు అంశాన్ని సీఎం విజ్ఞతకే వదిలి వేస్తున్నామని వ్యాఖ్యానించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు తీర్పును వెలువరించారు. గత ఏడాది మార్చి 15న అదనపు డీజీపీ అమిత్ గార్గ్ నేతృత్వంలో మొదటి సిట్ ఏర్పాటవగా.. రెండో సిట్‌లో ఆయనకు చోటు లేకపోవడాన్ని న్యాయమూర్తి ఎత్తిచూపారు. హత్యాస్థలిలో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందేనని పేర్కొన్నారు. ఘటనాస్థలిలో పడిఉన్న మృతదేహాన్ని కదల్చకుండా చూడాల్సిన వారు.. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం బాత్రూం నుంచి పడక గదికి మార్చారని.. మృతదేహంపై ఉన్న రక్తపు మరకలను తుడిచి, బ్యాండేజ్ కట్టారని తెలిపారు. పోలీసులు సైతం సాక్ష్యాల పట్ల ఆసక్తి చూపలేదని..ఘటనా స్థలిలో శవ పంచనామా చేపట్టకుండా పులివెందుల ఆస్పత్రికి తరలించడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా తప్పుబట్టారు. కొందరు స్వార్థపరులు ఉద్దేశపూర్వకంగా కీలక సాక్ష్యాలను చెరిపేశారని పేర్కొన్నారు.

## అమ్మా నిర్భయా... న్యాయం జరిగింది

దేశ రాజధాని ఢిల్లీలో నిర్భయపై అత్యంత పాశవికంగా హత్యాచారానికి పాల్పడిన దోషుల్లో నలుగురికి శుక్రవారం ఉరిశిక్ష అమలు కావడంపై సినీ ప్రముఖులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. న్యాయ్యం జరిగిందని పేర్కొన్నారు. నిర్భయ దోషుల ఉరితీతపై తారలు ఏమన్నారంటే...



"చాలా రోజుల సమయం పట్టింది. కానీ, న్యాయం జరిగింది. నిర్భయ తీర్పు ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని మళ్లీ పునరుద్ధరించింది. పట్టు వదలకుండా మొక్కవోని నమ్మకంతో పోరాటం చేసిన ఆమె తల్లితండ్రులు, న్యాయవాదులకు సెల్యూట్. న్యాయవ్యవస్థపై గౌరవం పెరిగింది. దురాగతాలకు పాల్పడేవాళ్లను శిక్షించడానికి బలమైన చట్టాలు తీసుకురావాలి. సత్వర న్యాయం జరగాలి" - మహేశ్‌బాబు



"ఇది చాలా గొప్ప వార్త. ఏడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత నిర్భయ కేసులో దోషులకు శిక్ష పడింది. అంతిమంగా ఉరి తీశారు. న్యాయం కోసం ఏళ్ల పాటు అవిశ్రాంతంగా పోరాడిన ఆమె తల్లి, న్యాయవాదికి సెల్యూట్" - రవితేజ



"చివరకు న్యాయం జరిగింది. సంవత్సరాల తర్వాత శుక్రవారం రాత్రి ఆమె తల్లితండ్రులు ప్రశాంతంగా నిద్రపోతారని ఆశిస్తున్నా. ఇది వాళ్లకు చాలా పెద్ద యుద్ధమే. ఆశాదేవికి నమస్కారాలు" - తాప్సీ



"ఎనిమిదేళ్ల తర్వాత నిర్భయకు న్యాయం జరిగింది. పొల్లాచ్చి కేసులో న్యాయం జరగడానికి ఎన్నేళ్లు పడుతుందోనని ఆశ్చర్యంగా ఉంది. ఇప్పటికే ఏడాది గడిచింది. ఈ ఘటనల నుండి మనం నేర్చుకున్న పాఠాలను మర్చిపోమని ఆశిస్తున్నా. ఎప్పుడూ జాగ్రత్తగా ఉండండి" - కార్తి



"నిర్భయ దోషులను ఉరి తీశారనే గొప్ప వార్తతో ఈ రోజు ప్రారంభించా. న్యాయం జరిగింది" - తమన్నా

వీరే కాకుండా త్రిష, పాయల్ రాజ్‌పుత్, నాగశౌర్య సహా పలువురు తెలుగు, తమిళ, హిందీ తారలు నిర్భయ తీర్పుపై స్పందించారు.

## ప్రియుడితోనే పెళ్లి





కథానాయిక అమలా పాల్‌తో ఫొటోలో ఉన్న వ్యక్తిని చూశారా? అతని పేరు భవిందర్ సింగ్! బాలీవుడ్ గాయకుడు. ఇటీవల అతణ్ని అమలా పాల్ వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారనీ, సహజీవనం చేస్తున్నారనీ పరిశ్రమ వర్గాలు కోడై కూస్తున్నాయి. కానీ, అమలా పాల్ ఎక్కడా పెదవి విప్పలేదు. కొంతకాలం క్రితం తన జీవితంలోకి కొత్త వ్యక్తి వచ్చాడని ఆమె అన్నారు. అంతే తప్ప... అతడు ఎవరు? పేరేంటి? వంటి విషయాలు కూడా చెప్పలేదు. వ్యక్తిగత జీవితాన్ని వీలైనంత రహస్యంగా ఉంచడానికి ప్రయత్నించారు. అయితే... భవిందర్ సింగ్ మాత్రం అమలా పాల్‌తో దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తాజాగా వీళ్లిద్దరూ పెళ్లి చేసుకున్న ఫొటోలు ఇంటర్‌నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి. ఎప్పుడు? ఎక్కడ? పెళ్లి చేసుకున్నారనేది స్పష్టంగా తెలియడం లేదు. కానీ, కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారని తెలిసింది. తమిళ చిత్రం 'దైవ తిరుమగల్' (తెలుగులో 'నాన్న'గా విడుదలైంది) చేసేటప్పుడు దర్శకుడు ఏఎల్ విజయ్‌తో అమలా పాల్ ప్రేమలో పడ్డారు. తొలుత అటువంటిది ఏమీ లేదని చెప్పినా... 2014 జూన్ 12న ప్రేమ వివాహం చేసుకున్నారు. మనస్పర్థలు, కుటుంబ కలహాలతో 2016లో వేరుపడ్డారు. కోర్టు ద్వారా 2017 ఫిబ్రవరిలో విడాకులు తీసుకున్నారు.

## నవ్య | చిత్రజ్యోతి

### కలసికట్టుగా పోరాడదాం!





కరోనా వైరస్ అతి వేగంగా వ్యాపించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యం ఈ మహమ్మారిని నియంత్రించడానికి ప్రజల్లో అవగాహన కలిగించడానికి సినీతారలు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలీవుడ్ తారలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, అక్షయ్ కుమార్, అజయ్ దేవగణ్, మాధురి దీక్షిత్, శిల్పాశెట్టి, రణవీర్ సింగ్, అర్జున్ కపూర్, అలియాభట్ తదితరులతో రోహిత్ శెట్టి ఓ వీడియో రూపొందించారు. బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ దానిని ట్విట్టర్‌లో షేర్ చేసి "కరోనాను నియంత్రించడానికి ప్రజలంతా ఒకటిగా ఉండి ప్రభుత్వాలకు సహకరించాలి. మనం తీసుకునే జాగ్రత్తలతో వైరస్ వ్యాపించకుండా చేయొచ్చు. ఇలాంటి కష్ట సమయంలో మనమంతా బాధ్యతగా వ్యవహరించడం చాలా ముఖ్యం. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కరోనాకు భయపడాల్సిన అవసరం లేదు" అని పేర్కొన్నారు. "ప్రతి ఒక్క సిటిజన్ బాధ్యతగా ఉండాల్సిన సమయమిది" అని కరోనా నివారణకు తగిన జాగ్రత్తలను సూచించారు అనిల్ కపూర్. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలని నటి శిల్పాశెట్టి చెప్పారు. "ప్రజలంతా అవగాహనతో కలిసికట్టుగా పోరాడితే కరోనాను సులభంగా నివారించవచ్చు" అని అక్షయ్‌కుమార్ పిలుపునిచ్చారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 1627.73 | 482.00 | 839 | 1,920 | (8 పైసలు) | |
| 29.915.96 | 8,745.45 | 41,335 (ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)) | 37,140 | 75.20 | 28.07 |

## ఐసీఐసీఐ లాంబార్డ్, స్టార్ హెల్త్ 'కరోనా' బీమా పాలసీలు

ముంబై: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దీని బారి నపడే వారికి బీమా రక్షణను కల్పించే పాలసీలను ఐసీఐసీఐ లాంబార్డ్, స్టార్ హెల్త్ అండ్ అల్లైడ్ ఇన్సూరెన్స్ కంపెనీలు అందుబాటులోకి తీసుకువచ్చాయి. ఈ పాలసీల ప్రీమి యం తక్కువ స్థాయిలోనే ఉంది. స్టార్ హెల్త్ 'స్టార్ నోవెల్ కరోనా వైరస్' పేరుతో పాలసీని తెచ్చింది. ఈ పాలసీ తీసుకుంటే కరోనా ఉన్నట్టు తేలినా, హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం వచ్చినా ఏకమొత్తంగా ఎంత మొత్తానికి పాలసీ తీసుకుంటే అంత చెల్లిస్తారు. 18 నుంచి 65 ఏళ్ల వయసున్న వారు ఈ పాలసీని తీసుకోవచ్చు. రూ.459తో పాటు వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) చెల్లిస్తే రూ.21,000, రూ.918తో పాటు జీఎస్‌టీ చెల్లిస్తే రూ.42,000ల సమ్ అష్యూరెన్స్‌తో పాలసీలు తీసుకోవచ్చు. అంతర్జాతీయ ప్రయాణాలకు సంబంధించిన మినహాయింపులులేవని కంపెనీ తెలిపింది. 65 ఏళ్ల వరకు వయసున్న వారెవరైనా ఆన్‌లైన్ ద్వారా లేదా కంపెనీ నెట్‌వర్క్ ఏజెంట్ల ద్వారా పాలసీని తీసుకోవచ్చని పేర్కొంది. ఎలాంటి మెడికల్ స్క్రీనింగ్ అవసరం లేదని తెలిపింది. తమ అన్ని రెగ్యులర్ ఆరోగ్య బీమా ప్లాన్లు కరోనా చికిత్సకు కవరేజీని అందిస్తాయని కంపెనీ ఎండీ ఆనంద్ రాయ్ తెలిపారు.

**ఐసీఐసీఐ లాంబార్డ్ :** ఈ బీమా సంస్థ 'కోవిడ్-19 ప్రొటెక్షన్ కవర్' పేరుతో పాలసీని విడుదల చేసింది. కోవిడ్ పాజిటివ్‌గా తేలితే బీమా పాలసీ తీసుకున్న వారికి ఏకమొత్తం సమ్ ఇన్సూర్డ్ మొత్తాన్ని కంపెనీ చెల్లిస్తుంది. పాలసీ వెయిటింగ్ పీరియడ్ 14 రోజులు. రూ.149 ప్రీమియం చెల్లిస్తే రూ. 25,000 బీమా లభిస్తుంది. 18 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వరకు వయసున్న వారు ఈ పాలసీని తీసుకోవచ్చు. భారత పౌరు లు మాత్రమే ఈ బీమాను తీసుకోవచ్చు.

## నెల రోజులు బీఎస్ఎన్ఎల్ ఉచిత బ్రాడ్‌బ్యాండ్

న్యూఢిల్లీ: కరోనా ప్రబలుతుండటంతో కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి నుంచే విధులు (వర్క్ ఫ్రమ్ హోమ్) నిర్వర్తిస్తే మంచిదన్న కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను బీఎస్ఎన్ఎల్ వ్యాపారావకాశంగా మలుచుకుంది. వర్క్ ఫ్రమ్ హోమ్ కోసం నెల రోజుల పాటు ఉచితంగా బ్రాడ్‌బ్యాండ్‌ను అందించనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఉన్న బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు తోడు కొత్తగా కనెక్షన్ తీసుకునేవారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపింది. కొత్త వినియోగదారుల్లో.. ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్ తీసుకునేవారికి ఇన్‌స్టాలేషన్ చార్జీలు ఉంటాయని, కాపర్ కేబుల్ కనెక్షన్ తీసుకునేవారైతే అవి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. అయితే మోడెమ్ మాత్రం కొనాల్సి ఉంటుందని వివరించింది. కొత్త వినియోగదారులు ఒక నెలపాటు ఉచితంగా డేటా వాడుకున్న అనంతరం, వారికిష్టమైన డేటా ప్లాన్ల ప్రకారం యథావిధిగా చార్జీలను వసూలు చేస్తామని వెల్లడించింది. కనెక్షన్ కోసం కార్యాలయాలు తిరగడం, కాగితాలు నింపడం వంటి పనులేమీ అవసరం లేదని కేవలం ఒక్క ఫోన్‌కాల్‌తో నెట్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

## తగ్గిన పతంజలి సబ్బుల ధర

**అదే బాటలో హెచ్‌యూఎల్**

న్యూఢిల్లీ : కరోనా వైరస్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు సబ్బుల కంపెనీలూ తమ వంతు కృషి చేసేందుకు ముందుకువచ్చాయి. బాబా రామ్‌దేవ్ నాయకత్వంలోని పతంజలి ఆయుర్వేద్ కంపెనీ ఇందుకోసం తన అలోవీరా, హల్దీ చందన్ సబ్బుల ధర ను 12.5 శాతం వరకు తగ్గించింది. సామాన్య ప్రజలకు సహకరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. హిందుస్తాన్ యూనీలీవర్ (హెచ్‌యూఎల్) కూడా తన లైఫ్‌బాయ్ బ్రాండ్ సబ్బులు, వ్యక్తిత శుభ్రతకు తోడ్పడే హ్యాండ్‌వాష్, డోమెక్స్ ఫ్లోర్ క్లీనర్ల ధర 15% తగ్గించబోతున్నట్టు తెలిపింది. వచ్చే కొద్ది వారాల్లోనే ధరలు తగ్గించిన ఈ ఉత్పత్తులు మార్కెట్లోకి అందుబాటులోకి వస్తాయని ప్రకటించింది.

## వారం రోజులపాటు బ్రాండిక్స్ మూసివేత

అచ్యుతాపురం : కరోనా వైరస్‌ను కట్టడి చేసే చర్యల్లో భాగంగా బ్రాండిక్స్ యూనిట్‌ను వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు కంపెనీ భారత భాగస్వామి దొరస్వామి ప్రకటించారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తాము ప్లాంట్‌ను శుక్రవారం రాత్రి నుంచి ఈ నెల 27వ తేదీ వరకు మూసేస్తున్నామని ప్రకటించారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 20వ తేదీకి.. | | విజయవాడ | 225 |
| హైదరాబాద్ | 210 | విశాఖపట్నం | 260 |
| 21వ తేదీకి.. | | వరంగల్ | 213 |
| చిత్తూరు | 223 | డజను గుడ్లు రూ. 40 | |
| గోదావరి | 225 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 33 | విజయవాడ | 30 |
| వరంగల్ | 33 | గుంటూరు | 30 |
| మహబూబ్‌నగర్ | 33 | ఒంగోలు | 30 |
| కరీంనగర్ | 35 | చిత్తూరు | 35 |
| కర్నూలు | 33 | నెల్లూరు | 35 |
| విశాఖపట్నం | 28 | అనంతపురం | 31 |
| గోదావరి | 33 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 41,060 | 42,200 | 42,500 | 42,500 | 41,500 |
| క్రితం ముగింపు | 40,280 | 41,800 | 41,770 | 41,750 | 40,730 |
| 22 క్యారెట్లు | 39,140 | 39,250 | 39,100 | 38,700 | 39,520 |
| క్రితం ముగింపు | 38,400 | 39,000 | 38,420 | 38,530 | 38,790 |
| వెండి (కిలో) | 36,200 | 39,000 | 38,000 | 38,600 | 40,200 |
| క్రితం ముగింపు | 34,400 | 38,000 | 35,300 | 38,500 | 38,300 |

# కంపెనీలు విలవిల

## 50 శాతం కంపెనీల కార్యకలాపాలపై దెబ్బ

### 80 శాతం సంస్థల్లో తగ్గిన నగదు ప్రవాహం.. ఫిక్కీ సర్వేలో వెల్లడి



ముంబై: కరోనా వైరస్ వ్యాప్తి పట్ల భారత కంపెనీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తమ కంపెనీల కార్యకలాపాలపై భారీగా ప్రభా వం పడటమే కాకుండా నగదు ప్రవాహం కూడా తగ్గిపోయినట్టు చెబుతున్నాయి. పరిశ్రమ సంఘం భారత వాణిజ్య, పరిశ్రమ సంఘాల సమాఖ్య (ఫిక్కీ) నిర్వహించిన తాజా సర్వే ప్రకారం.. తమ వ్యాపార కార్యకలాపాలపై ప్రభా వం పడినట్టు 50 శాతానికి పైగా కంపెనీలు తెలిపాయి. దాదాపు 80 శాతం కంపెనీలకు నగ దు ప్రవాహం తగ్గిపోయింది. దీని మూలంగా కంపెనీలకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ మహమ్మారి మూలంగా భారత ఆర్థిక వ్యవ స్థ కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. డిమాండ్, సప్లయ్‌ను తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఫలితంగా కంపెనీలతో పాటు ఆర్థిక వ్యవస్థ వృద్ధి గాడితప్పవచ్చన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. వస్తుసేవల గిరాకీ, సరఫరాపై నేరుగా ప్రభావం పడటమేకాకుండా ఆర్థిక వ్యవస్థలో మందగమనంతో నగదు ప్రవా హం బాగా తగ్గినట్టు ఫిక్కీ సభ్యులు చెబుతున్నారు. దీనివల్ల అన్ని రకాల చెల్లింపుల (ఉద్యోగుల వేతనాలు, వడ్డీ, రుణాల తిరిగి చెల్లింపు, పన్నులు)పై ప్రభావం పడుతోందని ఫిక్కీ పేర్కొంది.

ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో మందగమనం నెలకొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి కేవలం 4.7 శాతంగానే ఉంది. గత ఆరేళ్ల కాలంలో ఇదే తక్కు వ. తాజాగా కరోనాతో ఆర్థిక వ్యవస్థపై మరింత భారం పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమను ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఫిక్కీ పేర్కొంది. ద్రవ్యపరంగా, విత్త పరంగానే కాకుండా ఆర్థిక మార్కెట్‌పరంగా చర్యలు తీసుకోవడం వల్ల వ్యాపార సంస్థలు, ప్రజలను సంక్షోభం నుంచి బయటపడేయవచ్చని సూచించింది. భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) విధానపరమైన రేట్లను ఒక శాతం వరకు తగ్గించాలని, దీని వల్ల భారత పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థకు మద్దతు లభిస్తుందని ఫిక్కీ పేర్కొంది. ప్రొవిజనింగ్ చేయకుండా చెల్లింపుల రీషెడ్యూల్‌కు బ్యాంకులకు అవకాశం కల్పించాలని తెలిపింది. కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు, బ్యాంకులకు ప్రత్యేక నగదు లభ్యత మద్దతును కల్పించాలని సూచించింది. పన్ను వసూళ్లు తగ్గినా ప్రభుత్వం మాత్రం మూలధన వ్యయ ప్రణాళికల్లో కోత విధించవద్దని సూచించింది. ఇదిలా ఉంటే.. సర్వేలో పాల్గొన్న వారిలో 60 శాతానికి పైగా సభ్యులు తమ సప్లయ్ చెయిన్లు దెబ్బతిన్నాయని, రానున్నకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారవచ్చని పేర్కొన్నారు. పరిస్థితి పూర్వస్థాయికి రావడానికి మూడు నెలలు పడుతుందని 42 శాతం మంది అభిప్రాయపడ్డారు.

### ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించాలి..

### ఆభరణాలకు గిరాకీ తగ్గింది: డబ్ల్యూజీసీ

కరోనా కారణంగా పసిడి మార్కెట్లో సెంటిమెంట్ బలహీనంగా మారిందని, ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు అంతగా ఆసక్తి చూపడం లేదని, ఫలితంగా గిరాకీ తగ్గిపోయిందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) చెబుతోంది. కరోనా దెబ్బతో అన్ని ఆస్తుల మాదిరిగానే బంగారంపైనా ప్రభావం పడింది. ఇతర ఆస్తుల్లో నష్టాలను కవర్ చేసుకునేందుకు చాలా మంది బంగారాన్ని నగదులోకి మార్చుకుంటున్నారని, ఫలితంగా ధరల్లో హెచ్చుతగ్గులు నమోదు అవుతున్నాయని డబ్ల్యూజీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఇండియా) సోమసుందరం పీఆర్ తెలిపారు.

### సిమెంట్ డిమాండ్ తగ్గుదల తాత్కాలికమే

కరోనా మూలంగా చాలా ప్రాంతాల్లో నిర్మాణ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఫలితంగా సిమెంట్ డిమాండ్ తగ్గుముఖం పట్టింది. అయితే సాధారణ పరిస్థితులు నెల కొన్న తర్వాత డిమాండ్ మళ్లీ పుంజుకుంటుందని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ తెలిపింది. తాజా ఆంక్షల మూలంగా మార్చి నుంచి కొంత కాలం పాటు డిమాండ్‌పై ప్రభావం ఉంటుందని, సాధారణ పరిస్థితులు రాగానే గిరాకీ పెరుగుతుందని పేర్కొంది.

### భారత్ వృద్ధి 5.1 శాతమే : ఫిచ్




కరోనాతో సప్లయ్ చెయిన్‌లో తీవ్ర విఘాతాలు ఏర్పడ్డాయని, పెట్టుబడులు, ఎగుమతులపైనా వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఫిచ్ రేటింగ్స్ పేర్కొంది. ఈ నేపథ్యంలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో భారత్ 5.1 శాతం వృద్ధిని మాత్రమే సాధించే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి కూడా తగ్గుతోందని, ఇప్పుడు ప్రపంచం మాంద్యంలో ఉందని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత్ 5.6 శాతం వృద్ధిని సాధించడానికి అవకాశం ఉందని గత డిసెంబరులో ఫిచ్ పేర్కొంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో వృద్ధి అంచనాను 5.1 శాతానికి తగ్గించింది. ఇక 2019-20 సంవత్సరంలో జీడీపీ వృద్ధి 5.0 శాతం ఉండవచ్చని ఫిచ్ చెబుతోంది.

### తక్షణ చర్యలు తీసుకోవాలి : క్రిసిల్



కోవిడ్-19 మహమ్మారి ప్రభావం మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో తగిన చర్యలు తక్షణమే తీసుకోవాలని క్రిసిల్ అంటోంది. కరోనాతో సర్వీసుల రంగం తీవ్రంగా దెబ్బతిన్నదని, ఈ రంగానికి తక్షణమే ద్రవ్యపరంగా మద్దతు అందించాలని సూచిస్తోంది. ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచేందుకుగాను విత్తపరమైన, ద్రవ్యపరమైన చర్యలు కూడా తీసుకోవాలని అంటోంది. విమానయాన కంపెనీలు, హోటళ్లు, మాల్స్, మల్టీప్లెక్స్‌లు, రెస్టారెంట్లు, రిటైలర్లకు ద్రవ్యపరంగా మద్దతు ఇవ్వాలని పేర్కొంది. ఈ రంగంలోని కంపెనీలు చాలా నష్టాల్లో ఉన్నాయని క్రిసిల్ ఆర్థికవేత్తలు, విశ్లేషకులు ఒక నివేదికలో పేర్కొన్నారు. కరోనాను కట్టడి చేయకపోతే చైనాకు భారత్ నుంచి ఎగుమతయ్యే పత్తి, ఇనుప ఖనిజం, పెట్రోలియం ఉత్పత్తులకు డిమాండ్ భారీగా తగ్గవచ్చని అంటున్నారు. ఫార్మా, ఆటోమొబైల్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్స్, టెలికాం/స్మార్ట్‌ఫోన్ ఎక్విప్‌మెంట్ దిగుమతులు కూడా తగ్గడానికి అవకాశం ఉందని, ఫలితంగా దేశీయ పరిశ్రమలకు ఇబ్బందులు ఏర్పడవచ్చని చెబుతున్నారు.

## జూన్ 30 వరకు సాధారణ బోర్డు సమావేశాలు అక్కర్లేదు

**కార్పొరేట్ వ్యవహారాల శాఖ వెల్లడి**



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కరోనా వ్యాప్తిని అడ్డుకోవడానికి కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) కూడా నడుం బిగించింది. ఆర్థిక ఫలితాలు, బోర్డు నివేదిక, కంపెనీ పునర్వ్యవస్థీకరణ మొదలైన అంశాలపై ఆమోదానికి కంపెనీ బోర్డులు సాధారణ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం లేదని పేర్కొంది. 2020 జూన్ 30 వరకూ ఇది అమల్లో ఉంటుంది. కంపెనీల చట్టం కింద మరిన్ని వెసులుబాట్లు కల్పించే అంశాన్ని కూడా కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిశీలిస్తోంది. మార్చి 31 వరకూ ప్రధాన కార్యాలయాలు, క్షేత్ర స్థాయి ఉద్యోగులు ఇంటి నుంచి పని చేసే విధంగా కంపెనీలు ప్రణాళికను రూపొందించి, అమలు చేయాలని సూచించింది. ఆ తర్వాత పరిస్థితులను బట్టి మరింత కాలం ఇంటి నుంచి పని చేసే అంశాన్ని పరిశీలిస్తారు. వీడియో కాన్ఫరెన్సింగ్, ఎలక్ట్రానిక్/టెలిఫోనిక్ విధానాల్లో సమావేశాలు నిర్వహించాలని పేర్కొంది. కంపెనీ అఫర్మేషన్ ఆఫ్ రెడినెస్ టువార్డ్స్ కోవిడ్-19 (కార్) పేరుతో వెబ్ ఫారమ్‌ను ఎంసీఏ సిద్ధం చేస్తోంది. ఈ ఫారమ్‌ను నింపి కంపెనీలు/ఎల్ఎల్పీలు తమ రెడినెస్‌ను తెలియజేయాల్సి ఉంటుంది. ఈ ఫారమ్ ఈ నెల 23న అందుబాటులోకి వస్తుంది.

## చిన్న ఐటీ సంస్థలకు రూ.730 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో జరిగిన ఇండియాసాఫ్ట్, గ్లోబల్‌సాఫ్ట్‌ల్లో చిన్న, మధ్య స్థాయి సాఫ్ట్‌వేర్ కంపెనీలు 10 కోట్ల డాలర్ల (దాదాపు రూ.730 కోట్లు) విలువైన సాఫ్ట్‌వేర్ ఎగుమతులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మొత్తం 400 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఇండియా సాఫ్ట్, గ్లోబల్ సాఫ్ట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ నళిన్ కోహ్లీ తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనంతగా అధిక ఎగుమతులకు ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. ఇండియా సాఫ్ట్‌కు దాదాపు 50 దేశాల నుంచి 350 మంది కొనుగోలుదారులు హాజరయ్యారు.

## 'జనతా కర్ఫ్యూ' బీపీఓ పరిశ్రమకు చేటు

వాషింగ్టన్ : ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'జనతా కర్ఫ్యూ' ప్రతిపాదనపై అమెరికాలో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ కర్ఫ్యూతో భారత్ నుంచి బీపీఓ సేవలు అందుకుంటున్న అమెరికాలోని ఆరోగ్య, అత్యవసర విభాగాల సేవలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని 'యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ అండ్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం (యూఐఎస్‌పీఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని జనతా కర్ఫ్యూ నుంచి బీపీఓ కంపెనీలకు మినహాయింపు ఇవ్వాలని కోరింది. లేకపోతే ఆ ప్రభావం భారత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపైనా ఉంటుందని తెలిపింది. బీపీఓ పరిశ్రమ ద్వారా భారత కంపెనీలు లక్ష ఉద్యోగాలతో పాటు ఏటా 1,000 కోట్ల డాలర్ల ఎగుమతులు సాధిస్తున్న విషయాన్ని యూఐఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు ముకేశ్ అఘీ గుర్తు చేశారు.

## తగ్గిన విదేశీ మారక నిల్వలు

**ఆరు నెలల్లో తొలిసారి!**

ముంబై: భారత ప్రభుత్వం వద్దనున్న విదేశీ మారక నిల్వలు గడిచిన 6 నెలల్లో తొలిసారిగా తగ్గుదలను నమోదు చేసుకున్నాయి. ఆర్‌బీఐ డేటా ప్రకారం.. ఈ నెల 13తో ముగిసిన వారంలో నిల్వలు 535 కోట్ల డాలర్లు తగ్గి 48,189 కోట్ల డాలర్లకు పడిపోయాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సీఏ) తగ్గడమే ఇందుకు కారణం. మొత్తం నిల్వల్లో ఎఫ్‌సీఏలదే సింహభాగం. సమీక్షా కాలానికి ఎఫ్‌సీఏలు 378 కోట్ల డాలర్లు తగ్గి 44,736 కోట్ల డాలర్లకు పరిమితం అయ్యాయి.

## దెబ్బతిన్న రంగాలకు త్వరలో సహాయ ప్యాకేజీ

**ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్**



న్యూఢిల్లీ: కోవిడ్-19తో దెబ్బతిన్న రంగాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటిస్తామని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చెప్పారు. ఎప్పటిలోగా ఈ ప్యాకేజీ ప్రకటించేది ఇప్పటికిప్పుడు చెప్పడం కష్టమన్నారు. అయితే వీలైనంత త్వరలోనే ఈ సహాయ ప్యాకేజీ ప్రకటిస్తామన్నారు. ఆర్థిక మంత్రి శుక్రవారం వివిధ మంత్రులు, మంత్రిత్వ శాఖల అధికారులతో సమావేశమై ఆయా రంగాలపై కోవిడ్-19 ప్రభావాన్ని సమీక్షించారు. పౌర విమానయానం, పశు సంవర్ధక శాఖ, పర్యాటక, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రులు, అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఆయా రంగాలు కోరుతున్న డిమాండ్లను అధికారులు తెలయజేసినట్టు సీతారామన్ చెప్పారు. శనివారం జరిగే మరో సమావేశంలో కష్టాల్లో ఉన్న రంగాల్ని ఆదుకునేందుకు చేపటాల్సిన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేస్తామన్నారు.

# మళ్లీ ఏపీఐ, ఔషధాల ఎగుమతులు!

- సెజ్ యూనిట్ల నుంచి చేయొచ్చు
- దేశీయంగా కొరత లేదు
- రూ.3,000 కోట్లతో ఫండ్‌కు ప్రభుత్వ యోచన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నిషేధం విధించిన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) వాటితో తయారు చేసే ఫార్ములేషన్లను మళ్లీ ఔషధ కంపెనీలు ఎగుమతి చేయనున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి, చైనా నుంచి ఏపీఐ, ఇంటర్మీడియెట్స్ సరఫరా నిలిచిపోవడం వంటి కారణాలతో ఈ నెల ప్రారంభంలో యాంటీబయాటిక్స్, విటమిన్లు, హార్మోన్లు తదితర 26 ఏపీఐ, ఫార్ములేషన్లపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నిషేధం విధించింది. ఏపీఐ, ఔషధాలకు దేశీయంగా కొరత లేదని.. ఎగుమతులను అనుమతించాలని పరిశ్రమ కోరుతోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లోని యూనిట్లు ఏపీఐ, ఫార్ములేషన్లను ఎగుమతి చేయొచ్చని డీజీఎఫ్‌టీ స్పష్టం చేసింది.

ఔషధాలకు హార్మోనైజ్డ్ కమోడిటీ డిస్క్రిప్షన్ అండ్ కోడింగ్ వ్యవస్థ (హెచ్‌ఎస్ కోడ్) ఉంటుంది. ఒక హెచ్‌ఎస్ కోడ్ కింద నాలుగైదు ఔషధాలు ఉంటాయి. కొంతమంది కింది స్థాయి కస్టమ్స్ అధికారులకు దీనిపై అవగాహన లేక హెచ్‌ఎస్ కోడ్ కిందకు వచ్చి నిషేధం పరిధిలో లేని ఔషధాల ఎగుమతులను కూడా అడ్డుకుంటున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిపై కూడా డీజీఎఫ్‌టీ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. నిషేధం పరిధిలోకి రాని ఔషధాల ఎగుమతులను అడ్డుకోవద్దని స్పష్టం చేసింది.

### చైనాలో ఉత్పత్తి ప్రారంభమైంది

దేశీయంగా పెద్ద కంపెనీల వద్ద 3-4 నెలల వరకూ సరిపడా ఏపీఐ, ఇంటర్మీడియెట్స్ నిల్వలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. చిన్న కంపెనీలు మాత్రం ఎక్కువ ధర చెల్లించి ఏపీఐలను కొనుగోలు చేస్తున్నాయి.

కంపెనీల వద్ద ఏపీఐల నిల్వలు తగినంత ఉన్నాయి. దేశీయంగా ఔషధాలకు ఎటువంటి కొరత ఉండదు. అందువల్ల ఎగుమతులపై నిషేధం ఎత్తివేయాలని కోరుతున్నామని ఫార్మాగ్జిల్ చైర్మన్ దినేష్ దువా అన్నారు.

### సామర్థ్యం పెంపునకు చర్యలు

దేశీయంగా ఇంటర్మీడియెట్స్ తయారీకి ఫెర్మెంటేషన్, ఏపీఐ యూనిట్ల ఏర్పాటు, ఉన్న వాటి సామర్థ్య వినియోగాన్ని పెంచడానికి, నవీకరించడానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు రూ.3,000 కోట్లతో ఒక కార్పస్‌ను ఏర్పాటు చేయాలని నీతి ఆయోగ్‌తో కలిసి ఫార్మాస్యూటికల్స్ విభాగం (డీఓపీ) ఒక ప్రతిపాదన చేసింది. దీన్ని ప్రభుత్వానికి సమర్పించిది. దీన్ని కేబినెట్ పరిశీలించి ఆమోదించాలి.

అన్నీ సక్రమంగా జరిగితే.. ఏప్రిల్ మొదటి వారంలో ఈ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం లభించే వీలుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# రిలీఫ్ ర్యాలీ

- మార్కెట్లకు భారీ ఉపశమనం
- సెన్సెక్స్ 1,627 పాయింట్లు అప్
- నిఫ్టీకి 482 పాయింట్ల లాభం

ముంబై: స్టాక్ మార్కెట్లో నాలుగు రోజుల వరుస పతనానికి వారాంతంలో అడ్డుకట్ట పడింది. ఉద్దీపనల ఆశలు మార్కెట్లను మళ్లీ లాభాల్లో నడిపించాయి. ఈ మహమ్మారితో కుదేలైన రంగాలకు మద్దతిచ్చేందుకు ఆర్థిక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించడం దలాల్‌స్ట్రీట్‌లో ట్రేడింగ్ సెంటిమెంట్‌ను సానుకూలంగా మార్చింది. ప్రపంచ మార్కెట్లూ లాభాల్లో పయనించడం దేశీయంగా కొనుగోళ్లకు ఊతమిచ్చింది. శుక్రవారం ట్రేడింగ్ ప్రారంభంలో తీవ్ర ఊగిసలాటలకు లోనైన సెన్సెక్స్ 27,932 వద్దకు జారుకుంది. వెంటనే కోలుకొని ర్యాలీ తీసిన సూచీ.. ఒక దశలో 30,418 స్థాయికి ఎగబాకింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 2,485 పాయింట్ల మేర ఊగిసలాడిన సెన్సెక్స్.. చివరికి 1,627.73 పాయింట్ల లాభంతో 29,915.95 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ ప్రామాణిక సూచీ నిఫ్టీ 482 పాయింట్ల పెరుగుదలతో 8,745 వద్దకు చేరుకుంది.

### రూ.6.32 లక్షల కోట్లు పెరిగిన సంపద

బ్లూచిప్‌లతోపాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 4.03 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 4.18 శాతం బలపడ్డాయి. స్టాక్ మార్కెట్ వర్గాల సంపద రూ.6.32 లక్షల కోట్లు పెరిగింది. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.116,09,143.29 కోట్లకు చేరుకుంది.

### టాప్ గెయినర్ ఓఎన్‌జీసీ

సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 28 లాభపడ్డాయి. ప్రభుత్వ రంగ ఇంధన ఉత్పత్తి దిగ్గజం ఓఎన్‌జీసీ 18.58 శాతం బలపడి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. అల్ట్రాటెక్ సిమెంట్ 13.01 శాతం, హెచ్‌యూఎల్ 11.75 శాతం పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ సైతం రెండంకెల్లో లాభపడింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రం స్వల్ప నష్టాల్లో ముగిశాయి.



రంగాలవారీగా చూస్తే..బీఎస్ఈలోని ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, టెక్నాలజీ, మెటల్స్, యుటిలిటీస్ సూచీలు 9.96 శాతం వరకు పెరిగాయి.

### ఆర్‌ఐఎల్ షేరు జూమ్

రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) షేరు భారీగా పుంజుకుంది. ముకేశ్ అంబానీ, ఆయన భార్య, ముగ్గురు పిల్లలు కంపెనీలో తమ వ్యక్తిగత వాటాను పెంచుకోవడం ఇందుకు దోహదపడింది. బీఎస్ఈలో ఆర్‌ఐఎల్ షేరు 11.24 శాతం పెరిగి రూ.1,020.20 వద్దకు చేరుకుంది. ఎన్ఎస్ఈలో 12 శాతం లాభంతో రూ.1,028 వద్ద ముగిసింది. గురువారంతో ముగిసిన నాలుగు సెషన్లలో ఆర్‌ఐఎల్ షేరు 17.14 శాతం క్షీణించింది.

### 10ఏళ్లలో అతిపెద్ద వీక్లీ నష్టం

వారాంతంలో భారీగా లాభపడినప్పటికీ ఈ వారం మొత్తానికి మాత్రం సూచీలు అతిపెద్ద నష్టాన్ని మూటగట్టుకున్నాయి. గతవారం ముగింపుతో పోలిస్తే ఈ వారంలో సెన్సెక్స్ 4,187.52 పాయింట్లు (12.27 శాతం), నిఫ్టీ 1,209.75 పాయింట్లు (12.15 శాతం) కోల్పోయాయి. గడిచిన పదేళ్లలో సూచీలకిదే అతిపెద్ద వీక్లీ నష్టం.

### ఊగిసలాటల కట్టడికి సెబీ చర్యలు

స్టాక్ మార్కెట్లో తీవ్ర ఊగిసలాటలను కట్టడి చేసేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శుక్రవారం పలు చర్యలు చేపట్టింది. ఈనెల 23 నుంచి అమలులోకి రానున్న చర్యలు.. నెల రోజులపాటు కొనసాగుతాయని సెబీ తెలిపింది.

### ఐటీ షేర్లు మిలమిల

గడిచిన కొన్ని రోజుల్లో భారీగా పతనమవుతూ వచ్చిన ఐటీ కంపెనీల షేర్లు ప్రస్తుతం చౌకగా లభిస్తుండటంతో ట్రేడర్లు వీటి కొనుగోళ్లకు ఎగబడ్డారు. అమెరికన్ ఐటీ కంపెనీ యాక్సెంచర్ మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించడం, రూపాయి సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోవడం కూడా ఐటీ షేర్ల కొనుగోళ్లకు దోహదపడ్డాయి.



# పసిడి మళ్లీ పైకి..

**ఒక్క రోజులో రూ.1,395 పెరుగుదల**

బంగారం ధరలు మళ్లీ పుంజుకున్నాయి. శుక్రవారం ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములకు రూ.1,395 ఎగబాకి రూ.41,705కు చేరుకుంది. వెండి రేటు సైతం కిలోకు రూ.2,889 పెరిగి రూ.38,100గా నమోదైంది. ముంబైలో పది గ్రాములు బంగారం ధర రూ.839 పెరిగి రూ. 41,335కు చేరుకుంది. కిలో వెండి రూ.1,920 ఎగబాకి రూ.37,140 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాలకు డిమాండ్ మళ్లీ పుంజుకోవడం ఇందుకు కారణమైంది. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 1,514 డాలర్లు, సిల్వర్ 12.96 డాలర్లకు చేరుకున్నాయి.

### ఆల్ టైమ్ కనిష్ఠానికి రూపాయి

దేశీయ కరెన్సీ విలువ సరికొత్త ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం రేటు మరో 8 పైసలు బలహీనపడి 75.20కి చేరింది. కరోనా వైరస్ భయాలు, ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు.. రూపాయి విలువకు మరింత గండికొట్టాయని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు తెలిపాయి.


అలిపిరి చెక్‌పోస్ట్

# చాపకింద నీరులా..

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో కరోనా వైరస్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. వరుసగా మూడోరోజూ పాజిటివ్ కేసు నమోదవడం ఆందోళనకు గురిచేస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో ఓ వ్యక్తికి పాజిటివ్ అని శుక్రవారం తేలింది. ఈ జిల్లాలో ముగ్గురు అనుమానితులు ఉండగా.. వారిలో ఒకరికి పాజిటివ్ వచ్చినట్టు తెలుస్తోంది. అధికారికంగా నిర్ధారణ అయితే రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య నాలుగుకి చేరినట్టవుతుంది. కాగా.. ఇప్పటి వరకూ రాష్ట్రంలో 128 మంది శాంపిల్స్ స్వీకరించగా.. 108 మందికి నెగిటివ్ వచ్చింది. మరో 16మంది రిపోర్టులు రావాల్సి ఉంది. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 704 మంది హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. 39 మంది ఆస్పత్రి ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా.. విశాఖలో గురువారం కరోనా పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో అధికారులంతా ఉలిక్కిపడ్డారు. మక్కా వెళ్లొచ్చిన అల్లిపురం ప్రాంత వాసి (66) కరోనా బారినపడినప్పటి నుంచి ఆస్పత్రిలో చేరేవరకు ఎంతమందిని కలిశాడన్న దానిపై అధికారులు దృష్టి సారించారు. హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చిన తర్వాత ఆయన అల్లిపురంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని బంధువులు, స్నేహితులైన 17 మందిని కలిసినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వారిలో ఆ ప్రాంతానికి చెందిన వైద్యుడు కూడా ఉన్నట్టు గుర్తించారు. అధికారులు ఆ 17 మందితో వ్యక్తిగతంగా మాట్లాడి.. కరోనా లక్షణాలేమైనా ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు.

### బాధితుడి భార్యకు జలుబు, దగ్గు

కరోనా బాధిత వ్యక్తి భార్య, కుమార్తెను అధికారులు శుక్రవారం ఉదయం ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలోని ప్రత్యేక వార్డుకు తరలించారు. ఆయన భార్య (55) జలుబు, దగ్గుతో బాధపడుతుండగా, కుమార్తె (20)లో ఎటువంటి లక్షణాలు లేవని వైద్యులు చెబుతున్నారు. వీరిద్దరి నుంచి నమూనాలు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి పంపించారు. కరోనా పాజిటివ్ కేసు నమోదైన అల్లిపురం మొత్తాన్ని అధికారులు జల్లెడ పడుతున్నారు. శుక్రవారం ఉదయమే ఈ ప్రాంతానికి పూర్తిగా దిగ్బంధం చేసి అటు వెళ్లే అన్ని మార్గాలనూ మూసివేశారు. బాధితవ్యక్తి ఇంటి నుంచి 3 కిలో మీటర్ల పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు 141 బృందాలను నియమించారు.

### బతికే ఉన్నాడు: డీఎంహెచ్‌వో

విశాఖలో కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తి మరణించాడని టీవీ చానళ్లలోను, సోషల్ మీడియాలోను ప్రచారం జరుగుతోందని, అదంతా అవాస్తవమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి తిరుపతిరావు స్పష్టంచేశారు.

### ఇద్దరు వైద్యులు సెల్ఫ్ క్వారంటైన్!

విశాఖలో కరోనా పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో ఇద్దరు వైద్యులు, ఒక స్టాఫ్ నర్సు... సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అల్లిపురానికి చెందిన 66 ఏళ్ల వ్యక్తి ఈనెల 14న ప్రైవేటు వైద్యుడి వద్దకు వెళ్లారు. తగ్గకపోవడంతో 17న మరోమారు వెళ్లారు. ఇప్పుడు ఆ వ్యక్తికి పాజిటివ్ రావడంతో ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడు తనకు కూడా కరోనా వచ్చే అవకాశం ఉందని 14 రోజులు హోమ్ క్వారంటైన్‌లోకి వెళ్లారు. కాగా.. కింగ్ జార్జి ఆస్పత్రిలో ఒక స్టాఫ్ నర్సు సోదరుడు దుబాయ్‌లో ఉంటున్నాడు. ఆయన ఇటీవల ఆమె ఇంటికి వచ్చి వెళ్లాడు. అప్పటి నుంచి నర్సుకు జలుబు, జ్వరం రావడంతో డిపార్టుమెంట్ హెడ్‌కు చెప్పి మందులు తీసుకున్నారు. ఇప్పుడు ఆ నర్సు కరోనా అనుమానంతో సెలవులో హోమ్ క్వారంటైన్‌లో ఉన్నారు. విషయం తెలిసి నర్సుని చూసిన డాక్టర్ కూడా హోమ్ క్వారంటైన్‌కు వెళ్లారు.

### కోలుకుంటున్న కరోనా రోగి

ప్రకాశం జిల్లాలో కరోనా నిర్ధారణ అయిన విద్యార్థి రిమ్స్‌లోని ఐసోలేషన్ వార్డులో కోలుకుంటున్నాడు. కాగా బాధితుడి తల్లి, తండ్రి, సోదరిని కూడా ఐసోలేషన్ వార్డులో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. ఇక కృష్ణా జిల్లాలో శుక్రవారం ఒక్కరోజే ఐదు కరోనా అనుమానిత కేసులు వెలుగు చూడడం కలకలం రేపింది. విజయవాడ నగరంలోని వన్‌టౌన్ కొత్తపేట చేపల మార్కెట్ ప్రాంతానికి చెందిన యువకుడు ఈ నెల 16న ప్యారిస్ నుంచి విజయవాడ చేరుకున్నాడు. ఆ యువకుడు నాలుగు రోజులుగా ఇంట్లోనే ఉంటున్న విషయం వైద్య అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో శుక్రవారం ప్రత్యేక అంబులెన్స్‌లో ఆ యువకుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శాంపిల్స్ సేకరించి తిరుపతి ల్యాబ్‌కు పంపించారు. రామకృష్ణాపురం ప్రాంతానికి చెందిన వృద్ధురాలు దుబాయ్ నుంచి రావడంతో స్థానికులు వైద్యాధికారులకు సమాచారం అందించారు. అజిత్‌సింగ్ నగర్‌లోని వాంబే కాలనీకి చెందిన మహిళ గురువారం రాత్రి లండన్ నుంచి విజయవాడ చేరుకుంది. ఆశా వర్కర్లు శుక్రవారం ఉదయం ఆ మహిళ వివరాలు సేకరించారు. జగ్గయ్యపేట, గన్నవరం ఎయిర్‌పోర్టులోనూ రెండు అనుమానిత కేసులు వెలుగుచూశాయి. నెల్లూరు జిల్లాలో శుక్రవారం కొత్తగా తొమ్మిది అనుమానిత నేసులు నమోదయ్యాయి. విశాఖ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఆరుగురు అబుదాబి నుంచి నెల్లూరుకు వచ్చారు. వారిని కరోనా అనుమానితులుగా భావించి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ఆస్ట్రియాకు చెందిన వ్యక్తి జిల్లాలోని విడవలూరు మండలానికి రాగా ఆయనను జీజీహెచ్ ఐసోలేషన్‌కు తరలించారు. రాయవేలూరులో చదువుకుంటున్న కావలికి చెందిన విద్యార్థినితోపాటు ఆమె తల్లిని కూడా ఐసోలేషన్‌కు తరలించారు. కాగా.. కర్నూలు రైల్వేస్టేషన్‌లో కరోనా అనుమానితుడిని రైల్వే పోలీసులు అదుపులో తీసుకుని ప్రభుత్వాస్పత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు.


విజయవాడ రైతు బజార్‌లో మాస్క్‌లతో విక్రయదారులు

## రవాణాశాఖలో 'బయోమెట్రిక్' రద్దు?

▸ పీటీడీలో బ్రీత్ ఎనలైజర్లకు విరామం!

విజయవాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తిని అరికట్టే చర్యలలో భాగంగా రవాణాశాఖ(ఆర్టీఏ), ప్రజా రవాణా సంస్థ(పీటీడీ)లు బ్రీత్ ఎనలైజింగ్ పరీక్షలు, బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్‌లను తాత్కాలికంగా ఉపసంహరించుకునే దిశగా ఆలోచనలు చేస్తున్నాయి. రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ సేవలలో వాహనదారుని ధ్రువీకరణ కోసం వారి వేలిముద్రను తీసుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా అన్ని రకాల లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు తదితర కేటగిరీలలో వాహనదారుని గుర్తింపు కోసం బయోమెట్రిక్ తప్పనిసరి! ఈ బయోమెట్రిక్ వల్ల వాహనదారుడు ఆధార్‌తో సహా, రేషన్ కార్డు, వాహన ధ్రువపత్రాలు, ఇతర కేవైసీ డాక్యుమెంట్లు మాన్యువల్‌గా పొందుపరచనవసరం ఉండదు. అయితే రవాణాశాఖలో కీలకంగా మారిన బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ కరోనా వ్యాప్తికి దోహదపడుతుందేమోనన్న ఆందోళన వాహనదారులతో పాటు, రవాణాశాఖ సిబ్బందిలోనూ కలుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రవాణాశాఖ అధికారులు బయోమెట్రిక్ సేవలకు తాత్కాలికంగా విరామం ప్రకటించాలని భావిస్తున్నారు. దీనిపై ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## మోదీ పిలుపును పాటిద్దాం

▸ జనతా కర్ఫ్యూలో అందరూ భాగస్వాములు కావాలి: పవన్

అమరావతి, హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కరోనాపై పోరాటంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన సూచనలను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. మోదీ సూచనలను ప్రజలంతా అనుసరించాలని, 22న జనతా కర్ఫ్యూగా పాటించాలని కోరారు. ఆ రోజు ఉదయం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఇళ్లకే పరిమితం కావాలని పిలుపునిచ్చారు. కరోనా ప్రమాదకరం అని తెలిసినప్పటికీ దానిని నిర్మూలించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, పారామెడికల్, వైద్య ఆరోగ్య సిబ్బంది, మీడియా, పోలీసులు, పారిశుధ్య కార్మికులందరికీ ప్రజలంతా కృతజ్ఞతలు తెలపాలన్నారు. ఆదివారం సాయంత్రం 5గంటలకు ఇంటి బాల్కనీల్లో నిలబడి కరతాళ ధ్వనుల ద్వారా వారికి సంఘీభావం తెలుపుదామని పేర్కొన్నారు. ఆ రోజున హైదరాబాద్‌లోని తన నివాసంలో గంటా నాదం పేరిట.. కరోనా బాధితులకు సేవలు అందిస్తున్న వైద్యులు, పారామెడికల్, పోలీసులు, పారిశుధ్య కార్మికులు, మీడియాకు కృతజ్ఞతలు తెలియజేయనున్నట్లు పవన్ వెల్లడించారు.

# దర్శనాలు బంద్

## నిర్మానుష్యంగా తిరుమల కొండ

▸ 31 వరకూ శ్రీశైలంలో అన్నీ మూత.. పూర్తిగా నిలిచిన దుర్గమ్మ దర్శనాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కరోనా నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులకు దర్శనాలు నిలిచిపోయాయి. తిరుమలలో శ్రీవారి దర్శనానికి శుక్రవారం మధ్యాహ్నం వరకు భక్తులను అనుమతించారు. వారం రోజుల పాటు స్వామివారి దర్శనాలను ఆపివేస్తున్నట్టు టీటీడీ ప్రకటించింది. శుక్రవారం సుప్రభాతం, అభిషేకం సేవల్లో 809మంది పాల్గొన్నారు. ఆ తరువాత 265మంది వీఐపీ బ్రేక్ టికెట్లు ఉన్నవారు, శ్రీవాణి ట్రస్టు దాతలు స్వామిని దర్శించుకున్నారు. స్లాటెడ్ టోకెన్లు లేకపోయినా, మధ్యాహ్నం ఒంటిగంట వరకు అనుమతిస్తామని ప్రకటించడంతో భక్తులు, స్థానికులు నారాయణగిరి ఉద్యానవనం నుంచి క్యూలోకి ప్రవేశించి గంట వ్యవధిలో దర్శనం చేసుకున్నారు. సరిగ్గా ఒంటిగంటకు క్యూలైను ప్రవేశం మూసివేశారు. అప్పటిదాకా మొత్తం 5,684 మంది సామాన్య భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం బంగారు వాకిలి వద్ద పరదా మూసివేసి, ఆలయ ఉద్యోగులు, టీటీడీ సిబ్బందికి కూడా సన్నిధి వద్దకు అనుమతి నిరాకరించారు. జియ్యంగార్లు, ఏకాంగులు, అర్చకస్వాములు తదితర కైంకర్యపరులు మాత్రమే సన్నిధికి వెళ్లడానికి అనుమతి ఇచ్చారు. తిరుమలలోని వివిధ మఠాలు కూడా స్వచ్ఛందంగా మూతపడ్డాయి.

- శ్రీశైలంలో ఈ నెల 31 వరకు భక్తులకు దర్శనాలు నిలిపివేయాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. స్వామి అమ్మవార్లకు జరిగే నిత్య కైంకర్యాలన్నీ యథావిధిగా కొనసాగుతాయి. కాగా, శ్రీశైల ఆలయంలోకి భక్తులను 11 రోజుల పాటు అనుమతించకపోవడం ఇదే మొదటిసారిగా తెలుస్తోంది.
- కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్రస్వామి బృందావన దర్శనం శుక్రవారం నుంచి నిలిపివేశారు. ఈ నెల 31వరకు మఠం ముఖద్వారం, దర్శన ద్వారాలు మూసివేశారు.
- శ్రీకాకుళంలో అరసవల్లి ఆదిత్యుడి ఆలయానికి కరోనా ఎఫెక్ట్ తప్పలేదు. సుమారు 300ఏళ్ల కిందట ఈ ఆలయాన్ని నిర్మించగా, తొలిసారి స్వామి దర్శనానికి బ్రేక్ పడింది. ఈ నెల 31 వరకు తాత్కాలికంగా ఆలయాన్ని మూసివేశారు.
- బెజవాడ దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి దర్శనాలు నిలిపివేశారు. ఈ నెల 31వరకు భక్తులెవరినీ ఆలయంలోకి అనుమతించరు. ఇంద్రకీలాద్రి చరిత్రలో భక్తుల దర్శనాలు ఇన్నిరోజులు నిలిపివేయడం ఇదే మొదటిసారి.
- కరోనా కారణంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించనున్న 'మనగుడి' కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది.

### ఆలయాల మూసివేత కాదు

**భక్తులను అనుమతించడం లేదు: వెలంపల్లి**

అమరావతి: కరోనా నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లోకి భక్తులను అనుమతించడం లేదని దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. దేవుడికి నిత్యం చేసే నివేదనలు, పూజలు యథావిధిగా జరుగుతాయన్నారు. ఇది ఆలయాల మూసివేత కాదని, కేవలం భక్తులను అనుమతించకపోవడమేనన్నారు. అవకాశం ఉన్నచోట ఆలయాల్లో జరిపే సేవలను టీవీల్లో ప్రసారం చేస్తారని తెలిపారు. భక్తులు స్వచ్ఛందంగా దర్శనాలు వాయిదా వేసుకోవాలని కోరారు. 31వరకూ ఈ నిర్ణయాలు అమల్లో ఉంటాయన్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి సూచించిన విధంగా అనారోగ్య నివారణ జపహోమాదులు, పారాయణలు నిర్వహించాలని అధికారులకు సూచించినట్లు మంత్రి పేర్కొన్నారు.

## విజయవాడలో కరోనా పరీక్షలకు బ్రేక్!

▸ టెస్ట్‌లు ఫెయిల్ కావడంతో నిలిపివేత

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విజయవాడలో కరోనా నిర్ధారణ పరీక్షలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, కాకినాడలో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండగా... విజయవాడ ల్యాబ్ పూర్తిగా నిలిచిపోయింది. మొన్నటి వరకూ ల్యాబ్ బాగానే పని చేసినా రెండు రోజుల నుంచి కొన్ని పరీక్షలు విఫలమవుతున్నాయి. సిబ్బంది పూర్తిస్థాయిలో శిక్షణ తీసుకోకపోవడం వల్లే టెస్ట్‌లు ఫెయిల్ అవుతున్నట్లు సమాచారం. దీంతో వారికి మరోసారి శిక్షణ ఇప్పించిన తర్వాత ల్యాబ్‌ను ప్రారంభించాలని ఆరోగ్యశాఖ అధికారులు భావిస్తున్నారు.

### ▸ రమేశ్ ఆస్పత్రిలో 'టెలి ట్రయేజ్ సపోర్ట్ సెంటర్'

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా అనుమానితుల సంఖ్య పెరగడంతో ప్రైవేటు ఆస్పత్రులు కూడా రంగంలోకి దిగుతున్నాయి. రమేశ్ హాస్పిటల్స్ టెలిమెడిసిన్ సెంటర్ల ద్వారా కరోనా వైరస్ గురించి అధిక సమాచారం తెలుసుకోవడంతోపాటు వైద్య సందేహాలను నివృత్తిపరిచేందుకు 'టెలి ట్రయేజ్ సపోర్ట్ సెంటర్'ను ఆన్‌లైన్‌లో ప్రారంభించామని రమేశ్ హాస్పిటల్ ఎండీ డా.పి.రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 98488 68686 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

### ▸ నమాజ్‌కు రావొద్దు: ఇమామ్‌ల ఆదేశం

విజయవాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో నమాజ్‌ల కోసం మసీదులకు రావొద్దని ఇమామ్‌లు ఆదేశాలు జారీ చేశారు. పిల్లలు, పెద్దలు ఇళ్లలోనే నమాజ్‌లు చేసుకోవచ్చని ప్రకటించారు. శుక్రవారం మసీదుల్లో చేసే 45నిమిషాలు చేసే నమాజ్‌లను 15 నిమిషాలకు కుదించారు.

### ▸ కాలేజీలకు సెలవులు.. 'స్పాట్'కు బ్రేక్

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జూనియర్ కాలేజీలకు సెలవులు ప్రకటించారు. అదేవిధంగా ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌ను కూడా ఈ నెల 31 వరకు నిలిపేశారు.

### ▸ రేపు మందూ బంద్?

ప్రధాని మోదీ జనతా కర్ఫ్యూ పిలుపు నేపథ్యంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా మద్యం అమ్మకాలను కూడా నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. దీనిపై ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు, కలెక్టర్ల మధ్య చర్చ జరిగింది. దీనిపై శనివారం నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం.

### ▸ సమష్టి పోరుతోనే కరోనాపై విజయం: గవర్నర్

సమష్టి పోరుతోనే కరోనాపై విజయం సాధించగలమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. కరోనా వ్యాప్తిని నిరోధించే క్రమంలో వైద్య నిపుణులు సూచించిన అన్ని ముందు జాగ్రత్త చర్యలను పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలోనే ఉండాలని, ప్రయాణాలు విరమించుకోవాలని సూచించారు. ప్రధాని పిలుపుమేరకు జనతా కర్ఫ్యూకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సాధారణ పరిస్థితులు తిరిగి నెలకొనే వరకు అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, కరోనా వ్యాప్తి నేపథ్యంలో రాజ్‌భవన్ ప్రవేశంపై ప్రత్యేక ఆంక్షలు విధిస్తున్నట్లు గవర్నర్ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. ఉద్యోగులు సహా లోనికి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ భద్రతా సిబ్బంది థర్మల్, నాన్-టచ్ ఇన్‌ఫ్రారెడ్ థర్మామీటర్ల ద్వారా స్కానింగ్ చేస్తున్నారని చెప్పారు. నెలాఖరు వరకు గవర్నర్ తన పర్యటనలన్నీ రద్దు చేసుకున్నారని తెలిపారు.

### ▸ రేపు పలు రైళ్ల నిలిపివేత

చిత్తూరు, విశాఖ(ఆంధ్రజ్యోతి): జనతా కర్ఫ్యూ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ప్యాసింజర్ రైళ్ల సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాకేశ్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి 10గంటల వరకు సుమారు 2,400 ప్యాసింజర్ సర్వీసులు నిలిపేస్తున్నామన్నారు.

### ▸ రేపు పెట్రోల్ బంకులు మూత

గుంటూరు, మార్చి 20: 'జనతా కర్ఫ్యూ'కు ఏపీ ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్ సంఘీబావం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ఉదయం 7 నుంచి రాత్రి 9గంటల వరకు పెట్రోల్ బంకులు మూసివేస్తున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ తెలిపారు.




### కరోనా క్రాఫ్!!

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలంటూ విశాఖలోని గోపాలపట్నానికి చెందిన మహదేవ్ సెలూన్ యజమాని విజయ్‌కుమార్ వినూత్న రీతిలో సందేశం ఇచ్చాడు. తన దుకాణంలో పనిచేస్తున్న నీలయ్య అనే యువకుడి తలనే కాన్వాస్‌గా చేసుకుని 'టేక్ కేర్ కరోనా' అంటూ క్రాఫ్ చేసి అందరికీ సందేశాన్నిచ్చాడు. గతంలో కూడా పలు సందర్భాల్లో విజయ్‌కుమార్ ఇదే మాదిరి సందేశాలివ్వడం విశేషం. - గోపాలపట్నం

# భయం వద్దు... జాగ్రత్త ముఖ్యం

▸ 80.9% మందికి ఇంట్లోనే నయం

▸ రాష్ట్రంలో 3 కేసులు నమోదయ్యాయి

▸ కలెక్టర్లతో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 'కరోనా వల్ల మనుషులు పిట్టల్లా చనిపోతారన్న భయం నిజం కాదు. ఈ విషయంలో ఆందోళన వద్దు. ముందు జాగ్రత్తలతోనే వైరస్ సోకకుండా చూసుకోవచ్చు. 'నో టూ ప్యానిక్... ఎస్ టూ ప్రికాషన్స్' అన్నది నినాదం కావాలి. ప్రజల్లో అవగాహన పెంచితే అపోహలను తొలగించవచ్చు' అని సీఎం జగన్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో కరోనాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ, తమకు తెలియని సమాచారం ఇచ్చినా, కావాలని తప్పుడు సమాచారం ఇచ్చి ప్రజలను ఆందోళనకు గురిచేసినా గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యావసరాలకు కొరత ఉండదన్నారు. దుకాణాలు అందుబాటులో ఉంటాయని, వాటిని మూసివేయబోమన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిత్యావసరాల ధరలపై పర్యవేక్షణ చేయాలన్నారు. కరోనా సాకుగా ధరలు పెంచితే కఠినచర్యలు ఉంటాయన్నారు. దేశం మొత్తంమీద ఇప్పటి వరకూ 191 కేసులు నమోదైతే, రాష్ట్రంలో 3 మాత్రమే నమోదయ్యాయన్నారు. ఈ బాధితులు ఇటలీ, యూకే, సౌదీ నుంచి వచ్చారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 80.9శాతం మందికి ఇళ్లలోనే ఉంటూ, వైద్యం తీసుకోవడం ద్వారా నయమైందన్నారు. 13.8శాతం మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారని, 4.7శాతం కేసులు మాత్రమే ఐసీయూలో ఉంచాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఈ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. మీరు చేపడుతున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయంటూ కలెక్టర్లు, అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, ఆశా వర్కర్లు, వలంటీర్లను సీఎం ప్రశంసించారు.

### గ్రామానికి ఏఎన్ఎం, ఆశాలు

ప్రతి గ్రామ సచివాలయంలో ఒక ఏఎన్ఎం, ఇద్దరు ఆశా వర్కర్లతో పాటు ప్రతి 50ఇళ్లకు ఒక గ్రామ వలంటీర్ ఉన్నారని చెప్పారు. వాళ్ల ఫోన్లలో ఒక యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. విదేశాల నుంచి వచ్చినవారి వివరాలు, వారి కుటుంబ సభ్యుల సమాచారం, ఆరోగ్య పరిస్థితి తదితరాలపై వైద్యశాఖకు నిరంతరం సమాచారం పంపుతున్నామన్నారు. దానితో ఏఎన్ఎం, ఆశావర్కర్లు అప్రమత్తమవుతున్నారని చెప్పారు. 13 జిల్లాల కలెక్టర్లు సమర్థంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్సులకు కలెక్టర్లు కన్వీనర్లుగా, జిల్లా వైద్యాధికారి, డీసీహెచ్ఎస్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. నిరంతర పర్యవేక్షణ కోసం రోజూ టాస్క్‌ఫోర్స్ సమావేశం జరగాలన్నారు. హోం ఐసోలేషన్‌లో ఉన్నవారిని నిత్యం పర్యవేక్షించాలన్నారు. సామాజిక దూరం అమలుపై తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో నిండుగా ప్రయాణికులను తీసుకెళ్లడానికి వీల్లేదన్నారు. జిల్లా ఆస్పత్రులు, బోధనాస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డుల్లో కలెక్టర్లు తనిఖీ చేయాలన్నారు. రోగులకు ఇచ్చే మందుల్లో నాణ్యత ఉండాలన్నారు. కరోనా బాధితులు, వైద్య సిబ్బంది కచ్చితంగా మాస్క్‌లు వేసుకోవాలని జగన్ ఆదేశించారు. మాస్క్ వేసుకునేవాళ్లు, వాటిని సరైన పద్ధతిలో డిస్పోజ్ చేయాలని, కనీసం 5గంటలకు ఒకసారి మాస్క్‌ను మార్చాలని సీఎం సూచించారు.



### స్థానిక ఎన్నికలు జరగాల్సింది

'స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి ఉంటే, వ్యవస్థ మరింత బలోపేతంగా ఉండేవి. సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఉండేవాళ్లు. వీళ్లంతా ప్రజల తరఫున బాధ్యతగా ఉండేవాళ్లు. కరోనా నివారణ చర్యల్లో భాగస్వాములు అయ్యేవాళ్లు. దురదృష్టవశాత్తూ కొన్ని కారణాల వల్ల జరగలేదు. కానీ మనకు వలంటీర్లు, సచివాలయాల రూపంలో మంచి వ్యవస్థ ఉంది. వాటిని పూర్తిగా వాడుకోవాలి. రానున్న రోజుల్లో విలేజ్ క్లినిక్స్‌ను తీసుకొస్తున్నాం. ఈలోగా మన కున్న సిబ్బందిని సరిగ్గా వాడుకోవాలి. స్కూళ్లకు సెలవులు ప్రకటించడం, థియేటర్లు, మాల్స్ మూసివేయడం, దేవాలయాల్లో దర్శనాలు నిలిపివేత తదితర చర్యలన్నీ ముందస్తు జాగ్రత్త కోసమే. మార్చి 31వరకూ నిబంధనలు కొనసాగుతాయి' అన్నారు.

### జనతా కర్ఫ్యూకు సంఘీభావం

'జనతా కర్ఫ్యూ'కు సంఘీభావం తెలుపుదామని రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ పిలుపిచ్చారు. కరోనా నివారణలో భాగంగా ఆదివారం స్వీయ కర్ఫ్యూను విధించుకుందామని.. తద్వారా కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చంటూ ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును ఆచరిద్దామన్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రులతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సీఎస్ నీలం సాహ్ని, సీఎంవో ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, అదనపు సీఎస్ పీవీ రమేశ్, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు సీఎం జగన్ బహిరంగ లేఖ రాశారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు.

# లండన్‌లో తెలుగు విద్యార్థుల కష్టాలు

▸ కరోనా ప్రభావంతో వర్సిటీలకు తాళం

▸ 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి వాట్సాప్ సందేశాలు

విజయవాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరోనా ప్రభావంతో వివిధ దేశాల్లో చదువుతున్న తెలుగు విద్యార్థులు నానా కష్టాలు పడుతున్నారు. పలువురు తెలుగు విద్యార్థులు లండన్‌లోని హెర్‌ఫోర్డ్‌షైర్ యూనివర్సిటీలో చదువుతున్నారు. కరోనా ప్రభావంతో యూనివర్సిటీ మూతపడటంతో సుమారు 100 మంది విద్యార్థులు స్వదేశాలకు పయనమయ్యారు. భారత్‌కు వచ్చేందుకు ఈ నెల 20న విమాన టికెట్లు బుక్ చేసుకున్నారు. వీరంతా విమానాశ్రయం చేరుకున్న తర్వాత అక్కడి అధికారులు వీరిని బోర్డింగ్‌కు అనుమతించలేదు. భారత్‌కు విమానాలు నిలిపివేశామని చెప్పడంతో తెలుగు విద్యార్థులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. వీరంతా తెలంగాణ, ఏపీకి చెందిన విద్యార్థులే. తమను వెంటనే భారత్‌కు పంపేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేసమయంలో తమగోడును 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి వాట్సాప్ సందేశాల ద్వారా వెళ్లబోసుకున్నారు. తమ దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమను ఆదుకోవాలని కోరారు. కరోనా కారణంగా తాము చేస్తున్న పార్ట్‌టైం ఉద్యోగాలు పోయాయని, దీంతో లండన్‌లో ఉండేందుకు తమ ఆర్థిక స్థోమత సరిపోదని, ఇండియాకు తిరిగి రావడం తప్ప తమకు వేరే దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### వారిని రప్పించండి

న్యూఢిల్లీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మలేషియాలోని కౌలాలంపూర్‌లో చిక్కుకున్న తెలుగువారిని స్వదేశానికి రప్పించాలని చిత్తూరు ఎంపీ ఎన్ రెడ్డప్ప, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్‌కు శుక్రవారం లేఖ రాసిన రెడ్డప్ప.. తన పార్లమెంటు నియోజవర్గం, కుప్పం సెగ్మెంట్ పరిధిలోని అనిమిగానిపల్లి గ్రామానికి చెందిన 80 మంది టూరిస్ట్ వీసాతో వెళ్లి అక్కడ చిక్కుకున్నారని తెలిపారు. ఎంపీ సత్యనారాయణ కూడా మలేషియాలో చిక్కుకున్న 41 మంది కోసం జైశంకర్‌కు లేఖ రాశారు.


లండన్‌లోని భారత ఎంబసీలో తెలుగు విద్యార్థులు

### ఫిలిప్పీన్స్ నుంచి తీసుకురండి: గల్లా

కరోనా కారణంగా ఫిలిప్పీన్స్‌లో చిక్కుకున్న 146 మంది భారత విద్యార్థులను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కువైత్ నుంచి 160 మంది తెలుగోళ్ల బహిష్కరణ

**వీరిలో అత్యధికులు కడప జిల్లావాసులే**

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కరోనా మహమ్మారి నిర్మూలనలో భాగంగా గల్ఫ్ దేశమైన కువైత్.. విదేశీయులను అరెస్టుచేసి దేశం నుంచి బహిష్కరిస్తోంది. వారిని స్వదేశాలకు పంపిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల సుమారు 350 మందిని అరెస్టుచేసింది. వీరిని ప్రత్యేక విమానంలో భారత్‌కు తరలించింది. వీరిలో 160మందికిపైగా తెలుగువాళ్లే. వీరిలో అత్యధికులు కడప జిల్లావాసులని తెలిసింది. వీరిలో చెన్నూరు ప్రాంతానికి చెందిన రెండేళ్ల పసిపాప కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పాపకు జన్మనిచ్చిన తల్లి ఆ పాపను ఆస్పత్రిలోనే వదిలేసి పారిపోగా.. ఆ తర్వాత కువైత్ పోలీసులు అరెస్టుచేసి జైల్లో ఉంచారు. ప్రత్యేక విమానంలో వీరిద్దరిని కూడా పంపినట్లు తెలిసింది. ప్రస్తుతం కువైత్ నుంచి విమానాల రాకపోకలపై నిషేధం ఉంది. అయితే కువైత్ అమీర్ (రాజు) ఇచ్చిన ప్రత్యేక అనుమతితో 350 మంది భారతీయులతో శుక్రవారం రాత్రి ఈ విమానం బయల్దేరినట్లు సమాచారం. శనివారం ఉదయం ముంబై విమానాశ్రయానికి వీరంతా చేరుకుంటారు. అక్కడ వారిని 14 రోజులపాటు క్వారంటైన్‌లో ఉంచనున్నారు.

# నో 'షేర్ ఓలా'

### కరోనా నేపథ్యంలో షేర్ రైడ్ నిలిపివేత




న్యూఢిల్లీ, మార్చి 20: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం చేసిన 'సామాజిక దూరం' సూచనను అనుసరించి 'ఓలా' సంస్థ.. 'షేర్ రైడింగ్'లపై తాత్కాలికంగా నిషేధం విధించింది. కస్టమర్ల సౌకర్యార్థం ఓలా ప్రవేశపెట్టిన 'ఓలా షేర్' సర్వీసును తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిలిపివేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. కాగా, కరోనా ప్రభావంతో ఓలా, ఉబర్ కార్లకు గడచిన రెండు వారాల్లో 50 శాతం మేర డిమాండ్ పడిపోయింది. దీంతో ఈ సంస్థలు ఎప్పుడూ లేనంతగా చార్జీలను తగ్గించాయి.

# పార్లమెంటుకు కరోనా సెగ

(మొదటిపేజీ తరువాయి)

వసుంధర రాజె, ఆమె తనయుడు, బీజేపీ ఎంపీ అయిన దుష్యంత్ సింగ్, యూపీ ఆరోగ్యమంత్రి జైప్రతాప్ సింగ్, కాంగ్రెస్ నేత జితిన్‌ప్రసాద తదితరులు హాజరయ్యారు. తాజాగా.. కనికాకపూర్‌కు వైరస్ పాజిటివ్ రావడంతో ఆ పార్టీకి హాజరైనవారంతా అప్రమత్తమయ్యారు. వసుంధర రాజె, దుష్యంత్ సింగ్ ఇద్దరూ హోం క్వారంటైన్‌లోకి వెళ్లిపోయారు. అయితే.. కనిక ఇచ్చిన పార్టీకి హాజరైన తర్వాత దుష్యంత్ సింగ్ పార్లమెంటుకు వెళ్లారు. పలువురు ఎంపీలను కలిశారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను సైతం ఆయన కలిశారు. ఇప్పుడు కనికకు పాజిటివ్ రావడం, దుష్యంత్ క్వారంటైన్‌లోకి వెళ్లడంతో ఎంపీలంతా అప్రమత్తమైపోయారు. మరీ ముఖ్యంగా.. సభలో ఆయనకు సమీపంలో కూర్చునే ఎంపీలు, ఇటీవలికాలంలో ఆయనను తాకి మాట్లాడినవారు.. ఇలా చాలా మంది స్వీయ క్వారంటైన్‌లోకి వెళ్తున్నట్టు సమాచారం. టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ, అప్నాదళ్ ఎంపీ అనుప్రియా పటేల్, కాంగ్రెస్ నేతలు జితిన్ ప్రసాద, దీపేందర్ హుడా ఇలా స్వీయక్వారంటైన్‌లోకి వెళ్లినవారిలో ఉన్నారు. ఆ పార్టీకి హాజరైన యూపీ ఆరోగ్య మంత్రి జైప్రతాప్ సింగ్ కూడా ప్రస్తుతం స్వీయ క్వారంటైన్‌లో ఉన్నారు. కాగా.. యూకే నుంచి వచ్చినప్పుడు స్క్రీనింగ్‌ను తప్పించుకున్నందుకు కనికాకపూర్‌పై 'ఎపిడమిక్ యాక్ట్' ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, లఖ్‌నవులో ఆమె బస చేసిన తాజ్ హోటల్‌ను తదుపరి ఆదేశాలిచ్చే దాకా మూసివేయాలని లఖ్‌నవు డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ అభిషేక్ ప్రకాశ్ ఆదేశించారు. అయితే.. విమానాశ్రయంలో తనకు థర్మల్ స్క్రీనింగ్ చేశారని, ఆ తర్వాతే బయటకు వచ్చానని.. ఇందులో తన తప్పేంలేదని కనిక చెబుతోంది. తాజ్‌హోటల్‌లోనే కాక.. కనిక బస చేసిన మరో భవనంలో ఒకరికి వైరస్ పాజిటివ్‌గా తేలడం గమనార్హం. 14వ తేదీన ఆమె కాన్పూర్‌లో తన బంధువు ఇంట్లో శుభకార్యానికి వెళ్లినట్టు సమాచారం. మార్చి 13, 14, 15 తేదీల్లో జరిగిన పార్టీల్లో ఆమె కనీసం 400 మందిని కలిసినట్టు కనిక తండ్రి తెలిపారు. కానీ, తాను అంతమందిని కలవలేదని కనిక తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో లఖ్‌నవు, నోయిడా, కాన్పూర్ నగరాలను పూర్తిగా శానిటైజ్ చేయాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు.

## రాష్ట్రపతికి కోవిడ్ పరీక్ష

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు శనివారంనాడు కరోనా పరీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం. రాష్ట్రపతి భవన్ వర్గాలను ఉటంకిస్తూ ఇండో-ఏసియన్ న్యూస్ సర్వీస్ సంస్థ ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. బాలీవుడ్ గాయని కనికాకపూర్‌తోపాటు ఒక పార్టీకి హాజరైన ఎంపీ దుష్యంత్ సింగ్.. యూపీ, రాజస్థాన్ ఎంపీలకు మార్చి 18న రాష్ట్రపతి ఇచ్చిన అల్పాహార విందుకు హాజరయ్యారు. కనికకు కొవిడ్-19 పాజిటివ్ రావడంతో దుష్యంత్ సింగ్ స్వీయ క్వారంటైన్‌లోకి వెళ్లారు. రాష్ట్రపతి భవన్ వర్గాలు కూడా ఈ పరిణామాలతో అప్రమత్తమై ప్రెసిడెంట్ కోవింద్‌కు కరోనా పరీక్షనిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. 18న రాష్ట్రపతి ఇచ్చిన అల్పాహార విందుకు దుష్యంత్ సింగ్‌తో పాటు.. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జనరల్ వీకే సింగ్, గజేంద్రషెకావత్, అర్జున్‌రామ్ మేఘవాల్, కైలాశ్‌చౌదరి, సాధ్వి నిరంజన్ జ్యోతి, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, విజయ్ గోయెల్, హేమమాలిని, రీటా బహుగుణ జోషి, సాక్షి మహరాజ్ తదితరులు హాజరయ్యారు.




పార్టీలో.. 1) దుష్యంత్ సింగ్ 2) వసుంధరా రాజె 3) కనికా కపూర్

# ఒక్క రోజులో 46 మందికి

## దేశంలో 236కు చేరిన కరోనా కేసులు.. నేటి అర్ధరాత్రి నుంచి రేపు రాత్రి 10 దాకా రైళ్లు బంద్

న్యూఢిల్లీ, మార్చి 20: దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 236కు చేరింది. శుక్రవారం ఒక్కరోజే 46 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో కొత్తగా మూడు కేసులు నమోదయ్యాయి. దేశంలో అత్యధికంగా ఆ రాష్ట్రంలో బాధితుల సంఖ్య 52కు చేరింది. పశ్చిమ బెంగాల్‌లో రెండో పాజిటివ్ కేసు నమోదైంది. యూకేలో చదువుతున్న 22 ఏళ్ల యువకుడు.. మార్చి 13న కోల్‌కతాకు వచ్చిన తర్వాత అతడికి వైరస్ సోకినట్టు అధికారులు గుర్తించారు. వచ్చినరోజు నుంచీ మార్చి 19 దాకా.. అతడు జనసమ్మర్ద ప్రదేశాలకు వెళ్లాడని తెలిపారు. అతణ్ని, అతడి కుటుంబ సభ్యులను, స్నేహితులను క్వారంటైన్‌లో ఉంచినట్టు తెలిపారు. లద్దాఖ్‌లో కొత్తగా రెండు పాజిటివ్ కేసుల నమోదుతో బాధితుల సంఖ్య పదికి పెరిగింది. గుజరాత్‌లో మూడు కొత్త కేసులు నమోదు కాగా.. బాధితుల సంఖ్య ఐదుకు పెరిగింది. దేశవ్యాప్తంగా.. వైరస్ బారిన పడిన వారితో సన్నిహితంగా మెలిగిన 6700 మందిపై నిఘా పెట్టినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. నిత్యావసర వస్తువులకు ఎటువంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రజలను కోరింది. 144 సెక్షన్ విధించినా ఆన్‌లైన్, హోల్‌సేల్ వ్యాపారులు, వారి డెలివరీ భాగస్వాములు తమ కార్యకలాపాలను కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. కాగా.. శుక్రవారం వరకూ 13,486 మందికి సంబంధించిన 14,376 నమూనాలను పరీక్షించినట్లు ఐసీఎంఆర్ తెలిపింది. కరోనాకు సంబంధించిన ఎలాంటి సందేహాలున్నా టోల్‌ఫ్రీ నంబర్ 1075కు ఫోన్ చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి లవ్ అగర్వాల్ ప్రజలకు సూచించారు. కాగా.. కరోనా వైరస్ బారిన పడి, దాన్నుంచి పూర్తిగా కోలుకున్న ఇటలీవాసి (69) శుక్రవారంనాడు జైపూర్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో గుండె ఆగి (కార్డియాక్ అరెస్ట్) మరణించారు. ఆయన మరణానికి కారణం కరోనా కాదు కాబట్టి దేశంలో కరోనా మృతుల సంఖ్య ప్రస్తుతానికి నాలుగేనని లవ్ అగర్వాల్ స్పష్టం చేశారు. దేశంలో కరోనా వ్యాప్తి సామాజిక స్థాయికి చేరలేదని కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ లోక్‌సభలో చెప్పారు.





అందాల పోటీలకు మాస్క్‌లతో భామలు; నవజాత శిశువుకు మాస్క్ తొడుగుతున్న తల్లి

### రైళ్లకు బ్రేకులు

ఆదివారం నాడు దేశ ప్రజలంతా జనతా కర్ఫ్యూ పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి 10 గంటల వరకు రైళ్లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. 1,300కు పైగా మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దవుతాయని తెలిపింది. శనివారం అర్ధరాత్రి సమయానికి ప్రయాణం కొనసాగిస్తున్న రైళ్లను మాత్రం గమ్యం చేరేవరకూ అనుమతిస్తారు. రైళ్లను మాత్రమే కాదు.. మెయిల్/ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఆన్‌బోర్డ్ కేటరింగ్ (రైళ్లల్లో ఆహార సేవల)ను కూడా ఆదివారం నుంచి తదుపరి నోటీసులు జారీ చేసేంతవరకూ నిలిపివేయాల్సిందిగా ఇండియన్ రైల్వేస్ ఐఆర్‌సీటీసీని ఆదేశించింది. కాగా 50 ఏళ్లు దాటి, మధుమేహం, శ్వాసకోశ సమస్యలు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న కేంద్ర ఉద్యోగులకు సెలవు నిబంధనలను సడలిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముందు జాగ్రత్త చర్యగా స్వీయ క్వారంటైన్‌లో ఉంటామని చెప్పిన అధికారులకు సెలవు మంజూరు చేయాల్సిందిగా అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాలకూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సడలింపులు ఏప్రిల్ 4 దాకా అమల్లో ఉంటాయి. అలాగే.. రిటైర్ అయిపోయిన తర్వాత కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే కాంట్రాక్టు సిబ్బంది కూడా ఇంటి నుంచే పనిచేయాల్సిందిగా కోరారు. అలాగే విమానాల రాకపోకలపై కరోనా ఆంక్షల కారణంగా మన దేశం నుంచి తమ దేశాలకు వెళ్లలేకపోతున్న విదేశీయుల వీసాల గడువును ఏప్రిల్ 15 దాకా పొడిగించాలని కేంద్రం నిర్ణయించింది.

### రోజుకు కోటిన్నర మాస్కులు..

మార్కెట్లో ఒకవైపు మాస్కుల కొరత విపరీతంగా ఉంది. గతంలో రూ.5కు విక్రయించే మాస్కులను సైతం రూ.80 దాకా అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో.. కొరతను నివారించేందుకు మాస్కుల ఉత్పత్తిని ప్రారంభించినట్టు కేంద్రం రాజ్యసభలో ప్రకటించింది.

### చైనాతో పోలిక వద్దు: కిషన్ రెడ్డి

కరోనాపై పోరు విషయంలో చైనాతో పోలిక వద్దని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చైనాలోని మిలటరీ వ్యవస్థ సామాజిక దూరం పాటించేలా ప్రజలను ఒత్తిడి చేయగలిగిందని ఆయన పేర్కొన్నారు. 'ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న రెండో దేశం మనది. ఇన్ఫెక్షన్‌ను ఆపడానికి ప్రస్తుతానికి మనవద్ద ఉన్న ఏకైక ఔషధం మరిన్ని ముందుజాగ్రత్తలు తీసుకోవడం, సామాజిక దూరాన్ని పాటించడం. అందరం కలిసి కరోనాపై పోరాడాలి. రాజకీయ పార్టీలు అనవసర విమర్శలు మాని కలిసి పనిచేయాలి' అని ఆయన వివరించారు. అంతేకాదు.. విదేశాల నుంచి వచ్చేవారిని క్వారంటైన్‌లో ఉంచాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వారి తల్లిదండ్రులు అడ్డుపడొద్దని ఆయన కోరారు. కాగా.. కరోనా కట్టడి మార్గాలపై 10 దేశాల అధికారులతో చైనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ భారత్ పాల్గొంది. కరోనా నియంత్రణలో భాగంగా మార్చి 18 నుంచి.. యూరోపియన్ యూనియన్ తదితర దేశాల నుంచి విమానాల రాకపోకలపై విధించిన నిషేధాన్ని సవాల్‌చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. స్కాట్లాండులో చిక్కుకుపోయిన ఓ యువకుడి తండ్రి ఈ వ్యాజ్యం వేశారు.

### రైల్వే అధికారిణి సస్పెన్షన్

జర్మనీ నుంచి వచ్చిన తన కుమారుడి గురించి అధికారులకు చెప్పకోగా.. అతణ్ని రైల్వే గెస్ట్‌హౌస్‌లో పెట్టినందుకు నైరుతి రైల్వేకు చెందిన ఒక మహిళా అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మార్చి 13న భారత్‌కు వచ్చిన ఆ యువకుడికి వైద్యులు పరీక్ష చేయగా.. కరోనా పాజిటివ్ అని మార్చి 18న తేలింది. తన కుమారుడిని కాపాడుకోవడానికి అందరి ప్రాణాలనూ ఆమె ప్రమాదంలో పడేశారని రైల్వే శాఖ ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. చండీగఢ్‌లో కరోనా అనుమానిత లక్షణాలతో చికిత్స పొందుతున్న మహిళ ఆస్పత్రి నుంచి పారిపోయింది. పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి ఆమె కోసం గాలిస్తున్నారు.

# కాలిఫోర్నియా లాక్‌డౌన్

## 4 కోట్ల మంది ఇళ్లకే పరిమితం.. అమెరికాలో 200 దాటిన కరోనా మృతులు

### ఇరాన్‌లో కొవిడ్‌తో పది నిమిషాలకో మృతి.. ప్రపంచవ్యాప్తంగా 11,015 మరణాలు

కాలిఫోర్నియా/న్యూయార్క్, మార్చి 20: అగ్రరాజ్యం అమెరికాలో రాష్ట్రాలకు రాష్ట్రాలు లాక్‌డౌన్ ప్రకటించాల్సినంతటి పరిస్థితి తలెత్తుతోంది. కొవిడ్ కారణంగా పాజిటివ్ కేసులు 15 వేలకు, ఒక్క రోజులోనే 70 కలుపుకుని మరణాల సంఖ్య 218కి చేరింది. కాలిఫోర్నియా రాష్ట్రం మొత్తం లాక్‌డౌన్ ప్రకటించారు. రాష్ట్రాల గవర్నర్లతో ట్రంప్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్త చట్టం ద్వారా ఏడాదికి 75వేల డాలర్ల కంటే తక్కువ ఆర్జించే వారికి 1,200డాలర్లు ఇవ్వనున్నారు. అంతర్జాతీయ ప్రయాణాలు మానుకోవాలని, విదేశాల నుంచి తక్షణమే తిరిగి రావాలని పౌరులకు సూచించారు. దేశంలో నాలుగో దశ ఆరోగ్య సూచిక జారీ చేశారు. వీసా సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. ఉద్యోగులందరూ ఇంటివద్దనే ఉండాలని న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ కుమోమో కోరారు.

### సంపూర్ణ లాక్‌డౌన్‌కు ప్రతిపాదన

దేశం మొత్తం లాక్‌డౌన్ విధించాలని, సెల్ఫ్ క్వారంటైన్ చేయాలని ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాలను అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఏఏపీఐ) అభ్యర్థించింది. తెలుగువాడైన సురేష్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉన్న ఈ సంఘంలో లక్షమంది వైద్యులు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వాల నిర్ణయాలను ప్రభావితం చేయగలదిగా ఏఏపీఐకి పేరుంది. అమెరికా సమాజంతో పాటు ఆరోగ్య, ఆర్థిక వ్యవస్థలపై కరోనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని సురేష్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా మరణాల సంఖ్య 11,015కి చేరింది. కొత్తగా ముగ్గురు చనిపోయినా.. చైనాలో వరుసగా రెండో రోజూ ఒక్క పాజిటివ్ కేసూ నమోదు కాలేదు. కొత్తగా 627 మందితో కలిపి ఇటలీలో మరణాలు 4 వేలు దాటాయి. స్పెయిన్‌లో 235 మంది చనిపోయారు. శ్రీలంకలో సోమవారం వరకు సాయంత్రం 6నుంచి ఉదయం 6గంటల మధ్య కర్ఫ్యూ విధించారు. ప్రతి పది నిమిషాలకో కరోనా మరణం నమోదవుతోందని, 50 మంది వైరస్‌కు గురవుతున్నారని ఇరాన్ ప్రకటించింది. పాకిస్థాన్‌లో మరణాల సంఖ్య మూడుకు చేరింది. బ్రిటన్‌లో చిక్కుకున్న భారతీయులకు సాయం చేస్తామని హైకమిషన్ తెలిపింది.

### చైనా నిర్లక్ష్యానికి భారీ మూల్యం: ట్రంప్

కరోనా ప్రాథమిక దశలో ఉండగానే.. చెప్పకుండా చైనా చేసిన తప్పునకు ప్రపంచం భారీ మూల్యం చెల్లిస్తోందని ట్రంప్ అన్నారు. ప్రస్తుత పరిస్థితికి చైనాదే బాధ్యతని, 'నెలల ముందే తెలిసిఉంటే బాగుండేదని, చైనాలోని ఆ ఒక్కచోటుతోనే నిరోధించేవాళ్లం' అని పేర్కొన్నారు. అయితే, 'అమెరికాలోని కొంతమంది వైరస్‌పై మా పోరాటాన్ని తగ్గించి చూపేయత్నం చేస్తున్నారని, నెపాన్ని తమపై నెట్టేస్తున్నారని చైనా దీటుగా బదులిచ్చింది.

| దేశాల వారీ మరణాల పట్టిక | ఇటలీ | చైనా | ఇరాన్ | స్పెయిన్ | ఫ్రాన్స్ | అమెరికా |
|---|---|---|---|---|---|---|
| | 4,032 | 3,248 | 1,433 | 1,002 | 372 | 218 |

## సామాజిక దూరం పాటించేలా చూడండి

- కరోనా కట్టడికి నిరంతర నిఘా ముఖ్యం
- సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ కట్టడికి ప్రజలు సామాజిక దూరం పాటించేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రులను కోరారు. మహమ్మారి నియంత్రణకు ఇది చాలా ముఖ్యమని చెప్పారు. బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించాలని, ధరలకు రెక్కలు రాకుండా చూడాలని, దీనికి వర్తక సంఘాలతో సీఎంలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సూచించారు. గురువారం వివిధ రాష్ట్రాల సీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా నియంత్రణ చర్యలపై చర్చించారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని, ప్రజలు, స్థానిక అధికారుల భాగస్వామ్యం, నిరంతర నిఘా చాలా అవసరమని ప్రధాని చెప్పారు. వైరస్ పరీక్షా కేంద్రాలను పెంచాలని, బలహీన వర్గాలకు మరింత సహాయం అందించాలని, రాష్ట్రాలకు 2020-21 నిధులను ముందుగా ఇవ్వాలని, ప్రైవేటు ల్యాబ్‌లు, ఆస్పత్రుల సేవలను ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని సీఎంలు వివరించారు. తమ రాష్ట్రాల్లో చేపట్టిన చర్యలను తెలిపారు. దీనికి ప్రధాని ప్రశంసిస్తూ... రాష్ట్రాల్లో అనుభవాలను పంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. జనతా కర్ఫ్యూ పిలుపునకు రాజకీయ పార్టీలకు అతీతంగా లభిస్తున్న మద్దతుపై శుక్రవారం ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

### 'మిడ్ డే మీల్స్' మిస్ చేయొద్దు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 20: కరోనా వ్యాప్తి నేపథ్యంలో స్కూళ్లకు సెలవులు ప్రకటించినా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం యథావిధిగా అందించాలని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ రాష్ట్రాలను ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### యూపీఎస్సీ ఇంటర్వ్యూలు వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 20: ఈనెల 23 నుంచి ఏప్రిల్ 3 వరకు జరగాల్సిన 2019 సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలను కరోనా నేపథ్యంలో యూపీఎస్సీ వాయిదా వేసింది. తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చెప్పింది.

### బ్రాడ్‌బ్యాండ్‌పై కరోనా పంజా

న్యూఢిల్లీ, మార్చి 20: బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ డేటా వినియోగంపైనా కరోనా ప్రభావం తీవ్రంగా ఉంది. బహుళ జాతి సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, బీపీవోలు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం వెసులుబాటు కల్పించాయి. దీంతో డేటా వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. కార్యాలయాల్లో హైస్పీడ్ డేటా సదుపాయం ఉండగా.. ప్రధాన నగరాల్లోని ఉద్యోగుల ఇళ్లలో 20-100 ఎంబీపీఎస్ మధ్య వేగంతో మాత్రమే డేటా సేవలు అందుబాటులో ఉన్నాయి. 'సగటు వినియోగదారుడు నెలకు 10.37 గిగాబైట్ల డేటాను వాడుతాడు. కరోనా నేపథ్యంలో ఆ డిమాండ్ 15% పెరిగింది. డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది" అని బ్రాడ్ బ్యాండ్ ఇండియా ఫోరం (బీఐఎఫ్) అధ్యక్షుడు టీవీ రామచంద్రన్ వెల్లడించారు. సర్వీస్ ప్రొవైడర్లు, మొబైల్ సంస్థలు అదనపు స్పెక్ట్రమ్ కోరుతున్నాయన్నారు.

### కరోనా టీకాకు సూపర్ కంప్యూటర్ సాయం

వాషింగ్టన్, మార్చి 20: కరోనా టీకాను కనుగొనడానికి శాస్త్రవేత్తలు అహర్నిశలు కృషి చేస్తున్నారు. వారితో పాటుగానే ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్ 'సమ్మిట్' శ్రమిస్తోంది. అమెరికాలోని ఓక్రిడ్జ్ నేషనల్ ల్యాబ్‌లో కొన్ని వేల రసాయనాల చర్యలను పరీక్షించింది టీకా తయారీకి అనువైన 77 రసాయన సమ్మేళనాలను గుర్తించింది. వీటి ఆధారంగా శాస్త్రవేత్తలు టీకాలను అభివృద్ధి చేసి పరీక్షించనున్నారు.

### ఎంపీలు వైద్యుల్లాంటివారు!: పీయూష్

న్యూఢిల్లీ, మార్చి 20: కరోనాపై యుద్ధంలో ప్రధాని నరేంద్ర మోదీపై విశ్వాసం వ్యక్తం చేయడంతో పాటు సంఘీభావం తెలుపుతూ శుక్రవారం రాజ్యసభ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ ప్రశ్నకు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ బదులిస్తూ పార్లమెంటేరియన్లు దేశం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. "దేశంలో 65 ఏళ్లు దాటినవారు బయటకు రాకూడదని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నేనూ రాజ్యసభ చైర్మన్ 65 ఏళ్లు పైబడినవాళ్లమే. మనం చేసే చట్టాలకు మనం అతీతులమా? చట్టాలను గౌరవించడంలో పార్లమెంటు ఏం ఆదర్శంగా ఉన్నట్లు? పోనీ ఏవైనా మినహాయింపులు ఇచ్చారా?" అని ఆనంద్ శర్మ ప్రశ్నించారు. గోయల్ స్పందిస్తూ దేశానికి సేవ చేస్తున్న 65 ఏళ్లు దాటిన వైద్యుల్లానే ఎంపీలు కూడా అని అన్నారు.

### కేరళలో ఉచిత బియ్యం..

తిరువనంతపురం, మార్చి 20: కరోనా సంక్షోభంలో ప్రజలకు అండగా నిలబడేందుకు కేరళ ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ఈ మొత్తాన్ని ఉచిత రేషన్, రుణ సహాయం, సంక్షేమ పెన్షన్లు, రాయితీపై భోజనం, వైద్య సేవలు, ఉపాధి హామీ పథకం కోసం వెచ్చిస్తామని సీఎం పినరయి విజయన్ ప్రకటించారు. అవసరమైన కుటుంబాలకు రుణాలు ఇచ్చేందుకు రూ.2 వేల కోట్లు అందుబాటులో ఉంచుతామని, కుటుంబ శ్రీ నెట్‌వర్క్ ద్వారా రుణాలిస్తామని వెల్లడించారు. అందరికీ ఉచితంగా 10 కేజీల బియ్యం ఇస్తామన్నారు. రూ.20కే భోజనం అందించేందుకు వెయ్యి హోటళ్లు తెరుస్తామని చెప్పారు. కరోనాపై యుద్ధానికి రాష్ట్రంలో ప్రభుత్వం, ప్రతిపక్షం చేతులు కలిపాయి. సీఎం విజయన్, ప్రతిపక్ష నేత రమేశ్ చెన్నితాల ఉమ్మడిగా విలేకరుల సమావేశం నిర్వహించారు. వెయ్యి మంది పైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లోనూ పాల్గొన్నారు. కేరళ ప్రభుత్వ చర్యలపై ప్రశంసలు వస్తున్నాయి.

### రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు చంద్రబాబు

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. కరోనా నేపథ్యంలో ఆయన విజయవాడ నుంచి విమానంలో కాకుండా.. రోడ్డు మార్గంలో వచ్చారు. మధ్యాహ్నం పార్టీ ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన తనయుడు లోకేశ్ కూడా రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వచ్చారు.

### 'ఆన్‌లైన్లో మద్యం' అనుమతించండి

- హైకోర్టులో మందుబాబు పిటిషన్
- రూ.50 వేల జరిమానా విధించిన జడ్జి

తిరువనంతపురం (కేరళ), మార్చి 20: 'పీత కష్టాలు పీతవి' అన్నట్టు.. కరోనా నేపథ్యంలో ఒక్కొక్కరివి ఒక్కో రకమైన కష్టాలు. కేరళలోని ఓ మందుబాబు.. మద్యం షాపుల వద్ద రద్దీ ఎక్కువగా ఉంటోందని, కరోనా భయంతో తనలాంటి వాళ్లు షాపులకు వెళ్లలేకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ కోర్టుమెట్లెక్కాడు. మద్యాన్ని ఆన్‌లైన్ ద్వారా ఇళ్లకే సరఫరా చేసేలా బేవరేజస్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ అక్కడి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జడ్జి.. పిటిషనర్‌కి 50 వేల రూపాయలు జరిమానా విధించారు. "ఇందులో పిటిషనర్, అతడి లాంటి వాళ్ల స్వార్థం తప్ప, ఎలాంటి ప్రయోజనాలూ లేవు" అని వ్యాఖ్యానించిన జడ్జి.. పిటిషన్‌ను తోసిపుచ్చారు.



'ఒక ప్రదేశంలో కరోనా వైరస్ జీవితం 12 గంటలు. జనతా కర్ఫ్యూ 14 గంటలు. కాబట్టి కరోనా బతికి ఉన్న బహిరంగ ప్రదేశాలు 14 గంటల తర్వాత కరోనా వైరస్ లేని ప్రాంతాలుగా మారతాయి. అప్పుడు మనం ఆ ప్రదేశాలను తాకినా వైరస్ అంటుకోదు'

## 14 గంటలు ఇంట్లో ఉంటే

# వైరస్ గొలుసు తెగుతుందా?

..శుక్రవారం ఉదయం నుంచి వాట్సాప్‌లో, ఫేస్‌బుక్‌లో విస్తృతంగా ప్రచారమవుతున్న మెసేజ్ ఇది. నిజానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చిన 'జనతా కర్ఫ్యూ' ఉద్దేశం చాలా మంచిది. కానీ, వైరస్ మనుగడ 12 గంటలేనంటూ వస్తున్న ఈ సందేశాలను నమ్మవద్దని వైద్యనిపుణులు, శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు. కరోనా ఏ ఉపరితలంపై ఎంతసేపు మనుగడ సాగించగలదనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, ప్రిన్స్‌టన్ వర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అలర్జీ అండ్ ఇన్‌ఫెక్షస్ డిసీజెస్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (హామిల్టన్), సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తదితర సంస్థల శాస్త్రజ్ఞుల అధ్యయనం ప్రకారం.. ఈ వైరస్ రాగి ఉపరితలంపై 4 గంటల దాకా, ప్యాకేజింగ్‌కు వాడే అట్టపెట్టెలపై 24 గంటల వరకూ ఉంటుంది. ప్లాస్టిక్, స్టెయిన్‌లెస్ స్టీల్ వస్తువులపై 2 నుంచి 3 రోజుల పాటు, అల్యూమినియం, చెక్క, పేపర్‌పై 5 రోజుల దాకా బతకగలదు. అంటే.. మనం 14 గంటలపాటు ఇంట్లోనే ఉన్నంత మాత్రాన వైరస్ ఉన్న ప్రాంతాలు వైరస్‌లేని ప్రాంతాలుగా మారిపోవు. వైరస్ సోకిన వ్యక్తులకు వారి శరీరతత్వాన్ని బట్టి 4 నుంచి 14 రోజుల దాకా ఎలాంటి లక్షణాలూ కనపడవు. ఆ సమయంలో వారు క్యారియర్లుగా ఉంటారు. అంటే.. వారి నుంచి వైరస్ మరొకరికి పాకుతుంది. కాబట్టి.. ఆ 14 గంటలే కాక, వైరస్ ముప్పు తగ్గే వరకూ ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని తప్పనిసరిగా పాటించడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

-సెంట్రల్ డెస్క్

### షహీన్ బాగ్ నిరసన ఆగదు

దేశంలోని ప్రజలంతా ఆదివారం నాడు ఇళ్లల్లోనే ఉండాలంటూ (జనతా కర్ఫ్యూ) ప్రధాని మోదీ పిలుపు ఇచ్చినా.. షహీన్‌బాగ్ వద్ద తమ నిరసనలు ఆగవని నిరసనకారులు తెలిపారు. అయితే.. ఒక్కో టెంట్‌లో ఇద్దరు చొప్పున కూర్చుని నిరసన తెలుపుతామని వారు తెలిపారు.

### కరోనా భయం..

## కళ తప్పిన పెళ్లి

మెట్‌పల్లి, మార్చి 20 : ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ ప్రభావం వివాహాల మీదా పడుతోంది. శుక్రవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో జరిగిన పెళ్లి.. సందడి లేక వెలవెలబోయింది. కరోనా మహమ్మారి భయంతో బంధుమిత్రులు చాలా తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. వధూవరులు మాస్కులు ధరించి పెళ్లి చేసుకున్నారు. పురోహితులు, బంధుమిత్రులు కూడా ముఖానికి గుడ్డ కట్టుకున్నారు.



# కిరాతకుడు రామ్‌సింగే

- హత్యాచారానికి కుట్ర అతనిదే.. ఎదిరించిన నిర్భయపై దాడి
- అప్పటి పోలీస్ ఛీఫ్ వెల్లడి.. పశుత్వమే పరిమార్చింది
- అంత క్రూరమైన రేప్ ఎన్నడూ చూడలేదు
- నిర్భయను గుర్తు చేసుకున్న డాక్టర్

న్యూఢిల్లీ , మార్చి 20: నిర్భయను అతిపాశవికంగా రేప్ చేసి చంపేయడం వల్లే దోషుల చుట్టూ ఉచ్చు ఇంతగా బిగుసుకుందని డాక్టర్లు, పోలీసులు ఆనాటి ఘటనలను గుర్తుకు తెచ్చుకున్నారు. "2012 డిసెంబరు 16 రాత్రి ఒంటినిండా గాయాలతో, రక్తంతో నిర్భయను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి చూడగానే మాకు అర్థమైపోయింది. ఓ రకంగా ఆమె అక్కడికి తెచ్చేటప్పటికే చనిపోయినంత స్థితిలో ఉంది. ఆమెకు చికిత్స చేస్తున్నంత సేపూ మేమూ బాధతో విలవిల్లాడిపోయాం. ఆమె పేగుల్లోకి రెంచ్ పెట్టి పొడిచేశారు. పొత్తి కడుపును ఛిద్రం చేశారు. తెచ్చిన రోజే మాకు అర్థమైంది, ఆమె బ్రతకదని" అని ఆమెను ట్రీట్ చేసిన డాక్టర్ సునీల్ జైన్ చెప్పారు. "పేగు మార్పిడి జరిపితే తప్ప ఆమె బతకదు. అయితే ఇప్పటికీ ఇంటెస్టీనియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రపంచంలో అధ్యయన దశలోనే ఉంది. ప్రయోగాలు జరుగుతున్నాయి. అయినా సింగపూర్‌లోని ఆసుపత్రికి తరలించాం. లాభం లేకపోయింది" అని ఆయన చెప్పారు. "నేను దోషుల్లో ఒకడితో మాట్లాడాను. ఎందుకంత హింసించి, క్రూరంగా వ్యవహరించారని అడిగాను. ఆమె ప్రతిఘటించింది. అందుకే పొడిచేశాం" అన్నాడు. సఫ్దర్ జంగ్, సింగపూర్ ఆసుపత్రుల డాక్టర్లు ఇచ్చిన నివేదికే ప్రాసిక్యూషన్‌కు ప్రధానాధారమైంది. అంతటి క్రౌర్యమే దోషుల కొంప ముంచింది.

### ఆకలిగొన్న తోడేళ్లు!

ఆనాటి పాశవిక దాడికి సూత్రధారి, అందులో ప్రధాన పాత్రధారి డ్రైవర్ రామ్‌సింగేనని అప్పటి ఢిల్లీ పోలీస్ కమిషనర్ నీరజ్ కుమార్ తెలిపారు. 'బస్టాప్‌లో ఆగి ఉన్న నిర్భయను ఎక్కించుకున్నాక ఆమెను రేప్ చేయాలన్న కుట్ర అతడిదే. సహచరులకు అతనే ప్రోద్బలమిచ్చాడు. రేపిస్టుల్లో ఒకడైన మైనారిటీ తీరని కుర్రాడు అందరికంటే క్రూరంగా వ్యవహరించాడన్నది మీడియాలో వచ్చింది. కానీ రామ్‌సింగే మోస్ట్ బ్రూటల్. నిర్భయ ప్రతిఘటించినపుడు ఆమెను రాడ్లతో కొట్టాలని చెప్పినదీ అతగాడే' అని నీరజ్ కుమార్ వివరించారు. 'ఖాకీ ఫైల్స్' అని రాసిన ఓ పుస్తకంలో కూడా నీరజ్ సవివరంగా దీన్ని చెప్పారు. 'ఆకలి మీదున్న తోడేళ్లలా వారంతా ఆమె మీద పడ్డారు. ప్రతిఘటించినందుకు రాడ్లతో చిత్రహింసలు పెట్టారు' అని పేర్కొన్నారు.

### ఓ హెన్రీ కథతో సారూప్యం!

'దోషులను ప్రజల నుంచి కాపాడడం మాకు పెద్ద సవాల్‌గా మారింది. పోలీస్ స్టేషన్ బయట పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజానీకం ఉండేవారు. వారి చేతికి చిక్కితే దోషుల్ని చంపేస్తారు. అందుకే మేం దొడ్డిదారిన, మురికివాడలు, చిన్నచిన్న గల్లీలు దాటుకుంటూ దోషుల్ని తీసికెళ్లే వాళ్లం" అని అనిల్ శర్మ అనే అధికారి చెప్పారు. అప్పుడు నేను వసంత్ విహార్ పోలీస్‌స్టేషన్లో సీఐని. మొదట ఆ కేసు ఆ ఠాణాలోనే నమోదైంది. నిర్భయ నాకు తెలుసు. ఆమె ఇంటికి తరుచూ వెళ్లేవాడిని. మా ఇరువురి కుటుంబాలకు మంచి స్నేహం. ఓ హెన్రీ రాసిన 'ది లాస్ట్ లీఫ్' కథకు, నీ కథకు సారూప్యముందని నేను నిర్భయకు చెప్పాను. ఆమె ఆసుపత్రిలో ఉన్నపుడు కూడా నేనూ ఉండేవాణ్ని. సింగపూర్ కూడా వెళ్లాను. క్రిస్మస్ ఎలా జరుపుకోవాలో కూడా మేం ప్లాన్ చేసుకున్నాం... దురదృష్టవశాత్తూ ఆమె డిసెంబరు 29న చనిపోయింది" అని అనిల్ శర్మ బాధతో ఆమెను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ దోషుల ఉరితీతతో ఆమె ఆత్మకు శాంతి" అని సిట్‌కు చీఫ్‌గా వ్యవహరించిన అప్పటి డీసీపీ (దక్షిణ మండలం) ప్రమోద్ కుశావహ అన్నారు.



నిర్భయపై అత్యాచారం జరిగిన బస్సు



### మా పోరాటం ఆగలేదు : నిర్భయ తల్లి

#### న్యాయం జరిగింది: ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 20: నిర్భయ దోషుల ఉరితీతపై ప్రధాని మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు. "న్యాయం గెలిచింది. మహిళల భద్రత, గౌరవం కాపాడడం అత్యంత అవసరం" అని నిర్భయ పేరెత్తకుండా ట్వీట్ చేశారు. కామాంధుల కర్కశత్వానికి బలైపోయిన కూతురికి న్యాయం జరగాలని ఏడేళ్లుగా అలుపెరగని న్యాయపోరాట జరిపిన నిర్భయ తల్లి ఆశాదేవి- 'ఆలస్యమైనా న్యాయం జరిగింది' అని వ్యాఖ్యానించారు. "మా పోరాటం ఇంతటితో ఆగిపోదు. బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేట్లు, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా న్యాయం జరిగేట్లు పోరాడుతూనే ఉంటా" అని ఆమె ప్రకటించారు. నిర్భయకు న్యాయం జరిగింది గానీ అనేకమంది మహిళలకు న్యాయం అందలేదని ఆమె తండ్రి అన్నారు. ఇందు కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు. 'ఇది సంతృప్తికరమైన రోజు.. అయితే దోషులు మన వ్యవస్థను ఎలా సానుకూలంగా వినియోగించుకోగలుగుతున్నారన్నదానిపై ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సమయమిది' అని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతీ ఇరానీ అన్నారు. నిర్భయ లాంటి ఉదంతాలు మళ్లీ మళ్లీ జరక్కుండా మహిళా భద్రత ప్రభుత్వాల ప్రాధామ్యాంశం కావాల్సిన అవసరం ఉందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు.

### దోషుల తల్లుల మౌన రోదన

న్యూఢిల్లీ, మార్చి 20: చేసిన పాపానికి కొడుకులు శిక్ష అనుభవించినప్పటికీ దోషుల తల్లుల గర్భశోకం అంతా ఇంతా కాదు. తిహార్ జైలుకు కొన్ని కిలోమీటర్ల దూరంలో రవిదాస్ కాలనీ (మురికివాడ) ఉంది. ఆరుగురు నిర్భయ దోషుల్లో నలుగురు అక్కడి వారే. 2013లో జైలు గదిలో ఉరేసుకుని చనిపోయిన డ్రైవర్ రామ్‌సింగ్, అతని తమ్ముడు ముఖేశ్ సింగ్ అక్కడే ఉండేవారు. రామ్ సింగ్ చనిపోయి, ముఖేశ్‌కు కూడా మరణ శిక్ష పడ్డాక వారి తల్లి రాజస్థాన్‌లోని తన సొంత వూరికి వెళ్లిపోయింది. వినయ్ శర్మ, పవన్ గుప్తా అనే మరో ఇద్దరు దోషులూ అక్కడే ఉండేవారు. శుక్రవారం ఉరితీత జరిగినపుడు వారి తల్లులు బంధువుల మధ్య మౌనంగా రోదిస్తూ గడిపారు.

# ఉరి

(మొదటి పేజీ తరువాయి)

జైలు నిబంధనల ప్రకారం ఒకేసారి ఉరితీశారు. ఒక కేసులో నలుగురు దోషులను ఒకేసారి ఉరితీయడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. అరగంటసేపు ఉరికొయ్యకు వేలాడదీసి- వారు చనిపోయారని వైద్యులు ధ్రువీకరించాక.. మృతదేహాలకు పోస్ట్‌మార్టం చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. పార్లమెంట్‌పై దాడికేసులో దోషి అఫ్జల్ గురును 2013 ఫిబ్రవరి 9న ఉరితీశాక మళ్లీ తిహార్లో ఓ ఉరి అమలు జరగడం ఇదే!

### తెల్లవారుజామున హైడ్రామా

మరణశిక్ష నుంచి తప్పించుకోవడానికి రెండేళ్లుగా శతథా ప్రయత్నించిన దోషులు చివరిఘడియల దాకా కోర్టుల్లో పోరాడారు. ఉరిపై స్టే కోసం ఢిల్లీ హైకోర్టులో అర్ధరాత్రి దాకా పోరాడారు. ఆఖరి ప్రయత్నంగా సుప్రీం తలుపుతట్టారు. ఉరి ఆపడానికి హైకోర్టు నిరాకరించడంతో తెల్లవారుజామున 2 గంటలకు దోషుల తరపు లాయర్లు ఏపీ సింగ్, షామ్స్ ఖాజా సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ నివాసానికి వెళ్లి అప్పీలు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. దీంతో.. మొత్తం కోర్టు యంత్రాంగమంతా నిద్ర లేచింది. 2.30 గంటలకు 5వ నెంబరు కోర్టు హాలు తెరుచుకుంది. జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన బెంచ్ 45 నిమిషాల పాటు వారి వాదనలు ఆలకించింది. దోషుల్లో ఒకడైన పవన్ గుప్తా ఆ ఘటన జరిగేనాటికి మైనర్ అన్నది స్కూలు సర్టిఫికెట్లలో స్పష్టంగా ఉందని న్యాయవాదులు వాదించారు. ప్రభుత్వం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. దీన్ని అడ్డుకుంటూ ఈ వాదనను ఇప్పటికే నాలుగుమార్లు వివిధ కోర్టులు తోసిపుచ్చాయన్నారు. రాష్ట్రపతి క్షమాభిక్షను రెండోసారి కూడా తిరస్కరించడాన్ని కూడా దోషుల తరపు లాయర్లు సవాల్ చేశారు. రాష్ట్రపతి నిర్ణయంపై న్యాయసమీక్ష చాలా పరిమితమని బెంచ్ స్పష్టం చేసింది. వినయ్, అక్షయ్ తమ కుటుంబ సభ్యులను కలుసుకోడానికి అనుమతికోరారు. "జైలు నిబంధనలు ఇందుకు అనుమతించవు" అని తుషార్ మెహతా చెప్పారు. దీంతో.. బెంచ్ ఆ అప్పీలును డిస్మిస్ చేయడంతో ఉరి ఆగదని తేలిపోయింది.

### బ్రేక్‌ఫాస్ట్‌కు నో

కోర్టులో విచారణ సాగుతుండగానే అటు తిహార్‌లో ఉరికి ఏర్పాట్లు జరిగాయి. పశ్చిమ ఢిల్లీ కలెక్టర్ నేహా బన్సాల్ తిహార్ జైలులో ఏర్పాట్ల తీరును పరిశీలించి, దోషలను చూసి వెళ్లారు. ఉదయం 3.30 గంటలకు నలుగురినీ నిద్ర లేపేందుకు వెళ్లిన సిబ్బంది.. ఉరితీస్తారన్న భయంతో ఆ నలుగురూ అసలు నిద్రపోలేదని గుర్తించారు. స్నానాదికాలు ముగించుకోవాలని కోరినా వారు నిరాకరించారు. కొత్త బట్టలు వేసుకోడానికీ తిరస్కరించారు. బ్రేక్‌ఫాస్ట్ కూడా తీసుకోలేదు. టీ కూడా తాగలేదు. ముఖేశ్, వినయ్ గురువారం రాత్రి భోజనం చేశారు. పవన్, అక్షయ్ అది కూడా చేయలేదు. గురువారం సాయంత్రం మాత్రం అక్షయ్ ఓ కప్పు టీ తాగాడు. ఉదయం 5 గంటలకు పశ్చిమ జిల్లా డీసీపీ తిహార్‌కు చేరుకున్నారు. జైలు సూపరింటెండెంట్ ఆయనను ఉరికంబం ఉన్న మూడో నంబరు జైలు వద్దకు తీసుకెళ్లి దోషులను పరిచయం చేశాడు.

### ముఖేశ్ అవయవదానం

ఉరి అమలుకు ముందు దోషులకు వీలునామా రాసే అవకాశం ఉంటుంది. అయితే.. ఆ నలుగురూ అలాంటిదేమీ రాయలేదని అధికారులు చెప్పారు. ముఖేశ్ సింగ్ మాత్రం తన అవయవాలను దానం చేయాల్సిందిగా కోరాడు. ఆ మేరకు డిక్లరేషన్‌పై సంతకం చేశాడు. మరో దోషి వినయ్ శర్మ.. తన పెయింటింగ్‌లను జైలు సూపరింటెండెంట్‌కు అందజేయాలని, తన హనుమాన్ చాలీసాను కుటుంబ సభ్యులకు ఇవ్వాలని కోరాడు.

### బోరుమన్న దోషులు

తమను ఇక ఉరికంబం వద్దకు తీసికెళతారని తెలుసుకున్నపుడు జైలు సిబ్బంది కాళ్ల మీద పడి భోరున విలపించారు. ఒక్కో దోషికి ఆరుగురు వార్డర్ల చొప్పున 24 మంది ఆ నలుగురినీ ఉరికంబం వద్దకు తీసికెళ్లారు. "ఉరికంబం ఉన్న గదికి తీసికెళ్లాక వారి ప్రవర్తన బాగా మారిపోయింది. పెనుగులాడారు. వినయ్‌శర్మ ఏడుస్తూ నేలమీద పడి బావురుమన్నాడు. బలవంతంగా అతనిని వార్డర్లు ఉరి వేదికపైకి చేర్చారు. ఉరి వేదికపై నలుగురి కాళ్లకూ బంధనాలు వేసి కట్టేసినపుడు కూడా వారు అటూఇటూ కదులుతూ అడ్డుకోబోయాడు. మిగిలిన సిబ్బంది వారిని కదలకుండా పట్టుకున్నారు. ఉరికంబానికి ఉన్న నాలుగు లీవర్లు లాగాల్సి ఉండడం, తలారి పవన్ జల్లాద్‌కు మిగిలిన జైలు సిబ్బంది సహకారం అనివార్యం అయింది. సరిగ్గా 5-30 గంటలకు జైలు సూపరింటెండెంట్ సునీల్ సంకేతం ఇవ్వగానే తలారితో పాటు.. మిగిలిన వారు కూడా లీవర్లు లాగారు. బలమైన ఉరితాళ్లు కావడంతో వెంటనే బిగుసుకున్నాయి. అరగంటసేపు అలా ఉంచాక, మృతదేహాలను దించారు. వారు చనిపోయినట్లు జైలు డాక్టర్లు ధ్రువీకరించాక పోస్ట్‌మార్టం నిమిత్తం దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి పంపారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ముఖేశ్, అక్షయ్‌ల మృతదేహాలను రాజస్థాన్, బిహార్‌లలోని వారి స్వగ్రామాలకు తరలించగా- వినయ్ శర్మ, పవన్ గుప్తాల మృతదేహాలను ఢిల్లీలోని రవిదాస్ ప్రాంతంలోని వారి ఇళ్లకు తీసికెళ్లారు.

### జైలు బయట నినాదాలు

ఉరితీత సమయానికే వందల మంది తిహార్ జైలు వద్దకు చేరుకున్నారు. నిర్భయకు న్యాయం జరిగిందంటూ నినాదాలు చేశారు. "నిర్భయకు న్యాయం అందింది. ఈ ఉదయం ఓ నవోదయం" అని సామాజిక కార్యకర్త యోగితాభయానా అన్నారు. త్రివర్ణ పతాకాలు చేబూని భారత్ మాతాకీ జై అంటూ కూడా కార్యకర్తలు నినాదాలు చేశారు. తిలక్ నగర్‌కు చెందిన జినిషా కౌర్ అనే తొమ్మిదేళ్ల బాలిక కూడా ఆ సమయానికి అక్కడకు తండ్రితో కలిసి వచ్చింది. 'నా కూతురికి నిర్భయ గురించి తెలుసు... అందుకే ఈ క్షణం ఇక్కడ ఉండాలనుకుంది. తీసుకొచ్చాను' అని ఆమె తండ్రి సిమరంజిత్ సింగ్ చెప్పారు.



### నా కూతురి ఆత్మకు శాంతి ఎప్పుడో!?

**ఆయేషా మీరా తల్లి**

తెనాలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నిర్భయ దోషులకు ఎట్టకేలకు ఉరిశిక్ష అమలు పరచడం హర్షణీయమని, ఆయేషా మీరా తల్లి సంషాద్ బేగం అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున నిర్భయ నిందితులు నలుగురినీ ఉరి తీసిన విషయం తెలిసిందే. దీనిపై.. ఇబ్రహీంపట్నంలో 13 ఏళ్లక్రితం హత్యకు గురైన తెనాలికి చెందిన బీఫార్మసీ విద్యార్థిని తల్లి సంషాద్ బేగం గుంటూరు జిల్లా తెనాలిలో విలేకరులతో మాట్లాడారు. నిర్భయ తల్లికి ఎట్టకేలకు ఊరట లభించిందని, తన కుమార్తె ఆత్మకు ఎప్పటికి శాంతి చేకూర్చుతారో ప్రభుత్వమే బదులివ్వాలని డిమాండ్ చేశారు. నిర్భయ తల్లి జరిపిన అవిశ్రాంత న్యాయ పోరాటం తన వంటి తల్లులకు స్ఫూర్తిదాయకమని, ఆమెకు చేతులెత్తి మొక్కుతున్నానని చెప్పారు. తన కుమార్తె ఆయేషామీరా హత్య కేసులో 13 ఏళ్లు దాటిపోతున్నా ఇంకా నిందితులనే గుర్తించలేకపోయారని, నిర్భయ వంటి చట్టాలు ఎన్ని వచ్చినా రాజకీయ జోక్యం ఉంటే ఏ కేసూ తేలదనే అభిప్రాయానికొచ్చామని తెలిపారు. నిర్భయ సంఘటన తర్వాత దేశంలోనే కాక తెలుగు రాష్ట్రాల్లో అనేక సంఘటనలు జరిగాయని, దిశ వంటి చట్టాలు కూడా తర్వాత పుట్టుకొచ్చాయని, ఎన్ని చట్టాలు వచ్చినా అమలులో చిత్తశుద్ధి లోపిస్తే ఈ చట్టాలేవీ అబలకు ఆలంబన కావని చెప్పారు. నేడు న్యాయ వ్యవస్థ గొప్పగా చెప్పుకోవచ్చేమో కానీ, నిర్భయ కేసు సాగదీతలో వైఫల్యాలు కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు.. అటువంటి కరడుగట్టిన నేరస్తులకు అండగా నిలవటం సిగ్గుచేటని, ఇలాంటి కేసులలో దోషులకు అనుకూలంగా వాదించొద్దని కోరారు. మైనారిటీ కావటంవల్లే తమకు నేటికీ న్యాయం జరగలేదని సంషాద్ బేగం ఆరోపించారు. ఉన్మాది డబ్బున్నవాడయితే, అతడిని ఈ చట్టాలు ఏమీ చేయలేవని అన్నారు.



సంషాద్ బేగం

## ముంబయి క్వారంటైన్ నుంచి భీమవరం యువకుడి పరారీ

- ఎల్‌బీనగర్‌లో బస్సు ఎక్కుతుండగా.. అడ్డుకొని దించేసిన ప్రయాణికులు
- గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు

హైదరాబాద్/మన్సూరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఓ యువకుడు (22) ముంబయిలోని క్వారంటైన్ కేంద్రం నుంచి తప్పించుకొని వచ్చాడు. దుబాయ్ నుంచి ముంబయికి చేరుకున్న అతణ్ని అక్కడి అధికారులు క్వారంటైన్‌కు తరలించి చేతిపై ముద్ర వేశారు. అయితే అతడు అక్కడి నుంచి శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. ఎల్‌బీనగర్‌లో భీమవరం వెళ్లే ప్రైవేటు బస్సులో ఎక్కాడు. అతని చేతికి ఉన్న కరోనా క్వారంటైన్ ముద్ర చూసిన ఇతర ప్రయాణికులు.. బస్సు నుంచి దింపేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో... వారు వచ్చి ఎల్‌బీనగర్ స్టేషన్‌కు తరలించారు. అనంతరంగాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, యువకు ముంబయి క్వారంటైన్ కేంద్రం నుంచి తప్పించుకొని వచ్చినట్లు భావిస్తున్నారు. తనతోపాటు మరో ముగ్గురు కూడా దుబాయ్ నుంచి వచ్చినట్లు, వారు నిజామాబాద్‌కు వెళ్లినట్లు ఆ యువకుడు పోలీసులకు చెప్పాడు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లోని చింతల్‌కుంట మల్లికార్జుననగర్ నార్త్ కాలనీకి ఓ వ్యక్తి మూడు రోజుల క్రితం దుబాయ్ నుంచి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అతణ్ని గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డుకు తరలించారు. హయత్‌నగర్ సర్కిల్‌లో 52 మంది విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఒకరిని గాంధీకి తరలించినట్లు చెప్పారు.



తిరుమలలో ఒకే ఒక పెళ్లి

తిరుమల, మార్చి 20: భక్తుల్లేక తిరుమల బోసిపోయి ఉండగా.. ఓ జంట మాత్రం అనుకున్న ముహూర్తానికే స్వామి సన్నిధిలో ఒకటైంది. కరోనా విజృంభణ నేపథ్యంలో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు శ్రీవారి దర్శనాన్ని టీటీడీ అధికారులు నిలిపేసిన విషయం తెలిసిందే. గురువారం మధ్యాహ్నం నుంచే భక్తులను తిరుమలకు అనుమతించకుండా ఘాట్‌రోడ్లను మూసేశారు. దీంతో శుక్రవారం ఉదయానికే తిరుమల బోసిపోయింది. ఈ క్రమంలో గుంటూరు జిల్లా తాడేపల్లెకు చెందిన ఓ పెళ్లి బృందం శుక్రవారం సాయంత్రం అలిపిరికి చేరుకుంది. ఎవరినీ తిరుమలకు అనుమతించడం లేదంటూ అక్కడి సిబ్బంది తెలిపారు. తాము ముందస్తుగానే శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయానికి కల్యాణవేదికలో వివాహం చేసుకునేందుకు నమోదు చేసుకున్నామంటూ వారు ఆ పత్రాలను చూపారు. ఈ విషయాన్ని సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పెళ్లికొడుకు, పెళ్లికూతురుతో పాటు ఆరుగురు కుటుంబ సభ్యులతో కూడిన వాహనాన్ని మాత్రమే తిరుమలకు ప్రత్యేకంగా అనుమతించారు. రాత్రి 8 గంటలకు తిరుమల చేరుకున్న వీరు 9.30 గంటల ముహూర్తానికి వివాహ బంధంతో ఒకటయ్యారు. తిరుమల మొత్తం బోసిపోయిన తరుణంలో వీరు మాత్రం ప్రత్యేకంగా కొండపై పెళ్లి చేసుకోవడం గమనార్హం.

## 720 మందికి ఉరి అమలు

- అత్యధికంగా యూపీలో 354మందికి
- జాతీయ న్యాయ విశ్వవిద్యాయం లెక్క



న్యూఢిల్లీ, మార్చి 20: మనదేశంలో ఉరిశిక్షలు విధించడం అరుదు. అమలుకావడం మరీ అరుదు. దాదాపు ఐదేళ్ల తర్వాత దేశంలో ఉరిశిక్ష అమలైంది. నిర్భయ దోషుల ఉరికి ముందు ముంబై పేలుళ్ల కేసులో దోషి అయిన యాకూబ్ మెమెన్‌ను 2015 జూలై 30న ఉరితీశారు. ఢిల్లీలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (ఎన్ఎల్‌యూ) సేకరించిన వివరాల ప్రకారం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఇప్పటివరకు 720మందిని ఉరితీశారు. ఉరిశిక్షల అమలుకు సంబంధించిన ప్రభుత్వం సరైన రికార్డులను నిర్వహించలేకపోయిందని, ఈ కారణంగా ఎంతమందిని ఉరితీశారనే విషయంలో అస్పష్టత నెలకొందని ఎన్ఎల్‌యూ పేర్కొంది. జాతీయ న్యాయ కమిషన్ లెక్కలేమో 1967 వరకే దేశవ్యాప్తంగా 1500 మందిని ఉరితీసినట్లు చెబుతుండటం గమనార్హం. ఎన్ఎల్‌యూ లెక్కల ప్రకారం అత్యధికంగా యూపీలోనే 354మంది దోషులను ఉరితీశారు. 90మందిని హరియాణాలో, 73మందిని మధ్యప్రదేశ్‌లో, 57మందిని మహారాష్ట్రలో 36మందిని, కర్ణాటకలో, 30మందిని, పశ్చిమ బెంగాల్‌లో, 27మందిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 27మందిని, ఢిల్లీలో 24మందిని, పంజాబ్‌లో 10మందిని, రాజస్థాన్‌లో 8మందిని ఉరితీశారని ఎన్ఎల్‌యూ రికార్డులు చెబుతున్నాయి. 2018లో ప్రపంచవ్యాప్తంగా 20 దేశాల్లో 690మందిని ఉరితీసినట్లు ఆమ్నెస్టీ పేర్కొంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా 2018 నాటికి 142 దేశాలు ఉరిశిక్షను రద్దుచేశాయి. కాగా, మహిళలపై నేరాలను అరికట్టేందుకు మరణశిక్ష పరిష్కారం కానే కాదని ఆమ్నెస్టీ వ్యాఖ్యానించింది. నిర్భయ దోషుల ఉరితీత భారత్‌లో మానవ హక్కులపై మరకగా అభివర్ణించింది.

### తిహార్‌లోనే బిల్లా, రంగాల ఉరి

తిహార్ జైల్లో ఏడేళ్ల తర్వాత మళ్లీ ఉరిశిక్ష అమలైంది. పార్లమెంటుపై దాడి కేసులో దోషి అయిన అఫ్జల్ గురును 2013ఫిబ్రవరి 9న ఈ జైల్లోనే ఉరితీశారు. నిర్భయ దోషుల మాదిరిగానే రేప్, హత్య కేసులో దోషులుగా తేలిన జస్బీర్ సింగ్ అలియాస్ బిల్లా, కుల్జీత్ సింగ్ అలియాస్ రంగాలను 1982 జనవరి 31న ఇక్కడే ఉరితీశారు. 1978లో గీత, సంజయ్ చోప్రా అనే తోబుట్టువులను వీరు కిడ్నాప్ చేసి హత్యచేశారు. ఈ జైల్లోనే 1984లో కశ్మీర్ వేర్పాటువాద నేత మక్బూల్ భట్‌ను, సుపారీ హత్య కేసులో దోషి అయిన కర్తార్ సింగ్, ఉజాగర్ సింగ్‌లను 1985లో ఉరికంబం ఎక్కించారు.

## కరెన్సీ లెక్కింపులో కరోనా ప్రమాదం!

- ఆర్థిక శాఖను హెచ్చరించిన సీఏఐటీ

గుంటూరు(సంగడిగుంట), మార్చి 20: ఇప్పటి వరకు కరోనా వైరస్ కేవలం మనుషులను తాకటం ద్వారా, వారు సంచరించిన ప్రదేశాల్లోని వస్తువులను తాకటం ద్వారా విస్తరిస్తుందని, వాటికి దూరంగా ఉంటే సరిపోతుందని భావిస్తూ వస్తున్నాం. కానీ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సీఏఐటీ ) ఆర్థిక శాఖను హెచ్చరిస్తూ చేసిన సూచన ఇప్పుడు మరింత కలవరానికి దారి తీసింది. అదే నోట్ల లెక్కింపు! కొన్ని చోట్ల డబ్బు లెక్కించడానికి స్పాంజ్‌తో కూడిన ప్యాడ్‌లను వాడతారు. వాటిపై నీటిని చల్లి ఆ తడితో నోట్లు లెక్కిస్తారు. కానీ 90 శాతం మంది నోటితో తడి చేసుకొని నగదు లెక్కిస్తారు. ఇది భారత్ వంటి దేశాల్లో సాధారణం. ఇప్పుడిప్పుడే ఆన్‌లైన్ బ్యాంకింగ్ విస్తరిస్తున్నప్పటికీ అది కేవలం 3 శాతానికి మించలేదు. అంటే 97% నగదు చేతుల మీదే లెక్కిస్తున్నారు. వీటిని లెక్కించే క్రమంలో ఒకవేళ కరోనా సోకిన వ్యక్తి నోటితో తడి చేసుకొని నోట్లను లెక్కిస్తే కరోనా కారకం ఎన్ని గంటలు ఉంటుందో ఇప్పటికీ స్పష్టత లేదు. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా మూడు రోజుల క్రితం విడుదల చేసిన సర్వేలో అన్ని వస్తువులపై 9 గంటల్లో వైరస్ చనిపోదని నిర్ధారించింది. కరెన్సీ నోట్లపై ఎన్ని గంటలు ఉంటుందనేది ఇప్పటి వరకు అధ్యయనం జరగలేదు. కాబట్టి వీలైనంత వరకు ఫోన్‌పే, గూగుల్‌పే వంటి మాధ్యమాలను వాడాలని నిపుణులు చెబుతున్నారు.

# కమల్‌నాథ్ రాజీనామా

### బలపరీక్షకు ముందే తప్పుకొన్న మధ్యప్రదేశ్ సీఎం.. 15 నెలలకే కూలిపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేపీకి లైన్ క్లియర్.. శివరాజ్‌కే చాన్స్!

భోపాల్/న్యూఢిల్లీ, మార్చి 20: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం అసెంబ్లీలో బలపరీక్షకు కొద్ది గంటల ముందే వైదొలగారు. 22 మంది కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదించడం, బలపరీక్షలో ఓటమి తప్పదనే విషయం స్పష్టం కావడంతో కమల్‌నాథ్ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలోనే గవర్నర్ లాల్జీ టాండన్‌కు తన రాజీనామా లేఖను సమర్పించారు. రాజీనామాను గవర్నర్ ఆమోదించినట్లు రాజ్‌భవన్ అధికారికంగా ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో 18 రోజులుగా కొనసాగుతున్న రాజకీయ హైడ్రామాకు తెరపడినట్లయింది. 230 మంది సభ్యుల మధ్యప్రదేశ్ అసెంబ్లీలో ఇద్దరు సభ్యులు చనిపోవడం, 22 మంది రాజీనామా చేయడంతో అధికారం నిలబెట్టుకునేందుకు మ్యాజిక్ ఫిగర్ 104గా మారింది. కానీ, కాంగ్రెస్ బలం 92కు పడిపోవడంతో కమల్‌నాథ్‌కు రాజీనామా చేయక తప్పలేదు. కాగా, కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే దాకా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాల్సిందిగా కమల్‌నాథ్‌కు గవర్నర్ సూచించారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ బేరసారాలకు పాల్పడలేదని అంతకుముందు కమల్‌నాథ్ మీడియాతో అన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రజలు తిరస్కరించిన, అధికార దాహం కలిగిన ఓ వ్యక్తి, అత్యాశపరులైన ఎమ్మెల్యేలు, బీజేపీ కలిసి కుట్ర పన్నారని పరోక్షంగా సింధియాపై మండిపడ్డారు.



గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పించిన మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్

### ఇది ప్రజల విజయం: జ్యోతిరాదిత్య

కమల్‌నాథ్ రాజీనామా ప్రజల విజయమని బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియా అభివర్ణించారు. రాజకీయాలను ప్రజాసేవగానే తాను భావిస్తానని, కానీ.. కమల్‌నాథ్ ప్రభుత్వం ఆ విషయాన్ని మరిచిందని ట్విటర్‌లో పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్‌లో వర్గపోరు కారణంగానే కమల్ సర్కారు కూలిపోయిందని బీజేపీ పేర్కొంది. ఇక బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు లైన్‌క్లియర్ కావడంతో ముఖ్యమంత్రి రేసులో మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్, మాజీ మంత్రి నరోత్తమ్ మిశ్రా పేర్లు కూడా వినిపిస్తున్నా పార్టీ అధిష్ఠానం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా రాలేదు.

## అత్యాచార దోషులను 6 నెలల్లో శిక్షించాలి

- 'దిశ' తండ్రి శ్రీధర్‌రెడ్డి

శంషాబాద్, మార్చి 20: మహిళలపై జరిగే అత్యాచారాల కేసులను 3 నుంచి ఆరు నెలల్లో తేల్చి దోషులను శిక్షించాలని శంషాబాద్‌కు చెందిన 'దిశ' తండ్రి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శిక్ష వేయకుండా కాలయాపన చేస్తూ ఏళ్ల తరబడి సమయం, ప్రజాధనం వృథా చెయ్యొద్దని ఆయన కోరారు. శుక్రవారం ఉదయం నిర్భయ దోషులు నలుగురిని తిహార్ జైల్లో ఉరితీసిన నేపథ్యంలో ఆయన శుక్రవారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. అత్యాచారం వంటి పెను ఘటనలు జరిగినప్పుడు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి మూడు నుంచి ఆరు నెలల లోపల కఠిన శిక్షలు విధించి అమలు చేయాలన్నారు. నిర్భయ తల్లిదండ్రులు ఏడేళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగి నిరాశ చెందుతున్న సమయంలో దోషులను ఉరితీశారని చెప్పారు.

## 'ఆనంద' కిరీటం మళ్లీ ఫిన్లాండ్‌కే

- సంతోషం లేని జాబితాలో టాప్ టెన్‌లో భారత్

హెల్సింకి(ఫిన్లాండ్), మార్చి 20: ఆనంద దేశంగా ఫిన్లాండ్ తన కిరీటాన్ని నిలుపుకుంది. ప్రపంచంలో ప్రజలు సంతోషంగా ఉండే దేశాల జాబితా-2020ను ఐక్యరాజ్యసమితి శుక్రవారం ప్రకటించింది. దీనిలో ఫిన్లాండ్‌ది మొదటి స్థానం. ఆ దేశం ఈ ఖ్యాతి గడించడం వరుసగా ఇది మూడోసారి. తర్వాతి రెండు స్థానాల్లో డెన్మార్క్, స్విట్జర్లాండ్ ఉన్నాయి. అమెరికా 18వ స్థానం దక్కించుకుంది. ఇక మన దేశం 'ఆనంద' సూచీలో మాట అటుంచితే.. సంతోషం లేని దేశాల జాబితాలో 10వ స్థానంలో ఉంది. అఫ్ఘనిస్థాన్‌ది మొదటి స్థానం. అలాగే సంతోషకర నగరాల్లో ఫిన్లాండ్ రాజధాని హెల్సింకి ప్రథమ స్థానంలో నిలిచింది. సంతోషం లేని నగరాల్లో అఫ్ఘనిస్థాన్ రాజధాని మొదటి స్థానంలో ఉండగా.. మన రాజధాని ఢిల్లీ 7వ స్థానంలో ఉంది. ఆనంద సూచీలో మార్కులు వేయడానికి 156 దేశాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు, జీడీపీ, సామాజిక మద్దతు, వ్యక్తిగత స్వేచ్ఛ, అవినీతి వంటి వాటిని పరిగణనలోకి తీసుకున్నారు.




## ఇంట్లో ఉంటేనే ఆరోగ్యం

కోహ్లీ, అనుష్క సందేశం



**ముంబై:** ప్రస్తుతం దేశంలో విజృంభిస్తున్న కరోనా నుంచి బయటపడాలంటే అందరూ స్వీయ నియంత్రణ పాటించాల్సిందేనని భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ, అతడి భార్య అనుష్క శర్మ సూచించారు. కోహ్లీతో కలిసి రూపొందించిన వీడియోను అనుష్క తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. అటు విరాట్ కూడా దీన్ని ట్విటర్‌లో రీట్వీట్ చేశాడు. 'మన దేశమే కాకుండా ప్రపంచమంతా ఇప్పుడు క్లిష్టమైన పరిస్థితి ఎదుర్కొంటోంది. దీన్ని అరికట్టాలంటే ఇంట్లోనే ఉండండి. అలాగైతేనే భద్రంగా, ఆరోగ్యం గానూ ఉంటాం' అని తెలిపారు.

### జనతా కర్ఫ్యూకు క్రికెటర్ల మద్దతు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన జనతా కర్ఫ్యూకు క్రికెటర్లు పూర్తి మద్దతు పలికారు. విరాట్ కోహ్లీ, యువరాజ్, హర్భజన్, రాహుల్, రిషభ్ పంత్ ఇది గొప్ప నిర్ణయంగా పేర్కొన్నారు. అందరూ ఉదయం నుంచి రాత్రి వరకు స్వచ్ఛందంగా ఇళ్లల్లోనే ఉంటూ జనతా కర్ఫ్యూకు మద్దతు ఇవ్వాలని కోరారు. కరోనా నియంత్రణలో పోరాడుతున్న వ్యక్తుల కోసం ఆదివారం సాయంత్రం చప్పట్లతో మద్దతు పలకాలని సూచించారు.



## స్వీయ నిర్బంధంలో నీరజ్ చోప్రా

**న్యూఢిల్లీ:** టోక్యో ఒలింపిక్ బెర్త్ దక్కించుకున్న భారత స్టార్ జావెలిన్ క్రీడాకారుడు నీరజ్ చోప్రాను స్వీయ నిర్బంధంలో ఉండాల్సిందిగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆదేశించింది. శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా టర్కీ వెళ్లి తిరిగొచ్చిన నీరజ్‌ను 14 రోజుల పాటు పటియాలా ఎన్ఐఎస్ కేంద్రంలోని అతడి గదికే పరిమితం కావాల్సిందిగా 'సాయ్' సూచించింది.

## టెస్ట్ క్రికెట్‌లాంటిదే...కరోనా



**ముంబై:** ప్రస్తుతం ప్రపంచమంతా కరోనా మహమ్మారిపై యుద్ధం చేస్తోంది. ఈ పోరాటాన్ని దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ టెస్ట్ క్రికెట్‌తో పోల్చాడు. కొవిడ్-19పై పోరులో ప్రజలందరికీ 'సహనం, సమష్టితత్వం, అప్రమత్తత' అవసరమని పిలుపునిచ్చాడు. 'విశ్వమంతా కరోనాపై పోరు సల్పుతోంది. ఈ సందర్భంగా..క్రికెట్‌లో అత్యంత పురాతన టెస్టులను మనం జ్ఞప్తి చేసుకోవాలి' అని అన్నాడు. 'టెస్టు క్రికెట్ ఎన్నో విషయాలు నేర్పుతుంది. సహనానికి విలువ ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. పిచ్ పరిస్థితులను, బౌలర్ శైలిని మనం అర్థం చేసుకోలేకపోతే రక్షణాత్మకంగా ఆడడమే ఉత్తమం. ప్రస్తుతం ప్రపంచానికి కావాల్సిందే ఓర్పు. కరోనాపై పోరులో మనల్ని రక్షించుకోవాలంటే ఎంతో సహనం వహించాలి' అని సచిన్ వివరించాడు.

## న్యూజిలాండ్ టీమ్‌ను బంధించిన కొవిడ్-19



**వెల్లింగ్టన్:** కొవిడ్-19 వైరస్ దెబ్బకు ఆస్ట్రేలియా పర్యటన నుంచి స్వదేశానికి తిరిగొచ్చిన న్యూజిలాండ్ క్రికెటర్లు, సహాయ సిబ్బంది స్వీయ నిర్బంధంలో ఉంటున్నారు. కిందటి వారం సిడ్నీ నుంచి వచ్చిన వీరందరు ప్రభుత్వ ఆదేశాలమేరకు ఇళ్లలో స్వీయ నిర్బంధాన్ని పాటిస్తున్నారు.

### ఫుట్‌బాల్ లెజెండ్

# పీకే బెనర్జీ కన్నుమూత



### సుదీర్ఘ కాలం భారత జట్టుకు కెప్టెన్‌గా సేవలు

**కోల్‌కతా:** భారత ఫుట్‌బాల్ దిగ్గజం ప్రదీప్ కుమార్ బెనర్జీ కన్నుమూశారు. వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో ఈ నెల రెండునుంచి ఓ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బెనర్జీ (83) శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు (పౌల, పూర్ణ) ఉన్నారు. వీరిద్దరు ప్రముఖ విద్యావేత్తలు. బెనర్జీ సోదరుడు ప్రసూన్ బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ. బెంగాల్‌లోని మోయంగురిలో 1936, జూన్ 23న బెనర్జీ జన్మించారు. అయితే, దేశ విభజనకంటే ముందే ఆయన కుటుంబం జంషెడ్‌పూర్ తరలి వెళ్లింది. 1962లో జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో బెనర్జీ సారథ్యంలోని భారత్ పసిడి పతకం గెలిచింది. 84 మ్యాచ్‌ల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన బెనర్జీ..మొత్తం 65 అంతర్జాతీయ గోల్స్ చేశారు. ఆయన ఆడిన కాలాన్ని భారత ఫుట్‌బాల్ స్వర్ణ యుగంగా పేర్కొంటారు. 1960 రోమ్ ఒలింపిక్స్‌లోనూ భారత జట్టుకు బెనర్జీ కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆ క్రీడల్లో..అత్యంత పటిష్ఠ జట్టయిన ఫ్రాన్స్‌తో మ్యాచ్‌ను భారత్ 1-1తో డ్రా చేయడంలో స్ట్రయికర్ బెనర్జీ ప్రధాన పాత్ర పోషించారు. మ్యాచ్‌ను సమం చేసిన గోల్‌ను బెనర్జీనే చేయడం విశేషం. అంతకుముందు మెల్‌బోర్న్ (1956) ఒలింపిక్స్‌లోనూ బెనర్జీ పాల్గొన్నారు. ఆ క్రీడల క్వార్టర్ ఫైనల్లో భారత్ 4-2తో ఆస్ట్రేలియాపై విజయం సాధించడంలోనూ బెనర్జీ కీలక భూమిక పోషించారు. ఆ విశ్వక్రీడల ఫుట్‌బాల్‌లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. సాకర్‌కు బెనర్జీ సేవలను గుర్తించిన అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ఆయనకు 2004లో సెంటీనియల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డును ప్రదానం చేసింది.

#### ఫుట్‌బాల్‌తో 51 ఏళ్ల అనుబంధం

16 ఏళ్ల వయస్సులో 1952 సంతోష్ ట్రోఫీలో బిహార్ తరపున ప్రారంభమైన బెనర్జీ ఫుట్‌బాల్ ప్రస్థానం ఆ ఆటతో 51 ఏళ్ల పాటు కొనసాగింది. చివరగా ఆయన మహ్మదన్ స్పోర్టింగ్ క్లబ్‌కు కోచ్‌గా పని చేశారు. చునీ గోస్వామి, తులసీదాస్ బలరామ్, బెనర్జీని భారత ఫుట్‌బాల్‌లో 'హోలీ ట్రినిటీ'గా పేర్కొంటారు. గాయాల కారణంగా 1967లో ఆటగాడిగా బెనర్జీ రిటైరయ్యారు. ఆ తర్వాత జాతీయ జట్టుతో పాటు..ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ అట్లెటికో తదితర జట్లకు కోచ్‌గా వ్యవహరించారు. కోచ్‌గా 54 ట్రోఫీలు అందించిన ఘనత ఆయనది. 1977లో పీలే ప్రాతినిధ్యం వహించిన యార్క్ కాస్మోస్ జట్టుతో మ్యాచ్‌ను మోహన్ బగాన్ 2-2తో డ్రా చేసి సంచలనం సృష్టించింది. అప్పుడు బగాన్ జట్టుకు బెనర్జీ కోచ్ కావడం గమనార్హం.



#### క్రీడాలోకం నివాళి

భారత ఫుట్‌బాల్‌కు పీకే బెనర్జీ అందించిన సేవలు నిరుపమానం. భావి తరాలకూ స్ఫూర్తి ప్రదాత.
**-మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి**

జాతీయ ఫుట్‌బాల్ రంగానికి ఆయన మృతి తీరని లోటు **-కిరణ్ రిజిజు, కేంద్ర క్రీడా శాఖమంత్రి**

భారత ఫుట్‌బాల్ లెజెండ్ మీరు. మీ సేవలను కోల్పోతున్నాం.
**- ప్రఫుల్ పటేల్, అధ్యక్షుడు, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య**

దేశ సాకర్‌కు మీరు చేసిన సేవలు ఎల్లకాలం గుర్తుంటాయి. బెనర్జీ కుటుంబానికి నా సానుభూతి.
**- సునీల్ ఛెత్రి, భారత జట్టు కెప్టెన్**

ఆయనతో నాకు మధుర స్మృతులున్నాయి. బెనర్జీ ఆత్మకు శాంతి చేకూరాలి.
**-సచిన్ టెండూల్కర్**

నా కెరీర్‌పై బెనర్జీ ప్రభావం ఎంతో ఉంది. ఆయన ఆత్మకు శాంతి కలగాలి
**- గంగూలీ, బీసీసీఐ అధ్యక్షుడు**

## ఆ సత్తా పాకిస్థాన్‌కు లేదు



**లాహోర్:** దాయాది భారత క్రికెట్ జట్టు అంటే ఒంటికాలిపై లేచే పాకిస్థాన్ మాజీ క్రికెటర్ జావెద్ మియాందాద్ ఈసారి తమ టీమ్ మీదనే తీవ్రమైన విమర్శలు చేశాడు. బాబర్ ఆజమ్ మినహా ఇప్పుడున్న పాక్ జట్టులోని బ్యాట్స్‌మెన్‌కు భారత్‌పై ఆడే సత్తా లేదన్నాడు. 'బాబర్ ఆజమ్ ఒక్కడే నిలకడగా ఆడుతున్నాడు. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లపై ఆడే సామర్థ్యం మిగిలిన బ్యాట్స్‌మెన్‌కు లేదు. పాక్ జట్టులో మంచి బౌలర్లు ఉన్నారు కానీ, పేలవ బ్యాటింగ్ లైన్‌ఎతో సమస్య ఉత్పన్నమవుతోంది. ఇతర దేశాల్లో ఉత్తమ ప్రదర్శన ఆధారంగా క్రికెటర్లను ఎంపిక చేస్తుంటే పాక్‌లో పది ఇన్నింగ్స్‌లో ఒక్క పరుగు కూడా చేయని ఆటగాళ్లను కొనసాగిస్తూనే ఉన్నారు' అని మియాందాద్ విమర్శించారు.

## ధోనీకి చోటు కష్టమే!



సునీల్ గవాస్కర్

**ముంబై:** ఐపీఎల్‌లో సత్తా చాటి తిరిగి భారత జట్టులోకి వస్తాడని ఎంఎస్ ధోనీపై అతడి అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. కానీ కొవిడ్-19 ధాటికి ఈ లీగ్ జరిగేది అనుమానంగానే మారింది. ఈ నేపథ్యంలో ధోనీ భవిష్యత్ ఎలా ఉండబోతుందనే చర్చ ప్రారంభమైంది. ఇప్పటికే పలువురు మాజీలు ఈ విషయంపై భిన్నంగా స్పందించగా.. మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అయితే ధోనీ జట్టులోకి రావడం చాలా కష్టమనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు. 'నాకైతే టీ20 ప్రపంచకప్ జట్టులో ధోనీని చూడాలనే ఉంది. కానీ అది చాలా కష్టం. ఇప్పటికే జట్టు చక్కటి ట్రాక్‌లో వెళుతోంది. అయితే అందరు ఆటగాళ్లలాగా ధోనీ బహిరంగంగా రిటైర్మెంట్‌ను ప్రకటించే వ్యక్తి కాదు. అతడి మనస్తత్వానికి తగినట్టుగా నిశ్శబ్దంగా ఆట నుంచి వైదొలుగుతాడని అనుకుంటున్నా' అని గవాస్కర్ తెలిపాడు. మరోవైపు ధోనీ జట్టులోకి రావాలనుకుంటే అతడికున్న అడ్డంకేమీ లేదని వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రాతో పాటు వసీం జాఫర్ అభిప్రాయపడగా.. ఇప్పుడున్న పరిస్థితిలో ఎంఎస్‌కు అసలు జట్టులో చోటెక్కడుందని మాజీ ఓపెనర్ సెహ్వాగ్ ప్రశ్నించాడు. రాహుల్, పంత్ రూపంలో ఇద్దరు యువ వికెట్ కీపర్లున్నారని గుర్తుచేశాడు.



## ముస్తాక్ అలీని అగౌరవపరిచారు

**ముంబై:** ఐపీఎల్‌ను మరో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలా మార్చలేమన్న బీసీసీఐ అధికారి వ్యాఖ్యలపై గవాస్కర్ మండిపడ్డాడు. మొదట షెడ్యూల్ ప్రకారం ఖాళీ స్టేడియాల్లో ఐపీఎల్‌ను జరుపుదామని బీసీసీఐ ప్రయత్నించినా, విదేశీ ఆటగాళ్లుంటేనే బావుంటుందనే ఆలోచనతో లీగ్ వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఓ ఉన్నతాధికారి దేశవాళీ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ ప్రస్తావన తెచ్చారు. 'ఐపీఎల్‌ను.. తక్కువ నాణ్యత కలిగిన టోర్నీగా ప్రదర్శించలేమని చెబుతూ, మరో ముస్తాక్ అలీ టోర్నీ అవసరం లేదన్న ఆ అధికారి వ్యాఖ్యలు శోచనీయం. ఎందుకంటే వారు ఓ దిగ్గజాన్ని అవమానపరిచారు. ఆ తర్వాత దాన్ని పేలవ టోర్నీగా పేర్కొన్నారు. అలాగైతే మరి నిర్వహించడం ఎందుకు?' అని గవాస్కర్ ఘాటుగా స్పందించాడు.

## రద్దయితే బ్రాండ్ విలువలోనూ కోత!

**ముంబై:** ఆటగాళ్లతోపాటు బీసీసీఐకి కూడా తమ ఖజానా పెరిగేందుకు ఐపీఎల్ జరగడం కీలకం. అటు ఈ లీగ్ కున్న బ్రాండ్ విలువ కూడా అంతా ఇంతా కాదు. గతేడాది రూ.51 వేల కోట్లుగా లెక్కించారు. కానీ ఈసారి కరోనా భయంతో లీగ్ నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో బ్రాండ్ విలువ కూడా పడిపోయే అవకాశం ఉంది. ఒకవేళ ఈ ఏడాది ఐపీఎల్ రద్దయితే మాత్రం బ్రాండ్ విలువలో 700 నుంచి 1000 మిలియన్ డాలర్ల (రూ.5200 కోట్ల నుంచి రూ.7500 కోట్లు) వరకు కోత పడనుందని డఫ్ అండ్ ఫెల్ప్స్ అనే సంస్థ పేర్కొంది.

# నాపై కత్తికట్టారు!

- అడుగడుగునా అవమానిస్తున్నారు
- పేషీ లేదు.. పీఏ లేడు.. అటెండర్లు లేరు
- నేను చేయాల్సిన పనులూ సెక్రటరీతోనే
- ఫైళ్లపై సభ్యులు గుడ్డిగా సంతకాలు
- నేనుండగానే ఇన్‌చార్జ్ చైర్మన్ నియామకం
- ఈ విషయంలో గవర్నర్ అధికారాలూ హైజాక్
- నాలుగు నెలలుగా భరిస్తున్నా.. సహిస్తున్నా..
- ఇప్పటికైనా పద్ధతి ప్రకారం జరిగేలా చూడండి
- గవర్నర్‌కు ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్ గోడు
- హరిచందన్‌కు 3 పేజీల లేఖ అందజేత



అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): "నాపై కత్తికట్టారు. అడుగడుగునా అవమానిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా పనిచేయాల్సిన ఏపీపీఎస్సీలో నియమ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు నడుస్తున్నాయి. చైర్మన్ ఆధ్వర్యంలో కమిషన్ తీసుకోవాల్సిన నిర్ణయాలన్నీ సెక్రెటరీ ద్వారానే జరుగుతున్నాయి. ఫైళ్లపై మెంబర్లు గుడ్డిగా సంతకాలు పెడుతున్నారు. ఈ పరిణామం నన్ను తీవ్రంగా కలిచి వేస్తోంది. ఇప్పటి వరకు ఓర్చుకున్నాను. సహించాను" అని ఏపీపీఎస్సీ చైర్మన్ పిన్నమనేని ఉదయభాస్కర్ శుక్రవారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకున్నారు. గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు ఏపీపీఎస్సీలో చోటుచేసుకున్న పరిణామాలను వివరిస్తూ గవర్నర్‌కు మూడు పేజీల లేఖను అందజేశారు.

### గత ప్రభుత్వం నియమించడమే పాపమా?

గత ప్రభుత్వ హయాంలో తాను ఏపీపీఎస్సీ చైర్మన్‌గా రాజ్యాంగ బద్ధమైన పదవిలో నియామకం పొందానని పిన్నమనేని వివరించారు. అయితే, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో తనను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన గవర్నర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజులపాటు కనీసం చాంబర్‌కు వచ్చి కూర్చోలేని పరిస్థితులు కూడా కల్పించారని తెలిపారు. చైర్మన్ ఉండగానే ఎలాంటి సమాచారం, కారణం లేకుండానే మెంబర్ రంగరాజన్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారని, వాస్తవానికి నిబంధనల ప్రకారం ఇన్‌చార్జి చైర్మన్‌ను నియమించే అధికారం గవర్నర్‌కు మాత్రమే ఉంటుందని వివరించారు. కానీ, ఈ వ్యవహారంలో గవర్నర్ అధికారాలను కూడా సెక్రెటరీ లాగేసుకున్నారని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీలో చైర్మన్‌కు కనీసం పేషీ లేకుండా తీసేశారని తెలిపారు. నిబంధనల ప్రకారం.. చైర్మన్ పేషీలో పీఏ ఉండాలి. కానీ, అప్పటి వరకు ఉన్న పీఏని తొలగించారు. అలాగే చైర్మన్ రూం తెరిచేందుకు డోర్ అటెండర్ ఉన్నా అతన్నీ తొలగించారు. పర్సనల్ అటెండర్‌ను సైతం లేకుండా చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన కమిషన్‌లో చైర్మన్‌గా తనకు అనేక ఇబ్బందులు సృష్టించారని ఆందోళన వ్యక్తం చేశారు.

### సర్వం సెక్రటరీనే!

తనకు గత నాలుగు నెలల కాలంలో ఒక్క ఫైలు కూడా పంపించలేదని, చైర్మన్‌తో ప్రమేయం లేకుండానే అన్ని బాధ్యలను సెక్రెటరీనే నిర్వహిస్తున్నారని ఉదయభాస్కర్ పేర్కొన్నారు. కమిషన్‌లో తనకు పూర్తిగా సహాయ నిరాకరణ జరుగుతోందన్నారు. సెక్రెటరీ గానీ, మెంబర్లు గానీ తనతో మాట్లాడే పరిస్థితి లేదన్నారు. కానీ ఈ నాలుగు నెలల కాలంలో అనేక రిక్రూట్‌మెంట్లకు సంబంధించి పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారని గుర్తుచేశారు. చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన బాధ్యతలను, కార్యకలాపాలను సెక్రెటరీ నిర్వహిస్తున్నారని గవర్నర్‌కు వివరించారు. మెంబర్లు కూడా సెక్రెటరీకి పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు. ఎన్ని అవమానాలు జరుగుతున్నప్పటికీ తాను ఆఫీసుకు వెళ్లి వస్తున్నానని వివరించారు. నియమ, నిబంధనల ప్రకారం.. ఏపీపీఎస్సీలో రోజువారీ కార్యకలాపాలు జరిగేలా చూడాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.



### కేంద్రానికి చెప్పారనే

# కన్నెర్ర

- అక్రమాలు బయటపెట్టారని అక్కసు.. ఎస్ఈసీ కుటుంబానికీ బెదిరింపులు
- అక్రమంపై సాక్ష్యాలతో ఈసీకి.. దౌర్జన్యాలపై కోర్టుల్లో కేసులు వేద్దాం
- పార్టీ నేతలకు బాబు పిలుపు.. జనతా కర్ఫ్యూకు మద్దతు

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలను కేంద్రానికి చెప్పారనే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్‌పై వైసీపీ అక్కసు పెంచుకొందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. శుక్రవారం ఉదయం ఆయన అన్ని జిల్లాల పార్టీ నేతలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతల అక్రమాలపై వీలైనన్ని సాక్ష్యాలు సేకరించాలని, బెదిరింపులు, బలవంతపు ఏకగ్రీవాలపై సాక్ష్యాధారాలు సేకరించి స్థానిక ఎన్నికల అధికారులు, ఈసీకి పంపాలని ఆయన పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ఈ అక్రమాలు, దౌర్జన్యాలపై కోర్టుల్లో కేసులు వేయాలని సూచించారు. అటు ప్రజా క్షేత్రంలోనూ, ఇటు న్యాయ క్షేత్రంలోనూ పోరాడాలని చంద్రబాబు నిర్దేశించారు. "స్థానిక ఎన్నికల్లో అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని వైసీపీ నేతలు దుర్మార్గంగా వ్యవహరించారు. ప్రతిపక్షాలవారిని నామినేషన్లు వేయనీయలేదు. వేసినా స్క్రూటినీలో కొన్నింటిని తిరస్కరింపచేశారు. మరికొందరిని భయపెట్టి బెదిరించి ఉపసంహరింపచేశారు. వేలాదిమందిపై తప్పుడు కేసులు పెట్టారు. గత ఎన్నికల్లో రెండుశాతంగా ఉన్న ఏకగ్రీవాలు ఇప్పుడు 24 శాతానికి పెరగడమే దీనికి నిదర్శనం. ఈ అక్రమాలన్నీ ఎస్ఈసీ తన లేఖలో కేంద్రానికి తెలిపారు. దాడులు, దౌర్జన్యాల తీరును వివరంగా రాశారు. అందుకే ఆయనపై కత్తిగట్టారు. చివరకు రమేశ్‌కుమార్ కుటుంబ సభ్యులను కూడా బెదిరించే స్థితికి దిగజారారు" అని చంద్రబాబు విమర్శించారు. ఎన్నికల చట్టాలు, నిబంధనలపై అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలని పార్టీ నేతలను చంద్రబాబు కోరారు. ఏ వ్యవస్థపైనా వైసీపీ నేతలకు గౌరవం లేదని, అందుకే ఎస్ఈసీ రక్షణకు కేంద్ర బలగాలు రావాల్సి వచ్చిందన్నారు.

### ప్రజాస్వామ్యం గొప్పతనమదే..

ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆదివారం జనతా కర్ఫ్యూకు అందరూ సహకరించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కరోనా తీవ్రతపై ప్రజలను అప్రమత్తం చేయాలని, ముందస్తు జాగ్రత్తలపై వారిలో అవగాహన పెంచాలని పార్టీ నేతలకు ఆయన సూచించారు. కరోనా లేనేలేదని, నాలుగువారాలదాకా రానేరాదని వాదించిన సీఎం జగన్, సీఎస్ నీలం సాహ్ని ఇప్పుడు నెలకొన్న పరిస్థితులపై ప్రజలకు సమాధానం చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. సీఎస్ లేఖ రాసిన నాలుగు రోజుల్లోనే విద్యా సంస్థలు, ఆలయాలు, సినిమాహాళ్లు మూసివేశారని, దీనికేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కరోనాపై ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు తలో రకంగా మాట్లాడారని ఆయన విమర్శించారు. ఒక వ్యవస్థ విఫలమైతే మరో వ్యవస్థ కాపాడటమే భారత ప్రజాస్వామ్యం గొప్పదనమని, జగన్ వంటి ఫ్యూడల్ పాలకులు వస్తారన్న ముందు జాగ్రత్తతోనే రాజ్యాంగ నిర్మాతలు ఈ వ్యవస్థల ద్వారా ప్రజాస్వామ్యాన్ని కట్టుదిట్టం చేశారని చంద్రబాబు వివరించారు.




Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com